PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 139 | విజయవాడ, శుక్రవారం 22 డిసెంబర్ 2023 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Friday 22 December 2023 | Rs

జమ్ముకాశ్మీర్‌లో ఆర్మీ వాహనంపై దాడి

- నలుగురు సైనికులు మృతి
- మరో ముగ్గురికి గాయాలు

7

వైఎస్‌ఆర్ పెన్షన్ రూ.3 వేలకు పెంపు

- జనవరి ఒకటి నుంచి అమలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎన్నికలు సమీపిస్తున్న వేళ రాష్ట్ర సర్కారు మరో కీలక నిర్ణయం తీసుకుంది. వైఎస్‌ఆర్ పెన్షన్‌ను రూ.3 వేలకు పెంచుతూ జిఓ 96ను జారీ చేసింది. జనవరి ఒకటి నుంచి పెంచిన పెన్షను అమలులోకి రానున్నట్లు ప్రభుత్వం తెలిపింది. వైఎస్‌ఆర్ పెన్షన్ పేరిట వృద్ధులు, వితంతువులు, చేనేత, కల్లుగీత కార్మికులు, మత్స్యకారులు, ఒంటరి మహిళలు, చర్మకారులు, హెచ్‌ఐవి వ్యాధిగ్రస్తులకు ప్రతినెలా పెన్షన్ పంపిణీ చేస్తున్నారు. 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.2 వేలుగా ఉన్న పెన్షన్ జగన్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రూ.2,250 పెంచింది. 2022లో రూ.2,500, 2023లో జనవరి ఒకటి నుంచి రూ.2,750 పెంచి పంపిణీ చేస్తూ వస్తుంది. దీనిని రూ.3 వేలకు పెంచి జనవరి ఒకటి 2024 నుంచి అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 12 రకాల పెన్షన్‌లో కొత్తగా దరఖాస్తు చేయదలచుకున్న వారు గ్రామ, వార్డు సచివాలయాల్లో సంప్రదించాలి.



పార్లమెంట్ వద్ద నిరసన ప్రదర్శన చేపట్టిన ప్రతిపక్షాల సభ్యులు

ప్రజాస్వామ్యాన్ని కాపాడండి

- ప్రతిపక్షాల నిరసన ర్యాలీ
- మరో ముగ్గురిపై సస్పెన్షన్ వేటు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

లోక్‌సభలో ప్రతిపక్ష ఎంపీలపై సస్పెన్షన్ల పర్వం చివరి రోజు గురువారం కూడా కొనసాగింది. తాజాగా మరో ముగ్గురు ఎంపిలపై సస్పెన్షన్ వేటు వేశారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎంపిలు దీపక్ బైజ్, డికె సురేశ్, నకుల్ నాథ్‌పై స్పీకర్ ఓం బిర్లాలను ఈ శీతాకాల సమావేశాల మొత్తానికి సస్పెండ్ చేస్తున్నట్లు తెలిపారు. దీంతో ఈ శీతాకాల సమావేశాల్లో లోక్‌సభ నుంచి సస్పెన్షన్ కు గురైన ఎంపిల సంఖ్య మొత్తం 100కి చేరింది. అలాగే, ఉభయ సభల్లో కలిపి ఆ సంఖ్య 146కు చేరుకుంది. మరోవైపు, లోక్‌సభ నిరవధికంగా వాయిదా పడింది. పలు బిల్లులకు ఆమోదం తెలిపిన అనంతరం సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ కన్నా ఒకరోజు ముందుగానే లోక్ సభ సమావేశాలను ముగించారు.

తొలుత.. గురువారం లోక్‌సభ కార్యకలాపాలు ప్రారంభం కాగానే.. పెద్ద సంఖ్యలో ప్రతిపక్ష ఎంపిలను సస్పెండ్ చేయడంపై ఈ ముగ్గురు ఎంపిలు నిరసన తెలిపారు. ప్రశ్నోత్తరాల సమయంలో సభలో ప్లకార్డులు ప్రదర్శించడంతో పాటు వెల్లోకి దూసుకెళ్లారు. దీంతో స్పీకర్ ఓం బిర్లా వారికి పలుమార్లు విజ్ఞప్తి చేసినా వినకపోవడంతో పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి ఈ ముగ్గురు ఎంపిల సస్పెన్షన్ కు సంబంధించి తీర్మానం చేయడంతో ఈ ముగ్గురు ఎంపిలపై వేటు పడింది.

ప్రతిపక్షాల నిరసన ర్యాలీ

ప్రస్తుతం పార్లమెంట్ సెషన్‌లో 143 మంది ప్రతిపక్ష ఎంపిలపై మూకుమ్మడి సస్పెన్షన్లపై గురువారం ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఎంపిలు నిరసన ర్యాలీ చేపట్టారు. పార్లమెంట్ భవనం నుంచి సెంట్రల్ ఢిల్లీలోని విజయ్ చౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని రాసిన బ్యానర్, ప్లకార్డులను ప్రదర్శిస్తూ నినాదాలు హోరెత్తించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ బిజెపికి ప్రజాస్వామ్యంపై నమ్మకం లేదని ఆయన విమర్శించారు. "భద్రతా వైఫల్యంపై చర్చించడానికి అనుమతి ఇవ్వాలని లోక్సభ స్పీకర్, రాజ్యసభ ఛైర్మన్ ను కోరుతున్నాం.

ప్రధాని మోడీ, హోం మంత్రి అమిత్ షా దీనిపై పార్లమెంట్‌లో ప్రకటన చేయాలి. లోక్‌సభలో మినహా బయట మీడియాతోనూ, సభల్లోనూ ప్రధాని మోడీ దీని గురించి మాట్లాడారు. భద్రతా వైఫల్యం ఘటన ఎందుకు జరిగింది..? ఎవరు బాధ్యులు..?" అని ఖర్గే ప్రశ్నించారు. ప్రతిపక్షాల'ఇండియా' ఫోరం సభ్యులు శుక్రవారం జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేపట్టనున్నారని ఆయన చెప్పారు.

జిందాల్‌తో ఒప్పందం నిజమే

- విశాఖ ఉక్కు సిఎండి ప్రకటన
- అంతకుముందు బుకాయింపు మాటలు

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

జిందాల్‌తో ఒప్పందం చేసుకున్న విషయం నిజమేనని విశాఖ స్టీల్‌ప్లాంట్ సిఎండి అతుల్‌భట్ ప్రకటించారు. ఒప్పంద వివరాలను బహిర్గతం చేయాలంటూ కార్మికసంఘాలు సుదీర్ఘఆందోళన చేసిన తరువాత గురువారం ఒప్పందం అంశాన్ని ఆయన ధృవీకరించారు. 'జిందాల్‌తో ఆర్‌ఐఎన్‌ఎల్ వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందం చేసుకుంది. ఈ నెల 30న బ్లోయింగ్-ఇన్ చేసేందుకు ప్లాన్ చేసిన బ్లాస్ట్ ఫర్నేస్-3ని ప్రారంభించనున్నాం' అని ఆయన పేర్కొన్నారు. ఈఒప్పందం ప్లాంటుకు వర్కింగ్ కేపిటల్ మద్దతు దొరుకుతుందని తెలిపారు. అంతకుముందు ఆయన కార్మికసంఘాల ముందు బుకాయించే ప్రయత్నం చేశారు. ఒప్పందం వివరాలు తెలపాలని వారు కోరుతుండగా ఆయన తప్పించుకు వెళ్లే ప్రయత్నం చేశారు. స్టీల్ ప్లాంటు కాన్ఫరెన్స్ హాలులో గురువారం సిఎండితో కార్మిక సంఘాల నేతలు సమావేశమైనారు. ఈ సందర్భంగానే జిందాల్‌తో కుదుర్చుకున్న ఒప్పందం గురించి ప్రశ్నించారు. స్టీల్‌ప్లాంటులోకి కార్పొరేట్ శక్తులను తీసుకువచ్చిన అపకీర్తిని మూటగట్టుకో వద్దని వారు సూచించారు. తప్పించుకుపోవడానికి ఆయన ప్రయత్నించారు. కార్మికులు ఆయనను బయటకు వెళ్లనీయకుండా నేలమీద కూర్చుని అడ్డగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని కంపెనీలకు తాము ఒకే నమూనా ఇచ్చామని, టాటా స్టీల్‌తో ఇటువంటి ఒప్పందమే చేసుకున్నామని, సెయిల్‌కు కూడా ఈ తరహా ఒప్పంద పత్రాలే పంపామని అన్నారు. అయితే, ఒప్పంద పత్రాలు బయటపెట్టాల్సిందేనని డిమాండ్ చేసిన కార్మిక సంఘాల నేతలు అక్కడే భైఠాయించారు. జిందాల్ వంటి కార్పొరేట్ కంపెనీని విశాఖ స్టీల్ ప్లాంటులోకి తీసుకురావద్దని, కాదని ఏకపక్షంగా ఆహ్వానిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. వీరి ఆందోళన కొనసాగుతుండగానే అక్కడినుండి వెళ్ళిపోయిన సిఎండి. ఇతర అధికారులు అనంతరం క్లుప్తంగా ప్రకటన విడుదల చేశారు.

ప్రపంచంలో మన పిల్లలు నెంబర్ 1 కావాలి

- విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీలో సిఎం జగన్



ట్యాబ్‌లు అందుకున్న విద్యార్థులతో కలిసి చింతపల్లిలోని జిటిడబ్ల్యుఎహెచ్ స్కూల్లోని తరగతి గదిలో పాఠాలు వింటున్న సిఎం జగన్, చిత్రంలో మంత్రి బొత్స సత్యనారాయణ తదితరులు

ప్రజాశక్తి- పాడేరు టౌన్, చింతపల్లి విలేకరులు (అల్లూరి జిల్లా)

'మన పిల్లలు ప్రపంచంలోనే నెంబర్ వన్‌గా ఎదగాలి' అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు బైజూస్ ప్రీ లోడెడ్ ట్యాబ్‌ల ఉచిత పంపిణీ కార్యక్రమాన్ని గురువారం అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లిలో సిఎం లాంఛనంగా ప్రారంభించారు. 620 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా 4,34,185 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు అందించనున్నారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పది రోజులపాటు ట్యాబుల పంపిణీ కార్యక్రమం ఉంటుందన్నారు. ట్యాబుల పంపిణీ గొప్ప మార్పుగా రాబోయే దశాబ్ద కాలంలో నిలిచిపోతుందన్నారు. డిజిటల్ విప్లవంలో భాగంగా గతేడాది కూడా తన పుట్టిన రోజున రూ.686 కోట్లతో 5.18 లక్షల ట్యాబులను పిల్లలకు, ఉపాధ్యాయులకు పంపిణీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ట్యాబ్‌లు మరమ్మతులకు గురైతే తామే వారం రోజుల్లో రిపేర్ చేసి ఇస్తామన్నారు. రూ.33 వేలు ఖరీదు చేసే ట్యాబ్, కంటెంట్‌ను తమ ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందని తెలిపారు.ఆరో తరగతి నుంచి 12వ తరగతి వరకూ ఉన్న ప్రతి తరగతి గదిలోనూ ఇంటరాక్టివ్ ఫ్లాట్ ఫ్యానెల్స్ (ఐఎఫ్‌పి) ఏర్పాటు చేస్తున్నామన్నారు. రానున్న పదేళ్ల సదృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ పాఠశాలల్లో మార్పులు తీసుకువస్తున్నామని, కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దుతామని చెప్పారు. వచ్చే సంవత్సరం నుంచి ఎనిమిదో తరగతి నుంచి ఫ్యూచర్ స్కిల్స్ సబ్జెక్టును ప్రవేశపెడుతున్నామన్నారు. 15,715 స్కూళ్లలో 32,213 క్లాస్ రూముల్లో ఇప్పటికే ఐఎఫ్‌పిలు పెట్టి డిజిటలైజ్ చేసినట్టు తెలిపారు. ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు స్కూళ్లలో ఇంగ్లీష ల్యాబ్‌లు తీసుకువచ్చామన్నారు. వాటన్నింటిలోనూ 10,038 స్మార్ట్ టివిలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తరగతి గదులన్నీ డిజిటలైజ్ అయ్యే కార్యక్రమం జనవరి 30కి పూర్తవుతుందని ప్రకటించారు.

దుర్బిద్ధితోనే బురదజల్లుతున్నారు

దుబారాగా డబ్బులు ఖర్చు చేస్తున్నామని గిట్టని వారు అంటున్నారని జగన్ విమర్శించారు. తాము ప్రతి పైసా మానవ వనరుల అభివృద్ధికి ఖర్చు చేస్తున్నామన్నారు. ట్యాబ్‌లు చేతిలో ఉంటే పిల్లలు చెడిపోతున్నారని కొందరు దుర్బిద్ధితో తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు హామీలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణ, అరకు ఎంపి మాధవి, పాడేరు ఎమ్మెల్యే కె.భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం నేతల గృహ నిర్బంధం

సిఎం పర్యటన నేపథ్యంలో సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స, అనంతగిరి సిపిఎం జెడ్‌పిటిసి సభ్యులు దీసరి గంగరాజు సహ పలువురిని పోలీసులు గృహ నిర్బంధం చేశారు. అరకులోయలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్‌ను హౌస్ అరెస్టు చేశారు. పెదబయలులో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బొండా సన్నిబాబును అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లారు. చింతపల్లిలో చిన్నయ్యపడాల్‌ను, కొయ్యూరులో సూరిబాబును పోలీసులు నిర్బంధించారు.



చింతపల్లిలో సిఐటియు అల్లూరి జిల్లా అధ్యక్షులు చిన్నయ్యపడాల్‌ను హౌస్ అరెస్టు చేసిన పోలీసులు

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకపోతే 26 తర్వాత ప్రత్యక్ష మద్దతు

- వామపక్ష పార్టీల నిర్ణయం
- మద్దతు కొనసాగించాలని ప్రజలకు విజ్ఞప్తి



సమావేశంలో మాట్లాడుతున్న వి శ్రీనివాసరావు, రామకృష్ణ తదితరులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అంగన్‌వాడీల సమస్యల విషయంలో ప్రభుత్వం స్పందించి వెంటనే సమస్యను పరిష్కరించని పక్షంలో అంగన్‌వాడీలు సాగించే ఉద్యమానికి 26 తర్వాత ప్రత్యక్ష మద్దతు ఇవ్వాలని వామపక్ష పార్టీలు నిర్ణయించాయి. గురువారం సిపిఎం రాష్ట్ర కార్యాలయంలో పది వామపక్ష పార్టీల సమావేశం సిపిఐఎంఎల్ రాష్ట్ర నాయకులు జాస్తి కిషోర్‌బాబు అధ్యక్షతన జరిగింది. దీనికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై వెంకటేశ్వరరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ, కార్యదర్శివర్గ సభ్యులు జి ఓబులేసు, రెండు న్యూడెమొక్రసీ పార్టీల నుండి పి ప్రసాదు, కె పొలారి, రామకృష్ణ, సిపిఐఎంఎల్ లిబరేషన్ నాయకులు హరినాథ్, ఫార్వార్డ్‌బ్లాక్ నాయకులు పివి సుందరరామరాజు, ఆర్‌ఎస్‌పి నాయకులు రవికాంత్ హాజరయ్యారు. అంగన్‌వాడీల సమ్మె జరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై చర్చించారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో వామపక్ష పార్టీల తరపున శ్రీనివాసరావు, రామకృష్ణ, ప్రసాదు మాట్లాడారు. తమ సమస్యలు పరిష్కరించాలని లేనిపక్షంలో సమ్మెకు దిగుతామని నెలరోజుల క్రితమే అంగన్‌వాడీలు ప్రభుత్వానికి నోటీసు ఇచ్చారని తెలిపారు. ప్రభుత్వం అప్పటి నుండి పట్టించుకోకుండా చివర్లో చర్చల పేరుతో కాలయాపనకు ప్రయత్నించిందని, అందులో చిన్న చిన్న అంశాలపై సానుకూలంగా స్పందించినా వాటికీ జిఓ ఇవ్వడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిందని తెలిపారు. అక్కచెల్లెమ్మల సంక్షేమం అని చెబుతున్న సిఎం ఆచరణలో తీవ్ర అన్యాయం చేస్తున్నారని వివరించారు. గ్రాట్యుటీ, వేతన పెంపు గురించి నోరెత్తడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పైగా ప్రభుత్వ సిబ్బంది మధ్య గొడవ పెట్టే విధంగా వ్యవహరిస్తూ ఘర్షణ వాతావరణాన్ని సృష్టిస్తోందని పేర్కొన్నారు. జగన్ పుట్టినరోజు సందర్భంగా అన్నా సమస్యను పరిష్కరిస్తారని అంగన్‌వాడీలు ఎదురు చూస్తున్నారని, ఆశనిరాశ చేయొద్దని సూచించారు. రూ.525 కోట్లు పెట్టి గెస్ట్‌హౌస్ కట్టుకున్నారని, భవనాలపై ఉన్న శ్రద్ధ లక్షమంది అంగన్‌వాడీ మహిళలపై లేదని మండిపడ్డారు. రూ.20 వేల కోట్లు పెట్టి ఎవరూ కోరకపోయినా, వద్దంటున్నా స్మార్ట్ మీటర్లు పెడుతున్నారని, దానివల్ల షిర్డిసాయి ఎలక్ట్రికల్స్, అదానీకి లబ్ధి కలిగించడం, మోడీని సంతృప్తి పరచడం వైసిపి ప్రభుత్వం లక్ష్యంగా కనిపిస్తోందని, రాష్ట్రంలో గెలిపించిన మహిళల సంక్షేమం మాత్రం పట్టించుకోవడం లేదని అన్నారు. అసలు అంగన్‌వాడీల విషయంలో ప్రభుత్వ విధానం ఏమిటో తెలపాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలు కూడా 25 నుండి సమ్మెను ఉధృతం చేస్తామంటున్నారని, ఈలోపే సమస్యను పరిష్కరించాలని

మిగతా 7లో

మంత్రి ఉషశ్రీ మాటలు, ప్రతాపరెడ్డి వ్యాఖ్యలకు నిరసనగా

నేడు రాస్తారోకోలు

- అంగన్‌వాడీ సంఘాల పిలుపు

గవర్నరును తక్షణమే వెనక్కి పిలవండి

- రాష్ట్రపతికి కేరళ ముఖ్యమంత్రి లేఖ

తిరువనంతపురం: కేరళ గవర్నరు అరిఫ్ మహ్మద్ ఖాన్‌ను తక్షణమే వెనక్కి పిలవాలని (రీకాల్ చేయాలని) రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ డిమాండ్ చేశారు. ఆయన గురువారం ఈ మేరకు రాష్ట్రపతికి ఒక లేఖ రాశారు. యూనివర్శిటీ సెనేట్‌లను సంఘీయులతో నింపేయడం, శాసనసభ ఆమోదించిన బిల్లులపై సంతకం చేయకుండా తొక్కిపట్టడం వంటి చర్యల ద్వారా గవర్నరు కేరళ పాలిట విలన్ మాదిరి వ్యవహరిస్తున్నారు. ఇది కేరళ ప్రభుత్వానికి-రాజ్ భవన్‌కు మధ్య దీర్ఘకాలంగా కొనసాగుతున్న ప్రతిష్టంభనకు దారి తీసింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి పినరయి విజయన్ రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు లేఖ రాశారు. గవర్నరును రీకాల్ చేయాలన్న అసాధారణ స్థితికి అరిఫ్ మహ్మద్ ఖాన్ వైఖరే ముఖ్య కారణం. మిస్టర్ ఖాన్ ఈ మధ్య తీవ్ర పదజాలంతో ముఖ్యమంత్రిపై బహిరంగంగా దాడి చేశారు. గవర్నరు అనుచిత ప్రవర్తనపై రాష్ట్ర వ్యాపితంగా విద్యార్థులు నిరసనలకు దిగారు. 'సావర్కర్ కాదు, గవర్నరు కావాలి', 'సంఘీ గవర్నరు గో బ్యాక్' 'మీ పప్పులు ఇక్కడ ఉడకవ్..దిసీజ్ కేరళ' అన్న నినాదాలతో విశ్వవిద్యాలయ కేంపస్‌లు హోరెత్తాయి. రాష్ట్ర నిధులతో నడిచే విశ్వవిద్యాలయాల సెనేట్‌లను సంఘ్ పరివార్ నామినీలతో నింపుతూ ఛాన్సలర్ హోదాలో గవర్నరు అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు. .

డిసెంబర్ 11న తిరువనంతపురంలో తన అధికారిక కారు నుండి దిగిన మిస్టర్ ఖాన్‌కు నల్ల జెండాలతో నిరసన తెలిపిన స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌ఎఫ్ఐ) కార్యకర్తలపై దురుసుగా వ్యవహరించారు. వారికి బహిరంగంగా సవాలు విసిరారు. ఆ తరువాత ముఖ్యమంత్రి విజయన్‌పై అవాకులు చవాకులు పేలారు. "నాకు భౌతికంగా" హాని కలిగించేలా ఎస్ఎఫ్ఐ కార్యకర్తలను ముఖ్యమంత్రి ప్రేరేపిస్తున్నారని బురదచల్లే యత్నం చేశారు. కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్) క్రిమినల్స్ ఇష్టానుసారంగా చెలరేగిపోతున్నారని నిందించారు. డిసెంబర్ 16న, ఖాన్ మలప్పురంలోని కాలికట్ యూనివర్శిటీ క్యాంపస్ గెస్ట్ హౌస్ నుంచి ఎస్ఎఫ్ఐకి నేరుగా సవాల్ విసిరారు. దాంతో ఖాన్ "వెనక్కి వెళ్ళాలి" అని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ

మిగతా 7లో

జనవరి నుంచి వలంటీర్లకు రూ.750 వేతనం పెంపు

- మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

ప్రజాశక్తి- తిరుమల

రాష్ట్రంలోని గ్రామ, వార్డు సచివాలయాల వలంటీర్లకు వచ్చే నెల ఒకటో తేదీ నుంచి రూ.750 వేతన పెంచుతున్నట్లు మంత్రి కారుమూరి నాగేశ్వరరావు తెలిపారు. సిఎం జగన్ పుట్టిన రోజు కానుకగా ఆయన ఈ ప్రకటన చేశారు. గురువారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న మంత్రి ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడారు. 'ప్రస్తుతం వలంటీర్లకు నెలకు రూ.5 వేల గౌరవ వేతనం వస్తోంది. సిఎం జగన్ పుట్టిన రోజు సందర్భంగా వలంటీర్ల వేతనం అదనంగా రూ.750 ఇవ్వబోతున్నాం. జనవరి ఒకటి నుంచి పెంచిన వేతనాన్ని వారు అందుకుంటారు. మొత్తం 5,750 అవుతుంది. ప్రజలకు రేషన్ పకడ్బందీగా ఇప్పిస్తున్నందుకు ఈ నిర్ణయం తీసుకున్నాం. భవిష్యత్తులో వలంటీర్లు మరింత మంచి చేసే అవకాశాన్ని సిఎం జగన్ కల్పిస్తారు.' అని మంత్రి తెలిపారు.

బ్రిజ్ భూషణ్ చేతిలోనే డబ్ల్యుఎఫ్ఐ

- ఎన్నికల్లో ఆయన సన్నిహితుడు సంజయ్ సింగ్ గెలుపు
- మహిళా రెజ్లర్ల ఆగ్రహం
- బోరున ఏడ్చేసిన సాక్షి మాలిక్,
- రెజ్లింగ్ నుంచి తప్పుకుంటున్నానని ప్రకటన



రాజీనామాను ప్రకటిస్తూ భావోద్వేగానికి లోనైన రెజ్లర్లు సాక్షి మాలిక్, వినేష్ ఫోగట్, బజరంగ పునియా

న్యూఢిల్లీ: భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడిగా బిజ్ భూషణ్ సన్నిహితుని గెలుపుతో ఒలింపిక్ పతక విజేత సాక్షి మాలిక్ రెజ్లింగ్‌కు గుడ్‌బై చెబుతున్నట్లు ప్రకటించారు. సంజయ్ సింగ్ గెలుపుతో మహిళా రెజ్లర్లు మళ్లీ వేధింపులకు గురవుతారని, ఈ ఫెడరేషన్‌కి ఓ మహిళ అధ్యక్షురాలు కావాలనుకున్నామని, కానీ అది జరగలేదని, దేశంలో న్యాయం ఎక్కడ దొరుకుతుందో అర్థం కావడం మీడియాముందు భోరున ఏడ్చేశారు.

సంజయ్ సింగ్ గెలుపుతో డబ్లుఎఫ్ఐపై బ్రిజ్ భూషణ్ పట్టు ఎంత బలంగా ఉందో ఈ ఎన్నికల స్పష్టం చేశాయని స్టార్ మహిళా రెజ్లర్ వినేష్ ఫోగట్ విమర్శించారు. తమ కెరీర్ అంధకారంలోకి వెళ్లడం ఖాయమని, తాము ఎక్కడికి వెళ్లాలో కూడా తెలియడం లేదని బజరంగ్ పూనియా ఆవేదన వ్యక్తం చేశారు. భారత రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడి హోదాలో బ్రిజ్‌భూషణ్ సాగించిన లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా ఢిల్లీలో జంతర్ మంతర్‌వద్ద మహిళా రెజ్లర్లు సాగించిన సుదీర్ఘ పోరాటానికి సాక్షి మాలిక్, వినేష్ ఫోగట్, బజరంగ్ పునియా తదితరులు నేతృత్వం వహించిన సంగతి తెలిసిందే. రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడిగా బ్రిజ్ భూషణ్ లేక పోయినా, ఆయన వ్యాపార భాగస్వామి, కుడి భుజంలా వ్యవహరించే సంజయ్ కుమార్ సింగ్‌ను ఆ స్థానంలో ప్రతిష్ఠించడంపై మహిళా రెజ్లర్లు ఆగ్రహంతో కుతకుతలాడుతున్నారు. సాక్షి మాలిక్ తన బూట్లను టేబుల్‌పై ఉంచి, "మేము హృదయపూర్వకంగా పోరాడాము, కానీ బ్రిజ్ భూషణ్ తన కీలుబొమ్మను అధ్యక్షునిగా ఎన్నికయ్యేలా చూసుకున్నారు. ఇది మమ్మల్ని హతాశుల్ని చేసింది. దీనికి నిరసనగా రెజ్లింగ్‌నుంచి తప్పుకుంటున్నాను. . ఈ రోజు వరకు మాకు మద్దతుగా నిలిచిన నా దేశ ప్రజలందరికీ ధన్యవాదాలు." అని గద్గద స్వరంతో చెప్పారు. మరో రెజ్లర్ బజరంగ్ పునియా మాట్లాడుతూ, ఎన్నికలలో బ్రిజ్ భూషణ్ విధేయులు ఎవరూ పోటీ చేయకుండా

మిగతా 7లో

రైతన్నకు ప్రభుత్వం భారీ బకాయిలు

- పేరుకున్న పథకాలు
- మూడు సీజన్ల సున్నా వడ్డీ పెండింగ్
- గత రబీ బీమా కూడా...
- అదనంగా ఈ ఏడాది కరువు, మిచౌంగ్ తుపాన్ పరిహారాలు
- ఒక పట్టాన తేల్చని ప్రభుత్వం
- అన్నదాతల ఎదురు చూపు



ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

కరువూ తుపాన్లతో రైతన్నలు ఆర్థికంగా చితికిపోయి సర్కారీ సాయం కోసం ఆశగా ఎదురు చూస్తుండగా, ప్రభుత్వ పరంగా వారికి అందించాల్సిన సహాయాన్ని పేరపెడుతోంది. తాజా విపత్తు నష్టపరిహారాలనట్టుంచితే, అన్నదాతల సంక్షేమం కోసం అమలు చేస్తామన్న పథకాలకు సకాలంలో నిధులు విడుదల చేయకుండా తాత్సారం చేస్తోంది. రైతులకు ప్రభుత్వం బకాయి పెట్టిన స్కీంలలో గడచిన మూడు సీజన్ల సున్నావడ్డీ, గత రబీ పంటల బీమా ఉన్నాయి. కొత్తగా ఈ ఏడాది ఖరీఫ్‌లో కరువు, మిచౌంగ్ తుపాను ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా, రబీ పంటల బీమా అదనంగా చేరాయి. సున్నావడ్డీ ఇచ్చేదే నామమాత్రం. ఆ క్లెయిములను సైతం సీజన్లకు సీజన్ల వంతున చెల్లించకుండా ప్రభుత్వం పెండింగ్‌లో పెడుతోంది. పంటల బీమా పరిస్థితీ అంతే.

ఏకంగా మూడు కాలాలు

రైతులు బ్యాంకుల్లో తీసుకునే లక్ష రూపాయల్లోపు స్వల్పకాలిక పంట రుణాలను వడ్డీ లేకుండా (సున్నా వడ్డీ) ఇప్పిస్తామని వైసిపి సర్కారు నవరత్నాల్లో హామీ ఇచ్చింది. తీసుకున్న రుణాలు గడువు లోపు తిరిగి చెల్లిస్తే చాలు, వడ్డీ సంగతి ప్రభుత్వమే చూసుకుందన్నారు. అనంతరం మాట మార్చి ముందుగా వడ్డీతో సహా నిర్ణీత కాల వ్యవధిలో రుణాలు చెల్లిస్తే, బ్యాంకులు క్లెయిములు పెట్టాక, అప్పుడు వడ్డీ రైతుల బ్యాంక్ ఖాతాల్లో రీయింబర్స్ చేస్తామన్నారు. ఇ-క్రాప్, గడువు ఇత్యాది పలు ఆంక్షలు పెట్టడంతో రైతులు సున్నావడ్డీ పొందలేకపోతున్నారు. నామమాత్రంగానే సున్నావడ్డీ వస్తోంది. ఆ నిధులు కూడా ఇవ్వకుండా ప్రభుత్వం జాప్యం చేస్తోంది. మామూలుగా అయితే ప్రతి ఏడాదీ అక్టోబర్, నవంబర్‌లో సున్నావడ్డీ రీయింబర్స్ చేస్తోంది. పాత ప్రభుత్వ బకాయిలతో పాటు 2021 ఖరీఫ్ వరకు విడుదల చేసింది. 2021-22 రబీ, 2022 ఖరీఫ్, 2022-23 రబీ సీజన్లకు సున్నావడ్డీ ఇవ్వాలి. డిసెంబర్ వచ్చినా మూడు సీజన్ల సున్నావడ్డీ ఇవ్వకపోవడంతో రైతులు ఎదురు చూస్తున్నారు.

రబీ ఇన్సూరెన్స్ ఎప్పుడు?

2022-23 రబీలో భారీ వర్షాల వలన పలు జిల్లాల్లో పంటలు నష్టపోయాయి. మళ్లీ రబీ వచ్చినా గడచిన రబీ బీమా పరిహారం సెటిల్ కాలేదు. 2022 ఖరీఫ్ నుంచి కేంద్రం ఒత్తిడి మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఫసల్ బీమాలో చేరి కంపెనీలకు అమలు బాధ్యత అప్పగించింది. వాతావరణ బీమాను తానే నిర్వహించింది. ప్రభుత్వం నిర్వహించిన వాతావరణ బీమా పరిహారం కానీ, కంపెనీలు నిర్వహించిన దిగుబడి ఆధారిత బీమా (ఫసల్) పరిహారం కానీ రైతులకు ఇంకా అందలేదు. ఫసల్‌లో కంపెనీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.1,088 కోట్లు రైతుల తరపున ప్రీమియం చెల్లించాయి. పరిహారం జాడ లేదు. రాష్ట్ర ప్రభుత్వం నిధులివ్వాల్సిన వాతావరణ బీమా సైతం ఇవ్వలేదు. గత రబీలో విపత్తులేమీ లేవా అంటే అదేమీ కాదు.

భారీ వర్షాల వలన పంట నష్టపోయిన రైతుల్లో కొంత మందికైనా సర్కారు తృణమో పణమో ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చింది. ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చారంటే విపత్తులున్నట్లే. అలాంటప్పుడు బీమా ఎందుకు రాలేదో అర్థం కాకుండా ఉంది. ఇదిలా ఉండగా, ఈ సంవత్సరం ఖరీఫ్‌లో వచ్చిన మిచౌంగ్ తుపాన్, కరువు ఇన్‌పుట్ సబ్సిడీ జనవరిలో సంక్రాంతికి ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది.



శ్రీకాకుళం జిల్లా పాతపట్నం ఎమ్మెల్యే కారును అడ్డుకుంటున్న అంగన్‌వాడీలు



అల్లూరి జిల్లా చింతపల్లిలో జరిగిన సభలో ముఖ్యమంత్రి జగన్‌కు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ నాయకులు పెంటమ్మ, రాములమ్మ

పదో రోజూ కొనసాగిన అంగన్‌వాడీల సమ్మె

- పాతపట్నం ఎమ్మెల్యే కారు అడ్డగింత
- వివిధ రూపాల్లో నిరసనలు

ప్రజాశక్తి- యంత్రాంగం

కనీస వేతనం రూ.26 వేలు, గ్రాట్యుటీ అమలు తదితర సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె గురువారానికి పదో రోజుకు చేరింది. సమ్మెలో భాగంగా వివిధ రూపాల్లో నిరసన తెలిపారు. శ్రీకాకుళం జిల్లా పాతపట్నంలో సిఎం జగన్ జన్మదిన వేడుకల్లో పాల్గొనేందుకు వెళ్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి కారును కొత్తూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద అడ్డుకున్నారు. ఏదైనా సమస్య ఉంటే తన వద్దకు వచ్చి చెప్పాలని ఎమ్మెల్యే అన్నారు. కారు దిగి వస్తే చెప్పామని అంగన్‌వాడీలు బదులిచ్చారు. దీంతో, వారిని పక్కకు నెట్టేందుకు పోలీసులు ప్రయత్నించడంతో వాగ్వివాదం చోటుచేసుకుంది. అంగన్‌వాడీల వద్దకు ఎమ్మెల్యే వచ్చి మాట్లాడారు. సమస్యలను సిఎం పరిష్కరిస్తారని, అందుకు కొంతసమయం ఇవ్వాలని, సమ్మెను విరమించాలని కోరారు. సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదని అంగన్‌వాడీలు తేల్చి చెప్పడంతో ఎమ్మెల్యే తన కారులో అక్కడి నుంచి వెళ్లిపోయారు. శ్రీకాకుళంలోని అర్బన్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద సమ్మె శిబిరాన్ని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు సందర్శించి సమ్మెకు సంఘీభావం తెలిపారు. అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాల్సి ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగులగొట్టడం సరికాదన్నారు. అంగన్‌వాడీ వర్కర్లు, మినీ వర్కర్లు, హెల్పర్లు ఏళ్ల తరబడి సేవలందిస్తోన్న కనీస వేతనాలు అమలు చేయకపోవడం దారుణమన్నారు. బూర్జలో నాగావళి నదిలో అంగన్‌వాడీలు మానవహారం నిర్వహించారు. విజయనగరం జిల్లా గజపతినగరంలో అంగన్‌వాడీల పోరాటానికి మద్దతుగా పలువురు తల్లులు తమ పిల్లలతో కలిసి సమ్మెలో పాల్గొన్నారు. చిన్నారులంతా 'జగన్ మామయ్యా... మా టీచర్ల జీతాలు పెంచండి'.. వారు సెంటర్‌కు వస్తేనే మేము కూడా సెంటర్‌కు వస్తాం..' అంటూ పలకలపై రాసి నిరసన శిబిరంలో ప్రదర్శించారు.

విశాఖలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద పదో నెంబర్ ఆకారంలో నిల్చొని వినూత్న రీతిలో నిరసన తెలిపారు. అల్లూరి జిల్లా రంపచోడవరంలోని సమ్మె శిబిరంలో ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షులు జి.బేబిరాణి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలపై చర్చలకు పిలిచి ఏ ఒక్క డిమాండ్‌నూ నెరవేర్చలేదన్నారు. విధిలేని పరిస్థితుల్లోనే సమ్మె కొనసాగించాల్సి వస్తోందని తెలిపారు.

అంగన్‌వాడీలపై రాంగోపాల్ వర్మ వ్యాఖ్యలను నిరసిస్తూ తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల సమ్మె శిబిరంలో ఆయన చిత్రపటాన్ని దహనం చేశారు. ఉండ్రాజవరం తహశీల్దార్ కార్యాలయం వద్ద చిన్నారులతో కలిసి అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. కాకినాడలో సమ్మె శిబిరాన్ని 108 ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింహ సందర్శించి మద్దతు ప్రకటించారు.

భీమవరంలో సమ్మె శిబిరాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం సందర్శించి సంఘీభావం తెలిపారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వం వద్ద డబ్బు లేదని చెబుతున్న మాటలు అవాస్తవమని, సంక్షేమ పథకాలకు బటన్ నొక్కుతున్న సిఎం జగన్ అంగన్‌వాడీలకు ఎందుకు బటన్ నొక్కట్లేదని ప్రశ్నించారు. వీరవాసరంలో అంగన్‌వాడీలు ఎండుగడ్డి తింటూ నిరసన తెలిపారు. నరసాపురంలో సమ్మె శిబిరాన్ని ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు (ఐవి) సందర్శించి సంఘీభావం తెలిపారు. సమస్యలు పరిష్కరించకపోతే రానున్న ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వానికి గుణపాఠం తప్పదన్నారు. పాటలు పాడి ఉద్యమం ఆవశ్యకతను వివరించి అంగన్‌వాడీల్లో మనోధైర్యాన్ని నింపారు. ఏలూరులో సమ్మెకు ఎల్ఐసి ఏజెంట్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి గొట్టాపు రవికిషోర్ మద్దతు తెలిపారు. గుంటూరు జిల్లా తుళ్లూరులో అంగన్‌వాడీలు మోకాళ్లపై నిల్చొని ఆకులు తింటూ, పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో చెవిలో పువ్వులతో నిరసన తెలిపారు. బాపట్ల ఐసిడిఎస్ ప్రాజెక్టు వద్ద అంగన్‌వాడీల సమ్మె శిబిరాన్ని ఎమ్మెల్సీ లక్ష్మణరావు సందర్శించి సంఘీభావం తెలిపారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణలో ఏం జరిగిందో మన రాష్ట్ర ప్రభుత్వం గుర్తించాలని కోరారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగలగొడితే అంగన్‌వాడీల గుండెలు పగలగొట్టినట్టేనన్నారు. దర్శిలో అంగన్‌వాడీలు మానవహారం నిర్వహిస్తుండగా అనుమతి లేదంటూ పోలీసులు బెదిరించారు. నెల్లూరులో రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయం వద్ద అంగన్‌వాడీలు కొబ్బరికాయలు కొట్టి రాష్ట్ర ముఖ్యమంత్రి జన్మదినోత్సవం రోజున హామీలు అమలు చేసే విధంగా బుద్ధి పుట్టించాలని వేడుకున్నారు. అక్కడ నుంచి అంగన్‌వాడీ సెంటర్లలో ప్రీ స్కూల్ పిల్లలకు అందజేసే ఆహార పదార్థాలను ఒక మూటగా కట్టుకొని (ఇరుముడి) నెత్తిమీద పెట్టుకొని ప్రదర్శనగా ఐసిడిఎస్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె శిబిరానికి చేరుకున్నారు. వారి పోరాటానికి ఎంఎల్‌ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చేరుకొని సంఘీభావం తెలిపారు. వైఎస్ఆర్ జిల్లా పులివెందుల నియోజకవర్గంలోని వేంపల్లెలో పాపాఘ్ని నదిలో జలదీక్ష చేస్తూ, మైదుకూరులో పచ్చిగడ్డి తింటూ నిరసన తెలిపారు. అనంతపురం కలెక్టరేట్ వద్ద మనీప్లాంట్ మొక్కలను మెడకు చుట్టుకుని, పామిడి, రాయదుర్గంలో చెవిలో పూలు, బ్రహ్మసముద్రంలో కళ్లకు గంతలు కట్టుకుని, శ్రీ సత్యసాయి జిల్లా మడకశిరలో 10 నెంబర్ ఆకారంలో కూర్చొని నిరసన తెలియజేశారు.

ముఖ్యమంత్రికి వినతి

- ప్రధాన డిమాండ్లపై స్పందించకపోవడంతో నల్ల బెలూన్లతో నిరసన

ప్రజాశక్తి- చింతపల్లి (అల్లూరి జిల్లా)

అల్లూరి సీతారాజరాజు జిల్లా చింతపల్లి వేదికగా ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు గురువారం వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి అంగన్‌వాడీ సమస్యలపై చింతపల్లి ప్రాజెక్టు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పెంటమ్మ, రాములమ్మ వినతిపత్రం అందజేశారు. వాటిని పరిష్కరించాలని కోరారు. దీనిపై ముఖ్యమంత్రి స్పందిస్తూ, ఒక్కొక్కటీ పరిష్కరిస్తున్నామని, అన్నీ పరిష్కారం చేయడానికి ఆలోచిస్తామని బదులిచ్చారు. ప్రధాన డిమాండ్లు అయిన వేతనం పెంపు వంటివాటిపై స్పష్టమైన హామీ ఇవ్వలేదు. దీంతో, అంగన్‌వాడీలు ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట నల్లబెలూన్లతో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు చిన్నయ్యపడాల్ పాల్గొన్నారు.



తాడేపల్లిలోని వైసిపి కేంద్రకార్యాలయంలో జగన్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న నాయకులు

జగన్ ప్రజల మనిషి : సజ్జల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల మనిషి అని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో సిఎం జగన్ జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేకు కట్ చేసి పేదలకు దుస్తులు, కుట్టు మిషన్లు పంపిణీ, రక్తదానం వంటి పలు సామాజిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సజ్జల మాట్లాడుతూ.. పవన్‌కల్యాణ్ రాకపోతే తమ మీటింగుకు ప్రజలు రారనుకునే స్థితికి చంద్రబాబు దిగజారారని విమర్శించారు. జగన్‌కు మనుషులంటే ప్రేమ, వారి కష్టాలపై సానుభూతి ఎల్లప్పుడూ వుంటుందని అన్నారు. చంద్రబాబుకు దీర్ఘకాలిక మద్దతు అని చెప్పే పవన్‌కల్యాణ్ సొంతంగా పార్టీ ఎందుకు పెట్టుకున్నారని ప్రశ్నించారు. 2019లో విడివిడిగా పోటీ చేసి ఇప్పుడు ఎందుకు కలుస్తున్నారో టిడిపి, జనసేన ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు మేరుగ నాగార్జున, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, ఎంపి నందిగం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

- 'మధ్యాహ్న భోజన' కార్మికుల యూనియన్
- డైరెక్టర్‌కు లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆ పథకం కార్మికుల యూనియన్ కోరింది. ఈ మేరకు ఆ పథకం డైరెక్టర్‌కు యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి వరలక్ష్మి, దయా రమాదేవి గురువారం లేఖ రాశారు. 20 ఏళ్లుగా పనిచేస్తున్న తమను ప్రభుత్వ కార్మికులుగా గుర్తించి కనీస వేతనాలు ఇవ్వాలని కోరారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ ప్రకారం రూ.10 వేలు వేతనం అమలు చేయాలని, ప్రతినెల 5లోపు బిల్లులు చెల్లించాలని కోరారు. రేషనలైజేషన్ పేరుతో పాఠశాలల విలీనంతో ఉపాధి కోల్పోయిన వారికి భద్రత కల్పించాలన్నారు. మెనూ ఛార్జీలు రూ.20 ఇవ్వాలని, ధరల పెరుగుదలకు అనుగుణంగా బడ్జెట్ పెంచాలని, గ్యాస్ బండను ప్రభుత్వమే సరఫరా చేయాలని అన్నారు. ప్రమాద బీమా సౌకర్యం కల్పించి, అగ్ని ప్రమాదానికి గురైన వారికి నష్టపరిహారం చెల్లించాలని కోరారు. శ్రీకాకుళం జిల్లాలో వంట సమయంలో గాయపడి మృతిచెందిన మలిపెద్ది రమాదేవి కుటుంబానికి రూ.20 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, ఇల్లు నిర్మించి ఇవ్వాలన్నారు. రాజకీయ వేధింపులు ఆపి, గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించొద్దని, ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు. పథకం అమలు చేసేందుకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న వారికి వేతనం ఇవ్వాలని అన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్, యూనిఫాం ఇవ్వాలని కోరారు.

సిఎం పుట్టిన రోజుకు 100 కోట్లా?

- టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు


ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పుట్టిన రోజు పేరుతో ప్రకటనల కోసం రూ.100 కోట్ల ప్రజాధనాన్ని మంచినీళ్ల ప్రాయంగా ఖర్చు చేయడం సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెత్తందారీ పోకడలను తెలియజేస్తోందని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు విమర్శించారు. నెలకు రూపాయే గౌరవ వేతనం తీసుకుంటానని గొప్పలు చెప్పి ఇలా రూ.కోట్లు ఖర్చు చేయడం రాచరిక పోకడలకు అద్దం పడుతోందని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రిగా ఇది చివరి పుట్టినరోజు అంటూ పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలకు వైసిపి రంగులు వేయడం, సొంత పత్రికకు ప్రకటన ఇవ్వడం, కొంతమంది కాంట్రాక్టర్లకు దోచిపెట్టడంపై ఉన్న శ్రద్ధ ప్రజలకు ఉపయోగకరమైన పనులు చేయడంపై ముఖ్యమంత్రికి లేకపోవడం బాధాకరమని అన్నారు. వేతనాలు పెంచాలని అంగన్‌వాడీలు ప్రజాస్వామ్యబద్ధంగా సమ్మె చేస్తుంటే కనీసం స్పందించడం లేదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ముఖ్యమంత్రి ఫ్లెక్సీలను విద్యార్థులే స్వయంగా తయారుచేసి ప్రదర్శించాలని ఆదేశాలివ్వడం సిగ్గుచేటు కాదా? అని ప్రశ్నించారు.

ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ విద్యార్థుల జీవితాల్ని జగన్ రోడ్డున పడేశారని మాజీ మంత్రి కెఎస్ జవహర్, ఆ పార్టీ అధికార ప్రతినిధి గురజా మాల్యాద్రి విమర్శించారు. ట్యాబుల పంపిణీ సభలో సిఎం విద్యార్థులనుద్దేశించి రాజకీయ విద్వేష ఉపన్యాసం చేయడం తగదన్నారు. గతేడాది కంటే ఈ ఏడాది అందించే ట్యాబుల్లో 25,379 కోత పెట్టింది నిజం కాదా? అని విలేకరుల సమావేశంలో ప్రశ్నించారు.

రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి-పెద్దవడుగూరు (అనంతపురం జిల్లా)



గోవిందు (ఫైల్ ఫోటో)

అప్పులబాధ తాళలేక రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండల కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పెద్దవడుగూరు గ్రామానికి చెందిన గోవిందు(62) తనకున్న 3.50 ఎకరాల పొలంతోపాటు మరో 1.50 ఎకరాలను కౌలుకు తీసుకుని మూడేళ్లుగా పత్తి పంటను సాగు చేస్తున్నారు. పంట సాగు కోసం దాదాపు రూ.7 లక్షల వరకు అప్పులు చేశారు. గడిచిన మూడేళ్లలో ఒక్క సారి కూడా పంట ఆశించిన స్థాయిలో చేతికందలేదు. దీంతో అప్పులు తీర్చడం సాధ్యం కాకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. ఈ క్రమంలో తాను సాగు చేసిన పొలంలోనే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేశారు. గోవిందుకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

రైతుల ఆత్మహత్యలు సర్కారు హత్యలే

- లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న రైతుల ఆత్మహత్యలు జగన్ ప్రభుత్వ హత్యలు అని టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ విమర్శించారు. ప్రభుత్వం ఆదుకోకపోవడం వల్లే అన్నదాతల ఆత్మహత్యలు జరుగుతున్నాయని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలం వీర్లపాలెంలో కిశోర్‌బాబు అనే రైతు ఆత్మహత్యకు పాల్పడటం రాష్ట్రంలో రైతన్నల దుస్థితికి అద్దం పడుతోందని తెలిపారు. తుపాను వల్ల ఐదెకరాల మినుము పంట నష్టపోయారని, చేసిన అప్పులు తీర్చే మార్గం లేక కిశోర్ బలవన్మరణానికి పాల్పడ్డారని అన్నారు. కౌలు రైతుల ఆత్మహత్యల్లో దేశంలోనే రాష్ట్రం రెండో స్థానంలో, రైతుల ఆత్మహత్యల్లో 3వ స్థానంలో ఉందన్నారు. రైతుల అధైర్యపడి ఆత్మహత్యలు చేసుకోవద్దని కోరారు. మూడు నెలల్లో ప్రజా ప్రభుత్వం వచ్చి ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు.

బిగ్‌బాస్ విజేత పల్లవి ప్రశాంత్‌కు రిమాండ్

- బెయిల్ పిటిషన్‌పై తీర్పు వాయిదా

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

బిగ్ బాస్ సీజన్ 7 విజేత పల్లవి ప్రశాంత్, అతని సోదరుడు మహావీర్‌కు నాంపల్లి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. బిగ్‌బాస్ కార్యక్రమం ఫైనల్ అనంతరం అన్నపూర్ణ స్టూడియో వద్ద జరిగిన విధ్వంసం కేసులో వారిద్దరితోపాటు పలువురిని పోలీసులు అరెస్టు చేశారు. వారిని నాంపల్లి కోర్టులో హాజరుపర్చగా, న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు. దాంతో జూబ్లీహిల్స్ పోలీసులు వారిని చంచల్‌గూడ జైలుకు తరలించారు. పల్లవి ప్రశాంత్‌కు బెయిలు కోసం న్యాయవాది వేణుగోపాల్, వినోద్ కుమార్, మరో ఇద్దరు కలిసి నాంపల్లి క్రిమినల్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సరైన భద్రత లేకపోవడం వల్లే అన్నపూర్ణ స్టూడియో వద్ద అలాంటి పరిణామాలు జరిగాయని.. ప్రశాంత్‌కు బయట జరిగిన ఉదాంతం తెలియదని న్యాయవాది వేణుగోపాల్ న్యాయమూర్తి ఎదుట చెప్పారు. పల్లవి ప్రశాంత్‌కు బెయిల్ మంజూరు చేయాలని కోరారు. వాదనలు విన్న న్యాయమూర్తి తీర్పును శుక్రవారానికి వాయిదా వేశారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

సిఎఫ్‌డి లీగల్ సెల్ ఛైర్మన్‌గా సుంకర రాజేంద్రప్రసాద్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



రాష్ట్రంలో పోలీసులు, ప్రభుత్వ అధికారులు, రాజకీయ పార్టీల నేతల విద్వేషాలు, అరాచకాలు, దాడుల ఫలితంగా నష్టపోయిన బాధితులకు ఉచితంగా న్యాయ సేవలు అందించేందుకు సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ ఆధ్వర్యంలో ప్రముఖ హైకోర్టు సీనియర్ న్యాయవాది సుంకర రాజేంద్రప్రసాద్ ఛైర్మన్‌గా లీగల్ సెల్ ఏర్పాటైంది. ఈ లీగల్ సెల్‌లో ప్రముఖ న్యాయవాదులు ముప్పాళ్ల సుబ్బారావు, నర్రా శ్రీనివాసులు, పివిజి ఉమేష్ చంద్ర, ఎం అశ్విని కుమార్, కె అజయ్ కుమార్, సిఎస్‌పి సురేష్ కుమార్, జంపని శ్రీదేవి, కె అరుణ, పాలేపు వెంకట నరసింహారావు సభ్యులుగా వుంటారని సిఎఫ్‌డి ప్రధాన కార్యదర్శి నిమ్మగడ్డ రమేష్ కుమార్, సహాయ కార్యదర్శి వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజకీయాలకు అతీతంగా వివిధ కారణాలతో బాధితులుగా మారి అనేక సమస్యలను ఎదుర్కొంటున్న నిస్సహాయులకు చేయూతను అందించటమే లక్ష్యంగా ఈ లీగల్‌సెల్ పనిచేస్తుందని వారు తెలిపారు. ఈ లీగల్ సెల్‌ను రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల్లో కూడా ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ప్రజలు న్యాయ సహాయం కోసం 18004250264 టోల్ ఫ్రీ నెంబర్‌కు గానీ, సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ మెయిల్‌కు గానీ ఫిర్యాదు చేయాలని కోరారు.

జెన్కో యూనిట్‌లో కూలిన హాఫర్

ప్రజాశక్తి-ముత్తుకూరు

నేలటూరు ఎపి జెన్కోలో గురువారం థర్మల్ విద్యుత్ కేంద్రం మొదటి యూనిట్లో హాఫర్ కూలింది. బూడిద తొలగించకపోవడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. మెయింటెనెన్స్ నిర్వహిస్తున్న నాగార్జున ఇంజనీరింగ్ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ నిర్లక్ష్య వైఖరి, ఉన్నతాధికారులతో కుమ్మక్కవడం, అధికార పార్టీ నాయకుల అండదండలు ఇందుకు కారణమనిఎపి జెన్కో థర్మల్ విద్యుత్ కేంద్రం పరిరక్షణ కమిటీ కన్వీనర్ ఎం మోహన్‌రావు విమర్శించారు. దీనిపై వెంటనే సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. మొదటి యూనిట్ విద్యుత్ ఉత్పత్తిని వెంటనే పునః ప్రారంభించాలన్నారు. బాధ్యులైన వారిపై చర్యలు చేపట్టాలని కోరారు.

జీతాలు పెంచం

- గ్రాట్యుటీపై కేంద్రం చెప్పాలి
- అంగన్‌వాడీలు సమ్మె విరమించాలన్న మంత్రి ఉషశ్రీ



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

చాలీచాలని జీతాలతో బతకడం కష్టం ఉందంటూ అంగన్‌వాడీలు చేస్తున్న విజ్ఞప్తులను ప్రభుత్వం బేఖాతరు చేసింది. ఉద్యోగ విరమణ చేసిన తరువాత గంజితాగడానికైనా వీలుగా గ్రాట్యుటీని ఇవ్వాలన్న కోరికను సైతం తమ పరిధిలోనిది కాదంటూ తిరస్కరించింది. రాష్ట్ర సచివాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలోమహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి ఉషశ్రీ చరణ్ ఈ మేరకు ప్రకటన చేశారు. దీనికి సంబంధించి విలేకరుల అడిగిన ప్రశ్నలకు సమాధానాలు దాటవేశారు. జీతాలు పెంచకపోయినా సమ్మెను విరమించాలని అంగన్‌వాడీలను కోరారు. సిఎం సానుకూలంగా ఉన్నారని చెప్పారు. వేతనాలు పెంచడానికి ఇది సమయం కాదని విలేకరుల ప్రశ్నకు జవాబుగా చెప్పారు. గ్రాట్యుటీపై పదేపదే ప్రశ్నించడంతో ఆ విషయం కేంద్రానికి రాశామని, నిర్ణయం కేంద్ర ప్రభుత్వమే తీసుకోవాలని చెప్పారు మహిళా సంక్షేమమే ధ్యేయంగా మ్యానిఫెస్టోను ఖచ్చితంగా అమలు చేస్తున్నామని చెప్పారు. వైసిపి మ్యానిఫెస్టోనూ ప్రదర్శించారు. 16,575 అంగన్‌వాడీ అద్దె భవనాలకు రూ.66.54 కోట్లు మంజూరు చేశామని తెలిపారు. 48,770 సెంటర్లకు చీపుర్లు, బకెట్లు, ముగ్గులు, ఫినాయిల్ కోసం రూ.7.81 కోట్లు ఇచ్చామని పేర్కొన్నారు. అలాగే గోడల పెయింటింగ్ కోసం రూ.6.36 కోట్లు నిధులు విడుదల చేసినట్లు పేర్కొన్నారు. హెల్పర్లను కార్యకర్తలుగా నియమించేందుకు వయో పరిమితిని 45 సవత్సరాల నుండి 50 సంవత్సరాలకు పెంచామని పేర్కొన్నారు. అలాగే నెలకు ఒకసారి టిఎ/డిఎ క్లెయిమ్ చేసుకునేందుకు ప్రభుత్వం అధికారం ఇచ్చిందని పేర్కొన్నారు. వర్కర్లు, హెల్పర్లకు గరిష్ఠ వయో పరిమితిని 62 సంవత్సరాలుగా నిర్ణయించారని పేర్కొన్నారు. వయస్సు నిండిన వారికి సర్వీసు ప్రయోజనాలనూ ఇచ్చామని తెలిపారు. వర్కర్లకు లక్ష, హెల్పర్లకు రూ.40 వేలు అందించేందుకు నిర్ణయించామని దీనికోసం 20న జిఓలు ఇచ్చామని పేర్కొన్నారు. అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి సంక్షేమ పథకాలు ఇవ్వడం లేదని విలేకరులు ప్రశ్నించగా సమాధానం ఇవ్వలేదు. మ్యానిఫెస్టో ఇచ్చి కావాలంటే చూసుకోండని అన్నారు.అంగన్‌వాడీ సెంటర్ల తాళాలు పగుల కొట్టిన వారిపై చర్యలు తీసుకుంటారా అని విలేకరులు ప్రశ్నించగా, సెంటర్ల నిర్వహణకోసం జిల్లాల కలెక్టర్లు నిర్ణయం తీసుకుంటున్నారని తెలిపారు. వారికి ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందా అని విలేకరులు ప్రశ్నించగా దానికి సమాధానం దాటవేశారు. విలేకరుల సమావేశం అనంతరం మహిళా శిశుసంక్షేమశాఖ ఉన్నతాధికారి మాట్లాడుతూ తాళాలు పగుకొట్టించి స్వాధీనం చేసుకునే అధికారం కలెక్టర్లకు ఉంటుందని విలేకరులకు తెలిపారు.

మంత్రి మాటలు, ప్రతాపరెడ్డి వ్యాఖ్యలకు నిరసనగా నేడు రాస్తారోకోలు

- అంగన్‌వాడీ సంఘాల పిలుపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి ఉషశ్రీ చరణ్ మాటలకు, ఫుడ్ కమిషన్ ఛైర్మన్ చింతా ప్రతాపరెడ్డి వ్యాఖ్యలకు నిరసనగా శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా రాస్తారోకోలు నిర్వహించాలని అంగన్వాడీ సంఘాల నాయకులు కె సుబ్బరావమ్మ, జె లలితమ్మ, విఆర్ జ్యోతి పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి 11:30 గంటల వరకు రాస్తారోకోలు, నిరసనలు చేపడుతామన్నారు. ఈ మేరకు ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ అసోసియేషన్, ప్రగతిశీల అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్‌ల తరపున వారు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.

అంగన్‌వాడీలకు వేతనాలను పెంచాలని, గ్రాట్యూటీ అమలు చేయాలని సమ్మె చేస్తుంటే.. రూ.16 కోట్ల విలువ చేసే చీరలు ఇచ్చామనిమంత్రి ఉషశ్రీ చరణ్ ప్రకటన చేయడం సిగ్గుచేటని తెలిపారు. మొబైల్ కొనుగోలుకు ఇచ్చిన రూ.85 కోట్లు, రూ.12 కోట్లు రీచార్జీ కోసం ఇచ్చేది కూడా అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణ కోసమని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మొబైల్స్ పూర్తి స్థాయిలో పనిచేయక పోవడంతో సొంత మొబైల్స్ వాడుతున్నారని తెలిపారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని నాలుగున్నరేళ్లుగా అనేక పర్యాయాలు అధికారులు, మంత్రి దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటికీ వేతనాలను పెంచనందునే సమ్మెలోకి పోయామని తెలిపారు. అలాగే చింతా ప్రతాపరెడ్డి అంగన్‌వాడీల పట్ల నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారని, తన వైఖరిని మార్చుకోకపోతే అంగన్‌వాడీ కార్యకర్తలు తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు.

ఎస్‌ఐ అభ్యర్థులపై హైకోర్టు ఆగ్రహం

ప్రజాశక్తి-అమరావతి

ఎస్‌ఐ అభ్యర్థుల కొలత వ్యవహారానికి సంబంధించిన కేసులో అభ్యర్థులు అఫిడవిట్లు దాఖలు చేసిన తీరును హైకోర్టు తీవ్రంగా ఆక్షేపించింది. బేషరతుగా క్షమాణలు చెబుతూ అఫిడవిట్ దాఖలు చేయాలని తేల్చి చెప్పింది. హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగా మరోసారి అఫిడవిట్లను దాఖలు చేస్తామని అభ్యర్థుల తరపున న్యాయవాది చెప్పడంతో విచారణ ఈ నెల 26కు వాయిదా వేస్తున్నట్లు జస్టిస్ జి నరేందర్, జస్టిస్ ఎన్ విజయ్‌తో కూడిన ధర్మాసనం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

ఎస్‌ఐ పోస్టుల భర్తీ కోసం 2018లో నోటిఫికేషన్ తర్వాత నిర్వహించిన శారీరక దారుఢ్య పరీక్షలో ఎత్తు విషయంలో అర్హత సాధించిన తాము 2023లో నిర్వహించిన పరీక్షలో అనర్హులుగా ప్రకటించారంటూ 24 మంది అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. వీరికి హైకోర్టు ఆవరణలోనే ఎత్తు కొలతలను కొలిపించడంతో వారి వాదన అవాస్తమని తేలింది. దీంతో పిటిషనర్ల భవిష్యత్తును పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు వారికి రూ.లక్ష చొప్పున జరిమానాకు బదులు బేషరతుగా క్షమాపణలు చెప్పాలంది. సామాజిక సేవ శిక్ష ఖరారు చేసే విషయంతో తగిన ఉత్తర్వులు జారీ చేస్తామంది.

అవి తాత్కాలిక ఉత్తర్వులే

సిఎం క్యాంపు ఆఫీసుల తరలింపు కేసులో హైకోర్టు స్పష్టీకరణ

ప్రజాశక్తి-అమరావతి

ఉత్తరాంధ్ర అభివృద్ధి పర్యవేక్షణ పేరుతో సిఎం క్యాంపు కార్యాలయాల తరలింపునకు సంబంధించిన జిఓ 2283 యథాతథ స్థితిని (స్టేటస్ కో) కొనసాగించాలన్న ఉత్తర్వులు తాత్కాలికమని న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు ప్రకటించారు. క్యాంపు కార్యాలయాల పేరుతో ఆఫీసులు తరలిస్తారనే ఆందోళన పిటిషనర్లలో ఉందని, ఈ నేపథ్యంలో వారు దాఖలు చేసిన వ్యాజ్యాలను త్రిసభ్య ధర్మాసనం విచారణ చేపట్టే వరకు స్టేటస్‌కో ఉత్తర్వులు అమల్లో ఉంటాయని స్పష్టం చేసింది.

కార్యాలయాల ఏర్పాటుకు స్థలాల కేటాయింపు చేయలేదని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాదులు సి సుమన్, మహేశ్వరరెడ్డి చెప్పారు. ఈ వ్యవహారంపై యథాతథ స్థితి ఉత్తర్వులు ఇవ్వడం అన్యాయమన్నారు. త్రిసభ్య ధర్మాసనాన్ని ఏర్పాటు చేయాలని చీఫ్ జస్టిస్‌ను కోరతామని చెప్పారు. దీనిపై స్పందించిన హైకోర్టు.. పిటిషనర్ల ఆందోళనను పరిగణనలోకి తీసుకోవాల్సిన బాధ్యత తమపై ఉందని చెప్పింది. త్రిసభ్య ధర్మాసనం వ్యాజ్యాలను విచారణకు స్వీకరించే వరకు స్వల్పకాలం మాత్రమే తాము ఇచ్చే ఆదేశాలు అమల్లో ఉంటాయని పేర్కొంది. ఈ మేరకు ఇచ్చిన మౌఖిక ఆదేశాలపై స్పష్టత ఇస్తామని తెలిపింది.

క్యాంపు కార్యాలయాలు విశాఖకు తరలింపును జిఓను సవాల్ చేస్తూ రైతులు దాఖలు చేసిన పిటీషన్లను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు త్రిసభ్య ధర్మాసనానికి నివేదించారు. త్రిసభ్య ధర్మాసనం తగిన ఉత్తర్వులు జారీ చేసే వరకు సిఎం క్యాంపు కార్యాలయాల తరలింపునకు చర్యలు తీసుకోబోమని ప్రభుత్వం హైకోర్టుకు హామీ ఇచ్చింది. దీనిని రికార్డుల్లో నమోదు చేసిన సింగిల్ జడ్జి అందుకు అనుగుణంగా ఉత్తర్వులు జారీ చేశారు.

సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మెకు సంపూర్ణ మద్దతు

స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ జెఎసి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సమాన పనికి సమాన వేతనం, హెచ్‌ఆర్ పాలసీ అమలు, రెగ్యులరైజేషన్, పార్ట్‌టైం, గెస్ట్‌లను ఫుల్‌టైంగా మార్చాలని తదితర సమస్యలకు పరిష్కారం కోరుతూ.. నిరవధిక సమ్మె చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ఎపి స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్, టీచర్స్ జెఎసి ప్రకటించింది. ఈ మేరకు జెఎసి ఛైర్మన్ ఎవి నాగేశ్వరరావు, కో-ఛైర్మన్ ఇ విజయ్‌కుమార్ రాజు, కోశాధికారి డి దమయంతి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉద్యోగుల న్యాయమైన సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఇతర శాఖల, సంస్థల ఉద్యోగుల సంఘాలు వీరి సమ్మెకు బాసటగా నిలవాలని పిలుపునిచ్చారు. ఎక్కడా లేని విధంగా పార్ట్‌టైం, గెస్ట్‌ల పేరుతో అతి తక్కువ వేతనాలతో ఎస్ఎస్ఎ ఉద్యోగులతో పనిచేయించుకుంటున్నారని తెలిపారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్, సామాజిక భద్రత పథకాలు అమలు కావడం లేదని పేర్కొన్నారు. ఇతర ఉద్యోగులకు వర్తిస్తున్న పిఎఫ్, ఇఎస్ఐ అమలు కావడం లేదని అన్నారు. చనిపోయినా పట్టించుకునే పరిస్థితి లేదని, వేతన బకాయిలు నెలల తరబడి ఉంటున్నాయన్నారు.

లాడ్జిలో ఎన్ఆర్ఐ ఆత్మహత్య

ప్రజాశక్తి- తిరుపతి సిటీ

తిరుపతిలోని ఓ లాడ్జిలో ఎన్ఆర్ఐ ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆలస్యంగా గురువారం వెలుగులోకి వచ్చింది. ఈస్ట్ పోలీసుల కథనం మేరకు.. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరుకు చెందిన ఎన్ఆర్ఐ చిగురుకోట ఉపేంద్ర కుమార్ (52) మంగళవారం తిరుపతి పెద్ద కాపు వీధి లేఅవుట్‌లోని ఓ లాడ్జిలో గది అద్దెకు తీసుకున్నారు. రెండు రోజులైనా ఆయన గది నుంచి బయటకు రాకపోవడంతో గమనించిన లాడ్జి సిబ్బంది గురువారం ఉదయం పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని గది తలుపులు బద్దలు కొట్టారు. గదిలోపల ఉపేంద్ర కుమార్ ఫ్యాన్‌కి ఉరేసుకొని మృతి చెంది ఉన్నారు. కుటుంబ సభ్యులకు సంమాచం అందించి, పోస్టుమార్టం నిమిత్తం మతదేహాన్ని రుయా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు ఈస్ట్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.



విజ్ఞాన మందిరంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న విజయకుమార్‌రెడ్డి, పోసాని కృష్ణమురళి

నంది నాటకోత్సవ ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

రాష్ట్ర స్థాయి నంది నాటకోత్సవ తుది ప్రదర్శన పోటీలకు సంబంధించిన ఏర్పాట్లను రాష్ట్ర చలన చిత్ర టివి, నాటక రంగ అభివృద్ధి సంస్థ చైర్మన్ పోసాని కృష్ణమురళి గురువారం పరిశీలించి అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. గుంటూరులో శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఈ నెల 23 నుంచి 29 తేదీ వరకు తుది ప్రదర్శనల పోటీలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆయన వేదిక, సీటింగ్ గ్యాలరీలు, ఆవరణ వీక్షించారు. నాటకోత్సవాలకు అవసరమైన అన్ని ఏర్పాట్లకు సంబంధిత జిల్లా శాఖల అధికారులను సమన్వయం చేసుకోవాలని సూచించారు. ప్రజలు వీక్షించే విధంగా విజ్ఞాన మందిరం బయట ఖాళీ స్థలంలో ఎల్ఇడి డిస్ప్లేను ఏర్పాటు చేయాలన్నారు. కళాకారులకు బస, భోజన, ప్రయాణ వసతుల కల్పనలో లోపాలు లేకుండా చూడాలని సూచించారు. ఆయన వెంట రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ కమిషనర్ తుమ్మా విజయ్ కుమార్‌రెడ్డి, ఎఫ్‌డిసి జనరల్ మేనేజర్ శేషసాయి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి ప్రభాకరరెడ్డి, సమాచార శాఖ ఉప సంచాలకులు అబ్దుల్ రఫీక్, విశ్రాంత జాన్సన్, రెడ్‌క్రాస్ జిల్లా వైస్ చైర్మన్ రామచంద్రరాజు ఉన్నారు.



బజాజ్ ఆటో 'పల్సర్ మోనియా' కార్యక్రమం

ముంబయి : ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీ బజాజ్ ఆటో తాజాగా బజాజ్ పల్సర్ మేనియా మాస్టర్స్ ఎడిషన్‌ను నిర్వహించినట్లు తెలిపింది. ముంబయిలో జరిగిన ఈ కార్యక్రమానికి 100 నగరాల నుంచి 2500పైగా మంది హాజరయ్యారని పేర్కొంది. ఇందులోని ప్రముఖ కళాకారులచే స్పెల్ బౌండింగ్ ప్రదర్శనలు, మైమర్చిపోయే స్టంట్ షోలు, వివిధ వినోద కార్యక్రమాలు వీక్షకుల్ని విపరీతంగా ఆకట్టుకున్నాయని ఆ సంస్థ తెలిపింది.

ఉద్యోగ భద్రత కల్పించండి

- రాష్ట్ర వ్యాప్తంగా ఎస్ఎస్ఎ ఉద్యోగుల ఆందోళన
- విద్యారంగంలో కాంట్రాక్ట్ ఉద్యోగుల పాత్ర కీలకం : ఎమ్మెల్సీ లక్ష్మణరావు

ప్రజాశక్తి-యంత్రాంగం

సమాన పనికి సమాన వేతనం, హెచ్ఆర్ పాలసీ అమలు, రెగ్యులరైజేషన్, ఉద్యోగ భద్రత తదితర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సర్వ శిక్షా అభియాన్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమ్మె రెండో రోజు కొనసాగింది. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ రూపాల్లో ఆందోళనలు చేపట్టారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. ఎస్ఎస్ఎ ఉద్యోగుల న్యాయమైన కోరికల పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

బాపట్ల కలెక్టరేట్ వద్ద సమ్మెలో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు పాల్గొని ఉద్యోగులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల పాత్ర అత్యంత కీలకమైందన్నారు. ఆయా ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో జనవిజ్ఞానవేదిక రాష్ట్ర కార్యదర్శి కుర్రా రామారావు పాల్గొన్నారు. విజయనగరంలో సమ్మెను ఉద్దేశించి సమగ్ర శిక్ష కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు జెఎసి రాష్ట్ర అధ్యక్షులు బి.కాంతారావు మాట్లాడుతూ ఎస్ఎస్ఎలో పనిచేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులను రెగ్యులర్ చేసి, సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వేతనంతో కూడిన మెడికల్ లీవులు మంజూరు చేయాలని, గ్రాట్యూటి, రూ.20 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్స్ తక్షణమే అమలు చేయాలని కోరారు. అనంతపురంలో ర్యాలీ చేపట్టారు. కలెక్టరేట్ ఎదుట ఉద్యోగులు క్యాలీ ఫ్లవర్‌లు చెవిలో పెట్టుకుని నిరసన తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలో నిరసన ర్యాలీ చేపట్టారు. ఆర్‌డిఒ కార్యాలయం వద్ద బైఠాయించి సమ్మెను కొనసాగించారు. విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేశారు. అనకాపల్లి డిఇఒ కార్యాలయం ఎదుట, అల్లూరి జిల్లా డుంబ్రిగుడలో నిరసనలు తెలిపారు. కృష్ణా, పల్నాడు, నెల్లూరు, కర్నూలు, చిత్తూరు జిల్లాల్లో కలెక్టరేట్ల ఎదుట ధర్నా చేశారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ ఎదుట ఎస్ఎస్ఎ ఉద్యోగుల సమ్మెకు ఎస్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి మద్దతు తెలిపారు. ఏలూరు కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన కొనసాగించారు. భీమడోలులో విద్యాశాఖ ఉన్నతాధికారులకు సమ్మె నోటీసును అందించారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో సమ్మె శిబిరాన్ని ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ భీమవరం డివిజన్ కార్యదర్శి దండు శ్రీనివాసరాజు సందర్శించి సంఘీభావం తెలిపారు.



అనంతపురం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఎస్ఎస్ఎ ఉద్యోగులు

జిఓ 27ని రద్దు చేయాలి

- రాష్ట్రవ్యాప్తంగా న్యాయవాదుల నిరసన, ర్యాలీ



రాజమహేంద్రవరం కోర్టుల ప్రాంగణంలో రిలే దీక్షలో కూర్చొన్న న్యాయవాదులు

ప్రజాశక్తి - యంత్రాంగం

భూహక్కు చట్టంపై విడుదల చేసిన జిఒ 27ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం రాష్ట్ర వ్యాప్తంగా న్యాయవాదులు దీక్షలు, ర్యాలీలు చేపట్టారు. ఈ చట్టం హేతుబద్ధంగా లేదని, ప్రజల హక్కులు, భద్రత కోల్పోతారని, రక్షణ కొరవడుతుందని వారు పేర్కొన్నారు. ప్రజలకు నష్టపరిచే ఈ జిఒను రద్దు చేయాలని తమ వంతు బాధ్యతగా నిరసన తెలువుతున్నామన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులు నిరసన దీక్ష చేపట్టారు. రాజమండ్రి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు హాజరై సంఘీభావం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు ముప్పాళ్ల సుబ్బారావు, రాజమండ్రి బార్ అసోసియేషన్ కార్యదర్శి కవి హనుమంత రావు పాల్గొన్నారు. కర్నూలు ధర్నా చౌక్‌లో న్యాయవాదులు 11వ రోజు దీక్షలు చేపట్టారు. పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ నాయకులు ఇ పుల్లారెడ్డి, ప్రజానాట్యమండలి కళాకారులు మద్దతు తెలిపారు. తిరుపతిలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యాన కోర్టు ప్రాంగణం నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆర్‌టిసి బస్టాండ్ ముందు ఉన్న అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రాన్ని అందజేశారు. గుంటూరు జిల్లా తెనాలి పట్టణంలో న్యాయవాదులు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ చేశారు. ఎన్‌టిఆర్ జిల్లాలోని నందిగామ, జగ్గయ్యపేటల్లో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఏలూరు జిల్లాలోని భీమడోలు కోర్టు ప్రాంగణంలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడోరోజు రిలే నిరాహార దీక్షలు కొనసాగించారు. అనకాపల్లి జిల్లా చోడవరం కోర్టు వద్ద న్యాయవాదులు నిరసన తెలిపారు. విజయనగరం జిల్లా కోర్టుకు న్యాయ వాదులు గైర్హజరయ్యారు.

రికార్డు స్థాయిలో కోడిగుడ్డు ధర

- రిటైల్‌లో రూ.7
- రైతులకు దక్కేది రూ.5.85 మాత్రమే



ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

గుడ్డు ధర చూసి సామాన్యులు గుడ్లు తేలేస్తున్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా రిటైల్ మార్కెట్లో గుడ్డు రూ.7 చొప్పున విక్రయాలు జరుగుతున్నాయి. కార్తీక మాసం ముగియడంతో కోడిగుడ్డు ధర అమాంతంగా పెరిగింది. గతేడాది ఇదే సీజన్‌లో రూ.6 ఉండేది. రెండేళ్లుగా పౌల్ట్రీ పరిశ్రమ నష్టాల్లో ఉంది. దీంతో, రైతులు కొత్త బ్యాచ్‌లు వేయలేదు. ఫలితంగా డిమాండ్‌కు తగ్గట్లు సరఫరా లేకపోవడంతో ధరలు పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. గుడ్డు ధర గతంలో ఎన్నడూ లేనంతంగా పెరిగినా తమకు రూ.5.85 లభించేస్తోందని, రూ.6 వస్తేనే గిట్టుబాటని పౌల్ట్రీ రైతులు చెబుతున్నారు.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వ్యవసాయం తరువాత పెద్ద పరిశ్రమగా పౌల్ట్రీ ఉంది. సుమారు 300 పౌల్ట్రీ ఫారాలు ఉన్నాయి. 1.40 కోట్ల కోళ్ల పెంపకం అవుతోంది. రోజుకు 1.10 కోట్ల గుడ్లు ఉత్పత్తి అవుతున్నాయి. 40 శాతం మేర గుడ్లు స్థానిక మార్కెట్లలో వినియోగిస్తుండగా, 60 శాతం గుడ్లు ఒడిశా, బీహార్, పశ్చిమబెంగాల్ వంటి రాష్ట్రాలకు ఎగుమతి చేస్తుంటారు. పౌల్ట్రీ పరిశ్రమ నాలుగేళ్లగా నష్టాల్లో ఉంది. ఈ ఏడాది నవంబర్‌లో హోల్‌సేల్ మార్కెట్‌లో గుడ్డు ధర రూ.4.50 మాత్రమే పలికింది. హోల్‌సేల్ మార్కెట్‌లో 2017లో గుడ్డు ధర రికార్డు స్థాయిలో రూ.5.45కి చేరింది. తాజాగా ఈ రికార్డును బ్రేక్ చేస్తూ ధర రూ.5.85కు చేరింది. కోళ్లకు వినియోగించే మేత, దాణా ఖర్చులు ఇటీవల కాలంలో గణనీయంగా పెరిగాయి. మొక్కజొన్న, సోయా దాణాను అధికంగా వాడుతుంటారు. మొక్కజొన్న దాణా టన్నుకు ఏడాదిలో రూ.18 వేల నుంచి రూ.25 వేలు, సోయా రూ.50 వేల నుంచి రూ.80వేలకు పెరిగింది. అదే స్థాయిలో ధర పెరగక నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. 2019కి పూర్వం దాణా రేటు తక్కువగా ఉండడంతో అప్పట్లో లాభాలు వచ్చాయి. పశ్చిమబెంగాల్, యుపి వంటి రాష్ట్రాల్లో ఇటీవల అక్కడ ప్రభుత్వాలు పౌల్ట్రీలను ప్రోత్సహిస్తున్నాయి. సబ్సిడీలు కల్పిస్తున్నాయి. దీంతో, అక్కడ గుడ్ల ఉత్పత్తి పెరుగుతోంది. దీంతో, మన రాష్ట్రం నుంచి ఎగుమతులు తగ్గాయి. కొన్నిసార్లు స్థానిక మార్కెట్‌పైనే ఆధార పడాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో గత రెండేళ్ల నుంచి కోళ్ల ఫారాల్లో నష్టాల కారణంగా కొత్త బ్యాచ్‌లు వేయడం లేదు.

రూ.6 వస్తేనే గిట్టుబాటు

గుడ్డుకు కనీసం రూ.6 వస్తేనే కొంత మేర గిట్టుబాటు అవుతుంది. మేత ధరలు, విద్యుత్ బిల్లుల పెట్టుబడి ఖర్చు కారణంగా ఒక గుడ్డు ఉత్పత్తి ఖర్చు రూ.5.50కు చేరింది. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ సబ్సిడీ సౌకర్యం కల్పించాలి. వ్యవసాయ అనుబంధ పరిశ్రమగా గుర్తించాలి. విద్యుత్ సంస్థ నుంచి రాయితీ అమలు చేస్తే రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు ఆదా అయ్యి కొంత ఊరట లభించే అవకాశం ఉంది. దాణాను సబ్సిడీపై అందించి పౌల్ట్రీ రైతులను ఆదుకోవాలి.

- కెవి.ముకుందరెడ్డి, తూర్పుగోదావరి జిల్లా నెక్ ఛైర్మన్, పౌల్ట్రీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు

మిర్చి ధర తగ్గుముఖం

- క్వింటాలుకు రూ.2 వేలు నుంచి రూ.3 వేలు కుదింపు



ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు మిర్చి యార్డుకు రోజుకు 40 వేల నుంచి 50 వేల బస్తాల మిర్చి వస్తోంది. సరుకు ఎక్కువగా వస్తుండడంతో వ్యాపారులు ధరలను క్రమంగా తగ్గిస్తున్నారు. గత నాలుగు రోజుల్లో క్వింటాలుకు రూ.2 వేల నుంచి 3 వేల వరకు ధర తగ్గింది. ఎగుమతి అవకాశాలు తగ్గడం, ఒకేసారి పెద్ద ఎత్తున సరుకు వస్తుండడం, రానున్న నెల రోజుల కాలంలో ఇదే రీతిలో సరుకు వచ్చే అవకాశం ఉండడంతో వ్యాపారులు ధరలను తగ్గించి యార్డు వరకు రైతులను రానివ్వకుండా గ్రామాల్లోనే కొనుగోలు చేసేలా వ్యాపారులు ప్రయత్నిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సుదూర ప్రాంతాల నుంచి గుంటూరు వరకు వెళ్లినా అదే ధర గ్రామాల్లో కూడా ఇదే ధర ఉంటుందని భావించేలా చేయడానికి ఇలా ధరలు తగ్గిస్తున్నారనే రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తేమ శాతం అధికంగా ఉందని చెప్పి కూడా ధర తగ్గించేస్తున్నారని వాపోతున్నారు. గతేడాది ఇదే రోజుల్లో మిర్చి ధరలు గరిష్టంగా రూ.27 వేలు, కనిష్టంగా రూ.13 వేలు ఉన్నాయి. ఈ ఏడాది గత నాలుగు రోజులుగా గరిష్టంగా రూ.23 వేలు, కనిష్టంగా రూ.9,500 మాత్రమే పలికాయి. గత నెల రోజుల కాలంలో సరుకు ఎక్కువ వచ్చిన రోజున ధరలు తగ్గించడం, సరుకు తక్కువగా వచ్చిన రోజు సగటు ధర స్వల్పంగా పెంచడం వ్యాపారులకు పరిపాటిగా మారింది. దూర ప్రాంతాల నుంచి వచ్చే రైతులకు ఈ పరిస్థితి అత్యంత ఇబ్బందికరంగా మారింది. గత నెల వరకు రూ.20 వేల పలికిన సీజంట బాడిగ రకం గత నాలుగు రోజులుగా రూ.15 వేల నుంచి రూ.18 వేల మధ్య ఉంది. తేజ వెరయిటీ రూ.25 వేల నుంచి రూ.23 వేలకు తగ్గింది. 355 బాడిగ రకం రూ.24 వేల నుంచి రూ.2 వేలు తగ్గి రూ.22 వేలు ఉంది. తేజ మీడియం రూ.20 వేల నుంచి రూ.17 వేలకు, ఆర్మూర్ రకం రూ.19 వేల నుంచి రూ.17 వేలకు తగ్గింది. నాన్ ఎసి కామన్ వెరయిటీల్లో 334 కనిష్ట ధర రూ.10 వేలు, గరిష్ట ధర రూ.23 వేలు ఉంది. గురువారం వివిధ ప్రాంతాల నుంచి 45,238 టిక్కిల సరుకు వచ్చింది. పాత నిల్వలతో కలిపి 48,735 టిక్కిలు అమ్ముడుపోయాయి. ఇంకా 23,372 టిక్కిలు నిల్వ ఉన్నాయి. మేలు రకాల సరుకు కనిష్ట సగటు ధర రూ.9 వేలు, గరిష్ట సగటు ధర రూ.23 వేలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసిన సరుకుకు గరిష్ట సగటు ధర రూ.20 వేలు వచ్చింది. మేలు రకాలకు రూ.23 వేలు ధర లభించింది. దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు వెనక్కి తీసుకెళ్లలేక అయినకాడికి అమ్ముకుంటున్నారు.

ఏడాదిలో మరో 80 స్టోర్లు తెరుస్తాం

- మాగ్నిఫ్లెక్స్ ఇండియా ఎండి వెల్లడి



హైదరాబాద్ : ఇటలీకి చెందిన ప్రముఖ మాట్రిసెస్ బ్రాండ్ మాగ్నిఫ్లెక్స్ ఇండియా వచ్చే ఏడాది కాలంలో దేశంలో కొత్తగా 80 స్టోర్లు తెరువాలని లక్ష్యంగా పెట్టుకుందని ఆ సంస్థ ఎండి ఆనంద్ నిచాని తెలిపారు. గురువారం హైదరాబాద్‌లో ఆయన కొత్త ఎర్గో ట్రై ఎలక్ట్రిక్ బెడ్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ బెడ్ ధర రూ.3 లక్షలుగా తెలిపారు. ప్రస్తుతం దేశంలోని 29 నగరాల్లో తమకు 86 అవుట్‌లెట్‌లు ఉన్నాయని తెలిపారు. ఏడాదిలో రెట్టింపు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇందుకోసం తెలుగు రాష్ట్రాలు సహా ఇతర ప్రాంతాల్లో ఫ్రాంచైజీలకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. తమ లగ్జరీ బ్రాండ్ పోర్టుపోలియోలో 12 మోడల్స్ ఉన్నాయన్నారు. వీటి ధరల శ్రేణీ రూ.85వేల నుంచి రూ.6 లక్షలుగా ఉందన్నారు.

ఫ్లాష్‌తో 30 నిమిషాల్లో డెలివరీ : షాడోఫాక్స్



న్యూఢిల్లీ : లాజిస్టిక్స్ సంస్థ షాడోఫ్యాక్స్ కొత్తగా 30 నిమిషాల్లోనే వస్తువులను డెలివరీ చేయడానికి ఫ్లాష్ బై షాడోఫాక్స్‌ను పరిచయం చేసినట్లు తెలిపింది. ఇది వ్యాపారులు, వినియోగదారులు తక్షణ డెలివరీ సేవలను పొందడానికి అనుమతిస్తుందని పేర్కొంది. తక్కువ ఖర్చుతో కూడిన చివరి మైల్ డెలివరీ పరిష్కారాలను అందించడం ద్వారా డుంజో ను ముందుకు తీసుకువెళ్లాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపింది. ప్రస్తుతం 50కి పైగా నగరాల్లో ఈ సేవలను అందుబాటులోకి తెచ్చామని షాడోఫ్యాక్స్ కో ఫౌండర్ ప్రహర్ష్ చంద్ర పేర్కొన్నారు.

లావా నుంచి కొత్త స్టార్మ్ 5జి మోడల్



న్యూఢిల్లీ : దేశీయ మొబైల్ తయారీ సంస్థ లావా కొత్తగా లావా స్టార్మ్ 5జి మోడల్‌ను విడుదల చేసింది. 6.78 అంగుళాల డిస్‌ప్లే కలిగిన ఈ స్మార్ట్‌ఫోన్ వెనుకవైపు 50 ఎంపి ప్రధాన కెమెరా, 8ఎంపి అల్ట్రా వైడ్ కెమెరా, సెల్ఫీ కోసం 16 ఎంపి కెమెరాతో ఆవిష్కరించింది. 5000 ఎంఎహెచ్ ఫాస్ట్ ఛార్జింగ్ బ్యాటరీ సహా మైక్రో ఎస్‌డి కార్డ్ ద్వారా స్టోరేజీని 1 టిబి వరకు పెంచుకోవడానికి వీలుంది. 8జిబి, 128 జిబి వేరియంట్ ధరను రూ.13,499గా నిర్ణయించగా.. ప్రారంభ ఆఫర్ కింద కే.11,999కే అందిస్తున్నట్లు ఆ సంస్థ తెలిపింది.



సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు

ఆర్థిక బకాయిల చెల్లింపులో అలసత్వంపై విజయవాడలో 7న 36 గంటల దీక్ష

- యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఏడాది కాలంగా పేరుకుపోయిన పలు రకాల ఆర్థిక బకాయిలు రూ.11,462 కోట్ల చెల్లింపులో రాష్ట్ర ప్రభుత్వం అలసత్వం వహిస్తోందని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు విమర్శించారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా వచ్చే జనవరి ఏడో తేదీన విజయవాడలో 36 గంటల దీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. శ్రీకాకుళంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో గురువారం ఆఫీస్ బేరర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆగస్టులో నిర్వహించిన జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో సెప్టెంబర్ నాటికి అన్ని రకాల బకాయిలూ చెల్లిస్తామని మంత్రివర్గ ఉపసంఘం హామీ ఇచ్చినా ఇంతవరకూ అమలు చేయలేదని తెలిపారు. జనవరి ఏడో తేదీలోపు అన్ని రకాల బకాయిలూ వెంటనే చెల్లించకపోతే ఏడో తేదీన 36 గంటల దీక్ష చేపడతామన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్ మాట్లాడుతూ పాత పెన్షన్ పునరుద్ధరించే వారికే వచ్చే ఎన్నికల్లో ఓట్లు వేస్తామని స్పష్టం చేశారు. దీనిపై రాజకీయ పార్టీలు తమ వైఖరిని స్పష్టం చేయాలని కోరారు. సమావేశంలో యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు కె.వైకుంఠరావు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.బాబూరావు, బి.శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

ప్రొద్దుటూరులో ఐటి దాడులు

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

ప్రముఖ వాణిజ్య కేంద్రమైన ప్రొద్దుటూరులో గురువారం ఐటి దాడులు కలకలం రేపాయి. మన రాష్ట్రంతో పాటు తెలంగాణలోనూ ప్రముఖ కంట్రాక్టర్‌గా పేరుగాంచిన కెసి పుల్లయ్య అండ్‌కో కార్యాలయాలపై ఐటి అధికారులు సోదాలు నిర్వహించారు. ప్రొద్దుటూరులోని కెసి పుల్లయ్య స్వగృహంలో, పలు ప్రదేశాల్లో ఏకకాలంలో దాడులు చేశారు. ఐటి అధికారులు రెండు రోజులుగా దాడులు చేస్తున్నట్లు విశ్వశనీయంగా మీడియాకు ఎలాంటి సమాచారమూ లేదు. పుల్లయ్య స్వగృహంలో బుధవారం రాత్రి నుండి గురువారం తెల్లవారుజాము వరకు పలు రికార్డులను పరిశీలించినట్లు తెలిసింది.

సంపాదకీయం

దుర్మార్గపు చర్య

స్వతంత్ర వార్తా పోర్టల్ న్యూస్‌క్లిక్‌పై మోడీ ప్రభుత్వం వరుస దాడులు చేస్తున్న తీరు అత్యంత దుర్మార్గం. అక్టోబర్‌లో ఆ సంస్థ ఎడిటర్ ప్రబీర్ పుర్కాయస్థ, హెచ్‌ఆర్ విభాగం అధిపతి అమిత్ చక్రవర్తిని ఉపా చట్టం కింద అరెస్ట్ చేసిన కేంద్ర ప్రభుత్వం తాజాగా ఆ సంస్థ బ్యాంకు ఖాతాలను స్థంభింపచేసింది. ఏ మాత్రం ముందస్తు హెచ్చరికలు లేకుండా తీసుకున్న ఈ చర్యతో రోజువారీ వ్యవహారాలకు కూడా వెతుక్కోవాల్సిన దుస్థితి ఆ సంస్థకు ఏర్పడింది. ఇక పాత్రికేయులు, వీడియోగ్రాఫర్లు, కార్యాలయ సిబ్బంది, కంట్రిబ్యూటర్ల జీతాల సంగతి చెప్పనవసరం లేదు. నిజానికి వారికి చెల్లింపులు చేయడానికి ప్రయత్నిస్తున్న సమయంలోనే బ్యాంకు ఖాతాలను ఆదాయ పన్ను శాఖ అధికారులు ఫ్రీజ్ చేసిన విషయం వెల్లడైంది. తిరిగి ఖాతాలను ఎప్పటి నుండి పునరుద్ధరిస్తారన్న అంశాన్ని కూడా ఐటి అధికారులు చెప్పకపోవడంతో అగమ్యగోచర పరిస్థితి ఏర్పడింది. క్రిస్మస్, నూతన సంవత్సరంతో పాటు సంక్రాంతి పండగల వేళ మోడీ ప్రభుత్వం తీసుకున్న ఈ చర్య జీతాల మీదనే ఆధారపడి, బతుకులీడ్చే కుటుంబాల్లో ఏ స్థాయిలో బాధను నింపుతుందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అయినా ఈ షాక్ నుండి తొందరగానే బయటపడిన న్యూస్‌క్లిక్ సిబ్బంది, ఈ తరహా చర్యలు తమ మనోధైర్యాన్ని, అంకితభావాన్ని అణుమాత్రం కూడా తగ్గించలేవని, తమ శక్తినంతా ఉపయోగించి చివరివరకు పని చేస్తామని ప్రకటించడం స్ఫూర్తిదాయకం.

మోడీ ప్రభుత్వం రెండవసారి అధికారంలోకి వచ్చినప్పటి నుండి న్యూస్‌క్లిక్‌పై దేశద్రోహ ముద్ర వేయడానికి ప్రయత్నాలు చేస్తూనే ఉంది. 2021 లోనే ఇడి, ఇన్‌కంట్యాక్స్ అధికారులతో పాటు ఢిల్లీ పోలీసులనూ రంగంలోకి దించింది. రకరకాల ప్రభుత్వ ఏజెన్సీలు రోజుల తరబడి విచారణ చేశాయి. అయినా, చైనా నిధులంటూ చేస్తున్న ఆరోపణలను కేంద్ర ప్రభుత్వం వీసమంత కూడా నిరూపించలేకపోయింది. న్యూయార్క్ టైమ్స్ అదే ఆరోపణ చేస్తూ ప్రచురించిన బూటకపు కథనాన్ని అడ్డు పెట్టుకుని ఉపా చట్టం కింద అరెస్టులు చేసింది. అరెస్టులు చేసి నెలలు గడుస్తున్నా ఇంతవరకు ఛార్జిషీట్ కూడా దాఖలు చేయలేదు. మరోవైపు తనకు వచ్చే నిధులన్నీ భారతీయ చట్టాలకు లోబడి, రిజర్వు బ్యాంకు నిబంధనల ప్రకారం బ్యాంకు అకౌంట్ల ద్వారానే వస్తాయని న్యూస్‌క్లిక్ పదేపదే స్పష్టం చేస్తోంది. ఇప్పుడు ఆ ఖాతాలను స్థంభింపచేయడం ద్వారా గొంతు నులమడానికి మోడీ ప్రభుత్వం సిద్ధమైంది. ఇప్పటివరకు దాడులు, అరెస్టులు జరిగినా న్యూస్‌క్లిక్ కార్యక్రమాలు స్థిరంగా సాగుతున్నాయి. ఉద్యోగులు మొక్కవోని దీక్షతో సంస్థను ఎప్పటిమాదిరే ముందుకు తీసుకువెళ్ళారు. దీంతో కరడుగట్టిన ఆర్థిక నేరగాళ్ల విషయంలోనూ లేని విధంగా బ్యాంకు ఖాతాలను స్థంభింప చేసే దుర్మార్గానికి మోడీ సర్కారు తెగబడింది. ప్రభుత్వం అనుకున్న విధంగా జరిగితే న్యూస్‌క్లిక్‌కు ఇది ప్రాణాంతకంగా మారే ప్రమాదం ఉందన్న అంచనాలు వినిపిస్తున్నాయి. దీనిని గుర్తించే ఆ సంస్థ ఉద్యోగులు తమకు అండగా నిలవాలని పౌర సమాజానికి విజ్ఞప్తి చేశారు. ఆ దిశలో ముందడుగు వేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్న అంశాన్ని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

తనకు వ్యతిరేకంగా గళం విప్పేవారిలో భయోత్పాతాన్ని సృష్టించడమే మోడీ ప్రభుత్వ లక్ష్యం. బీమా కొరెగావ్ కేసు దీనికో ఉదాహరణ. దేశ వ్యాప్తంగా ఉన్న మేధావులను, ప్రజాతంత్ర వాదులను ఉపా చట్టం కింద అరెస్ట్ చేసి, నాలుగేళ్లుగా నిర్బంధంలో ఉంచినప్పటికీ ఇప్పటి వరకు ఒక్క ఆధారాన్ని కూడా మోడీ సర్కారు చూపలేకపోయింది. అటువంటి కుట్రే న్యూస్‌క్లిక్‌పై కూడా కేంద్రం చేస్తోంది. పార్లమెంటు భద్రతకు సంబంధించి నిలదీసినందుకు దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 143 మంది ఎంపీలను పార్లమెంటు నుండి గెంటివేసిన ఘనత కూడా ఈ ప్రభుత్వానిదే. ఈ ఏడాది ఫిబ్రవరిలో 'ది ఎకానమిస్ట్' పత్రిక భారత ప్రజాస్వామ్య స్తంభాలను ఒక్కొక్కటిగా కూలగొడుతున్నారు' అని రాసింది. అది అక్షరాల నిజం! ఈ ధోరణిని ఇక ఏమాత్రం అనుమతించకూడదు. ప్రత్యామ్నాయ మీడియా సంస్థలను అణచివేయడం ద్వారా ప్రజల గొంతు నొక్కడానికి, ప్రజాస్వామ్యాన్ని కూల్చడానికి జరుగుతున్న ప్రయత్నాలను గట్టిగా ప్రతిఘటించాలి...తిప్పికొట్టాలి. ప్రజాస్వామ్య ప్రియులు, దేశభక్తులందరూ ఈ పోరాటంలో కలిసి రావాలి.

మహనీయుల మాట



ఒక అవకాశం చేజారిపోతే
కళ్ళ నీళ్లు పెట్టుకోకు.
మరొక అవకాశం చేజారి పోకుండా
జాగ్రత్తపడు.
- అబ్రహం లింకన్,
అమెరికా పూర్వ అధ్యక్షుడు.


Abraham Lincoln

క్రిమినల్ చట్టాలలో తుగ్లక్ సంస్కరణలు

విశ్లేషణ



ఈ కొత్త చట్టం క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లో ఎఫ్ఐఆర్ నమోదు నుండి విచారణ పూర్తి, తీర్పు ప్రకటన వరకు లేదా అప్పీలేట్ కోర్టు ప్రక్రియలలో ఎలాంటి మార్పును ప్రవేశ పెట్టింది లేదు. నేరాలు, శిక్షలను నిర్వచించే భారతీయ శిక్షాస్మృతి విషయంలోనూ నేరాలు, శిక్షల నిర్వచనాలను అచ్చం అదే విధంగా తిరిగి రాసి...విభాగాలను అటూ ఇటూ పునర్విభజించారు. ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ లోనూ పేరు మార్పు, శాఖల మార్పు మాత్రమే చోటు చేసుకున్నాయి. రాజధానిని అటూ ఇటూ చేసిన తుగ్లక్ సంస్కరణల తరహాలోనే ఈ మొత్తం విభాగాలను అటూ ఇటూ చేశారు. ఆర్భాటంగా జరిగిన భారతీయీకరణ ప్రహసనం కాస్తా పేరు మార్చడం, శాఖల పరస్పర మార్పిడిగా తయారైంది.



సి.పి. ప్రమోద్

భారతీయ శిక్షాస్మృతి (ఐపిసి), సాక్ష్యాధారాల చట్టం, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ మొదలైనవాటి పేర్లను కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో వరుసగా భారతీయ న్యాయ సంహిత, భారతీయ సాక్ష్య బిల్లు, భారతీయ పౌర భద్రతా సంహితగా మార్చింది. క్రిమినల్ చట్టాలలో సమగ్ర సంస్కరణలు తీసుకువస్తున్నట్టు, భారతదేశంలో వలస కాలపు చట్టాలను సంస్కరిస్తున్నట్టు కూడా కేంద్ర ప్రభుత్వం చెప్పుకుంది. ఇటీవల పార్లమెంటుపై జరిగిన దాడిలో భద్రతా ఉల్లంఘన గురించి చర్చించాలని డిమాండ్ చేసిన 143 మంది ప్రతిపక్ష ఎంపీలను సస్పెండ్ చేసిన సమయంలోనే ఇటువంటి ముఖ్యమైన బిల్లు చర్చకు చేపట్టడం నిజానికి పూర్తి అప్రజాస్వామికం. బిల్లుపై చర్చను నీరుగార్చడానికి చేపట్టిన ఉద్దేశపూర్వక చర్య.

దేశంలో క్రిమినల్ లా (నేర చట్టాలు) వ్యవస్థ బ్రిటిష్ పాలన నాడు ప్రారంభమైంది. 1872లో, ఐపిసి మరియు ఎవిడెన్స్ చట్టం అమలులోకి వచ్చింది. 1898లో సిఆర్‌పిసి కూడా రూపొందించబడింది. అంతకు ముందున్న రాచరిక పాలన సమయంలో లేదా ఇంకా ముందు నేర చట్ట అమలు వ్యవస్థలు ఎలా వుండేవో చట్టాలు లేదా విధానాల స్వరూపమేమిటో మనకు తెలియదు. బ్రిటిష్ రాజ్య న్యాయ వ్యవస్థలను స్వల్ప మార్పులతో వారు భారతదేశంలో అమలు చేశారు. చట్టబద్ధ పాలనను అమలు చేయడానికి ఈనాడున్న న్యాయమూర్తులు, న్యాయవాదులతో కూడిన న్యాయ వ్యవస్థ, పోలీసింగ్ వ్యవస్థ ఆ విధంగానే ఉనికిలోకి వచ్చింది.

తరువాత కాలంలో ఎన్నో శాసన సవరణలు కోర్టు తీర్పుల ద్వారా ఈ చట్టాలు అనేక విధాల రూపాంతరం చెందాయి. ఈ మార్పులతో ఇది లోపరహిత వ్యవస్థగా మారిపోయిందని చెప్పలేనప్పటికీ హక్కుల కోణంలో మార్పులు వచ్చాయనేది వాస్తవం. 1950లో ఏర్పాటైన భారత రాజ్యాంగంలోని ఆధునిక ప్రజాస్వామ్య హక్కులు, పౌర హక్కులు, 1970లలో రూపొందిన అంతర్జాతీయ మానవ హక్కుల ప్రకటనలకు అనుగుణమైన నేర విచారణ వ్యవస్థ దేశంలో రూపొందింది.

వలస కాలపు చట్టాలను పూర్తిగా మార్చివేసే బృహత్తర ప్రయత్నం ఎన్నడూ జరగనప్పటికీ హక్కుల కోణంలో చెప్పుకోదగిన చాలా మార్పులు వచ్చాయి. అరెస్టు, విచారణకు ముందు కస్టడీ, బెయిల్, నిందితులకు న్యాయ సహాయం పొందే హక్కు, క్రూరమైన నేరాలకు పాల్పడిన వారికి కఠిన శిక్ష, మానవ హక్కుల పరిరక్షణకు సంబంధించిన అంశాలలో అనేక ముఖ్యమైన మార్పులే వచ్చాయి. భావ ప్రకటనా స్వేచ్ఛను అణిచివేసేందుకు దుర్వినియోగం చేయబడిన దేశద్రోహ నేర నిబంధనల ప్రయోగాన్ని స్తంభింపజేసిన చర్య కూడా అలాంటిదే.

బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో ఈ క్రిమినల్ లా వ్యవస్థను సంస్కరిస్తామని ప్రకటించారు. సనాతన ఆర్ష భారత రాజ్యానికి సంబంధించిన వారి భావాత్మక చరిత్రలో ఎక్కడా అటువంటి చట్టాన్ని అమలు చేసే వ్యవస్థ లేదు. అందువల్ల, వారు తాము విమర్శిస్తున్న విదేశీ-వలసవాద చట్టాలను ఏ విధంగా మారుస్తారోనని న్యాయ రంగంలోని ప్రతి ఒక్కరూ ఆందోళన చెందారు.

పెద్ద నోట్ల రద్దు, వినాశకర వ్యవసాయ బిల్లు, కార్మిక చట్ట సంస్కరణలు, పౌరసత్వ చట్ట సవరణ మొదలైన వాటిపై తగినంత చర్చ లేకుండా ఏ ఏకపక్ష విధానాన్ని అనుసరించారో అదే తీరును క్రిమినల్ చట్ట సంస్కరణ లోనూ కేంద్ర ప్రభుత్వం అవలంబించింది. వున్న చట్టాల లోతైన పునర్విమర్శన, సమగ్ర కొత్త చట్టాల రూపకల్పన సిఫార్సు సాధారణంగా లా కమిషన్లు చేస్తాయి. ఈ విషయంలోనూ కేంద్రం సువ్యవస్థితమైన ఆ వరవడిని తోసిపుచ్చింది. క్రిమినల్ చట్టాలను సంస్కరించేందుకు కమిటీని మే 4న కేంద్ర ప్రభుత్వమే నియమించింది. నేషనల్ లా యూనివర్శిటీ ప్రొఫెసర్, రిటైర్డ్ జిల్లా జడ్జి పి.తారేజ, అడ్వకేట్ మహేష్ జెఠ్మలానీ అందులో సభ్యులుగా నియమితులైనారు. ఈ చట్ట సంస్కరణల కమిటీ విచారణాంశాలను కూడా బయిటపెట్టలేదు.

ఈ కమిటీ సమర్పించిన ముసాయిదా చట్టాలను కేంద్రం నాలుగు నెలల క్రితం పార్లమెంటులో సమర్పించి ప్రజల అభిప్రాయాల కోసం విడుదల చేసింది. అయితే పెద్దగా ఎలాంటి మార్పులు లేకుండా కొత్త పేర్లతో ఈ చట్టాన్ని పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు. కేరళతో సహా హిందీ మాట్లాడని దక్షిణ భారత రాష్ట్రాలకు ఈ కొత్త పేర్లు బొత్తిగా తలకెక్కవు. అంతేకాకుండా, పార్లమెంటులో, శాసనసభలలో ప్రవేశపెట్టే చట్టాల విషయం గాని, శీర్షిక గాని తప్పనిసరిగా ఇంగ్లీషులో ఉండాలని రాజ్యాంగంలోని ఆర్టికల్ 348(1) నిర్దేశిస్తుంది. ఈ షరతులను పూర్తిగా ఉల్లంఘిస్తూ ఏకపక్షంగా, అభ్యంతరకర హిందీకరణ జరిగింది.

ఐపిసి, సాక్ష్యాధారాల చట్టం, సిఆర్‌పిసి ల విషయంలో వారు చెప్పుకునే ప్రకటిత 'భారతీకరణ' జరగలేదు సరికదా, ప్రస్తుత చట్టాల సమగ్ర సంస్కరణ అసలే జరగలేదు. ఇప్పుడున్న చట్టాల వల్ల కలిగే నష్టాలేమిటో, కొత్త సంస్కరణల వల్ల కలిగే ప్రయోజనాలేమిటో ఎవరూ చెప్పలేరు. మూడు చట్టాల్లోని వివిధ భాగాల పునర్వ్యవస్థీకరణే ప్రధానంగా జరిగింది.

ఈ కొత్త చట్టం క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లో ఎఫ్ఐఆర్ నమోదు నుండి విచారణ పూర్తి, తీర్పు ప్రకటన వరకు లేదా అప్పీలేట్ కోర్టు ప్రక్రియలలో ఎలాంటి మార్పును ప్రవేశ పెట్టింది లేదు. నేరాలు, శిక్షలను నిర్వచించే భారతీయ శిక్షాస్మృతి విషయంలోనూ నేరాలు, శిక్షల నిర్వచనాలను అచ్చం అదే విధంగా తిరిగి రాసి...విభాగాలను అటూ ఇటూ పునర్విభజించారు. ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ లోనూ పేరు మార్పు, శాఖల మార్పు మాత్రమే చోటుచేసుకున్నాయి. రాజధానిని అటూ ఇటూ చేసిన తుగ్లక్ సంస్కరణల తరహాలోనే ఈ మొత్తం విభాగాలను అటూ ఇటూ చేశారు. ఆర్భాటంగా జరిగిన భారతీయీకరణ ప్రహసనం కాస్తా పేరు మార్చడం, శాఖల పరస్పర మార్పిడిగా తయారైంది.

హత్యా నేరం, దానికి శిక్షలు ఐపిసి లోని సెక్షన్లు 299 నుండి 311 వరకు వుండేవి. కొత్త చట్టంలో వాటిని సెక్షన్లు 98 నుండి 111 వరకు తీసుకొచ్చారు. హత్యా నేరానికి సంబంధించిన సెక్షన్ 302ని సెక్షన్ 102గా మార్చారు. మహిళలపై నేరాలు కూడా అలాగే నెంబర్లు మారాయి. మోసం, ఫోర్జరీ, దొంగతనం వంటి దాదాపు అన్ని విభాగాలు పెద్ద మార్పులు లేకుండా కొత్త విభాగాలుగా పునర్ విభజన జరిగింది. అయితే, దీనితో పాటు, సుప్రీంకోర్టు స్తంభింపచేసిన దేశద్రోహం నేరం, యుఎపిఎ చట్టం కింద ఉగ్రవాదం, పోక్సో చట్టం కింద పిల్లల వేధింపులు మరియు ఇతర చట్టాలలో పేర్కొన్న ఆర్థిక నేరాల సెక్షన్లు కొత్త శిక్షాస్మృతిలో భాగంగా చేశారు. వీటివల్ల సామాన్యులకు కలిగే న్యాయపరమైన చిక్కులు వర్ణనాతీతం.

హత్యా నేరం, దానికి శిక్షలు ఐపిసి లోని సెక్షన్లు 299 నుండి 311 వరకు వుండేవి. కొత్త చట్టంలో వాటిని సెక్షన్లు 98 నుండి 111 వరకు తీసుకొచ్చారు. హత్యా నేరానికి సంబంధించిన సెక్షన్ 302ని సెక్షన్ 102గా మార్చారు. మహిళలపై నేరాలు కూడా అలాగే నెంబర్లు మారాయి. మోసం, ఫోర్జరీ, దొంగతనం వంటి దాదాపు అన్ని విభాగాలు పెద్ద మార్పులు లేకుండా కొత్త విభాగాలుగా పునర్ విభజన జరిగింది. అయితే, దీనితో పాటు, సుప్రీంకోర్టు స్తంభింపచేసిన దేశద్రోహం నేరం, యుఎపిఎ చట్టం కింద ఉగ్రవాదం, పోక్సో చట్టం కింద పిల్లల వేధింపులు మరియు ఇతర చట్టాలలో పేర్కొన్న ఆర్థిక నేరాల సెక్షన్లు కొత్త శిక్షాస్మృతిలో భాగంగా చేశారు. వీటివల్ల సామాన్యులకు కలిగే న్యాయపరమైన చిక్కులు వర్ణనాతీతం.

ఇప్పటికే ఉన్న నిబంధనలను మార్చి ఆ శాఖ చేసిన జిమ్మిక్కుతో లాభం ఏమిటి? పైన చెప్పినట్లు ఈ సంస్కరణల నేపథ్యంలో క్రైమ్ రికార్డ్స్ బ్యూరోల్లో తాజా డేటాను మార్చాల్సి ఉంటుంది. దీనివల్ల ఖజానాకు భారీ ఆర్థిక నష్టం వాటిల్లుతుంది. ఈ అనవసర శాఖల మార్పుల వల్ల కోర్టులు, లాయర్లు, పోలీసులు నానా ఇబ్బందులు పడుతున్నారు. మునుపటి కోర్టు నిర్ణయాలు రిఫరెన్స్ లైబ్రరీలు, ఇ-లైబ్రరీలను మార్చవలసి ఉంటుంది. వెయ్యి నోటును నిషేధించి రెండు వేల నోటును ప్రవేశపెట్టి ఆ తర్వాత దాన్ని ఉపసంహరించుకుని ప్రజలను ఇబ్బందులకు గురిచేసే వృథా కసరత్తులు తప్ప ఈ చట్ట సవరణలు భారతీయ న్యాయ వ్యవస్థలో ఎలాంటి సానుకూల మార్పును తీసుకురాబోవు.

ఈ సెక్షన్ మార్పు తతంగాల ప్రభావాలే కాకుండా తిరోగమన నిర్ణయాలు కూడా ఉన్నాయి. దర్యాప్తు సమయంలో కస్టడీ వ్యవధిని పొడిగించడానికి, ముందస్తు విచారణ ఖైదీల సంఖ్యను పెంచడానికి రాష్ట్రాన్ని అనుమతించే మార్పులు అలాంటివే. యుఎపిఎ కేసులతో సహా బెయిల్ లేకుండా విచారణకు ఎదురు చూస్తున్న ఖైదీల సంఖ్య ఇప్పటికే చర్చనీయాంశమైంది. ఇవి భావప్రకటనా స్వేచ్ఛకు భంగం కలిగించే నిబంధనలు అవుతాయి. అనాగరికమైన కాలం చెల్లిన రీతిలో ఖైదీల ఒంటరి నిర్బంధం నిర్దేశించబడింది. నిందితులు లేకుండానే క్రిమినల్ కేసులను విచారించే క్లాజులు ఇందులో ఉన్నాయి. విచారకరమైన విషయం ఏమిటంటే, ఈ వాస్తవాలన్నిటిపై దాఖలైన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోలేదు. ప్రజల ప్రతిఘటన ద్వారా ఇటువంటి నిరంకుశ చట్టాలను వెనక్కు కొట్టాల్సి వుంటుంది.

(రచయిత 'ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్' కేరళ రాష్ట్ర కార్యదర్శి)

అభిప్రాయం

నాణ్యత లేని హోటళ్లపై నియంత్రణ ఏదీ!

బ్రిటిష్ హయాంలో 1800లో ఏర్పడిన ఇండియన్ సరైస్ చట్టంలో హోటళ్లు, లాడ్జీలు...టాయిలెట్‌కి అనుమతి ఇవ్వాలని, బాటసారులకు ఉచిత నీటిని అందించాలని ఉంది. దీని అర్థం కస్టమర్ అవునా కాదా అనే దానితో సంబంధం లేకుండా యాక్సెస్ ఉచితం. ఈ చట్టం ప్రకారం, హోటళ్లలో నీటిని ఉచితంగా అడగవచ్చు. వాష్‌రూమ్‌ను ఉపయోగించవచ్చు. దేశంలోని అనేక రాష్ట్రాలు, జిల్లాలు సరైస్ చట్టం కింద హోటళ్ల రిజిస్ట్రేషన్‌ను తప్పనిసరి చేశాయి. కాబట్టి, హోటళ్లలో ఉచితంగా నీరు తాగడానికి, వాష్‌రూమ్ సౌకర్యాలను ఉపయోగించుకునే హక్కు ప్రతి పౌరుడికి ఉంది. మహిళలు, పిల్లలు హోటళ్లలో మంచినీరు, మరుగుదొడ్లు వినియోగించుకునేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. హోటల్ రెస్టారెంట్ బార్ వారు తిరస్కరించి నట్లయితే, వారి ట్రేడ్ లైసెన్స్ పునరుద్ధరించబడదని ఈ చట్టంలో వుంది. ఈ చొరవ కింద కొన్ని రాష్ట్రాల్లో, హోటళ్లలోనే కాదు. పబ్బులు, బార్‌లలో కూడా వాష్‌రూమ్‌లను ఉచితంగా ఉపయోగించవచ్చు. కొన్ని రాష్ట్రాల్లో ఇలాంటి ప్రణాళికలు లేకపోయినా, టాయిలెట్లను ఉపయోగించవచ్చు, ఉచిత నీటి కోసం అడగవచ్చు. పౌరులందరూ గుర్తుంచుకోవాల్సిన విషయం ఒకటుంది. మన జీవితాలను సులభతరం చేయడానికి ఇటువంటి హక్కులు ఉన్నాయి. కాబట్టి, దానిని సరైన మార్గంలో ఉపయోగించుకునే బాధ్యత మన మీద కూడా వుంది.

హైవేల వెంబడి హోటళ్ల వ్యాపారుల చేతిలో కస్టమర్లు మోసపోవడం సాధారణమైంది. ప్రభుత్వ నియమం ప్రకారం, హోటల్ యజమానులు వారు అందించే ఉత్పత్తులు/సేవ, మెనూ, ధర ట్యాగ్‌ను పోస్ట్ చేయాలి. అయినప్పటికీ, ఇది సక్రమంగా అమలు చేయరు. వారు అందించే ఆహార నాణ్యతలో కూడా ఎటువంటి మెరుగుదల లేదు. రహదారి వెంట ఉన్న హోటళ్లలో నాణ్యత ఏమాత్రం ఉండదు. మంచినీరు ఉండదు. నీరు కావాలంటే ప్లాస్టిక్ బాటిల్ కొనాల్సిందే. కస్టమర్లు ఎక్కువమంది ఉన్నప్పుడు రెండు లీటర్ల బాటిల్స్ కూడా ఉండవు. మంచి నీరు ఉండదు కానీ ఫౌంటెన్ నుండి నీరు పడుతుంటుంది. వీటిని నియంత్రించడానికి ఎవరూ ఉండరు. ఒక్క హోటల్ లోను ధరల పట్టిక ఉండదు. బస్సు ప్రయాణం చేసే వారికి మధ్యస్థంగా ఉండే హోటల్స్ దగ్గర బస్సులు నిలుపుతున్నారు. అక్కడ రుచి, శుచి, శుభ్రత ఏమాత్రం ఉండదు. టాయిలెట్ల సంగతి సరేసరి. హోటల్ పరిసర ప్రాంతాలల్లో మూత్ర విసర్జన చేయడంతో దుర్గంధం వెదజల్లుతుంటుంది. సిగరెట్లు, బీడీలు బహిరంగంగా తాగడం వలన మహిళలు, పిల్లలు కూర్చోవడానికి ఇష్టపడరు. డ్రైవర్లకు, హెల్పర్లకు కొంతమేర బెనిఫిట్స్ చెల్లించాలని, డ్రైవర్, హెల్పర్లకు కూడా ఉచితంగా భోజనం అందించాలి. కావున కస్టమర్ల నుంచి డబ్బు గుంజుతున్నారు. ఆహార కల్తీని నిరోధించలేకపోతున్నారు.

ఒక్క మాంసమే కాదు. బయట చేసే ఫాస్ట్ ఫుడ్స్ అన్నింటిలో ఆహార కల్తీ ఉంటుంది. అన్నీ కూడా ఆహారంలో కల్తీ అవుతూనే ఉంటున్నాయి. పరిమితికి మించి రంగులు వాడకం ఎక్కువగా ఉంటున్నది. రైల్వే స్టేషన్, బస్ స్టేషన్ కాఫీ, టీ స్టాళ్లలో సింథటిక్ పాల వినియోగం ఎక్కువగా ఉంటున్నది. ఇక ఫాస్ట్ ఫుడ్, టిఫిన్ సెంటర్లలో కల్తీ నూనెలు ఎక్కువగా వినియోగిస్తున్నారు. రంగు రంగుల కూల్ డ్రింక్ బాటిల్స్ కొన్ని వాటికి ఊరు, పేరు వుండదు. కుర్ కురే, లేస్, చిప్స్, బిస్కెట్లు, మూంగ్ దాల్, బాదాం మిల్క్, రోజ్ మిల్క్ అన్నీ నకిలీ ఉత్పత్తులే. ఎప్పుడో వండి పెట్టిన సమోసా, బజ్జీలు దుమ్ము పట్టి ఉంటాయి. ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు ప్రతి రోజూ తనిఖీ చేయాలి. సదరు ఆహార పదార్థాల తయారీ కేంద్రాలను పరిశీలించాలి. ఎక్కువ మోతాదులో రంగుల వాడకాన్ని, కల్తీ పాల వాడకాన్ని నియంత్రించి తగిన చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం ఇలాంటి విషయాల పట్ల ఉదాసీనంగా ఉండటం సిగ్గుచేటు. వినియోగదారులు, ప్రజల జాగరూకత అవసరం. అశుభ్రత, కనీస వసతులు కల్పించలేని హోటళ్లపై ఫిర్యాదు చేయడానికి టోల్ నంబర్లు ప్రకటించాలి.

- డా॥యం. సురేష్ బాబు,
నివాసితుల సంక్షేమ సంఘం అధ్యక్షులు.

ఉపాధ్యాయులా? అంగన్వాడీలా?

నాడు నేడు, మధ్యాహ్న భోజనాలు, మలమూత్రశాలల నిర్వహణ, అనుదిన ఫోటోలు అప్లోడ్ చేయడం వంటి సవాలక్ష పనులతో ఉపాధ్యాయులు విధి నిర్వహణ సక్రమంగా చేయలేక పోతున్నారు. ఓ పక్క సిబ్బంది కొరత, వార్షిక పరీక్షలు దగ్గరకు వచ్చి సిలబస్ పూర్తికాక సతమతమౌతున్నారు. ఈ పరిస్థితుల్లో ఇటీవల అంగన్వాడీల బాధ్యతలు అప్పజెప్పడం గోరుచుట్టుపై రోకలి పోటుగా ఉంది. ప్రభుత్వం తీసుకుంటున్న వివాదాస్పద నిర్ణయాల వల్ల ఇప్పటికే విద్యా వ్యవస్థ కుప్పకూలి... అమ్మ ఒడి వంటి పథకాలు అమలు చేసినా... సామాన్యుడు సైతం తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడానికి వెనుకడుగు వేస్తున్నారు. అందువల్ల ఉపాధ్యాయులను అంగన్వాడీ విధులకు దూరంగా ఉంచాలి!

- యర్రమోతు ధర్మరాజు,
ధవళేశ్వరం

మీ వ్యాసాలు 5000 క్యారెక్టర్లు లేదా 700 పదాలు వుండాలి.
పంపాల్సిన మెయిల్ :
editpageps@gmail.com

డోనాల్డ్‌ను కుదిపిన కోర్టు తీర్పు !

వ్యాఖ్య

దేశ అధికార కేంద్రంపై జరిపిన దాడిని తిరుగుబాటుగా పరిగణించిన కొలరాడో రాష్ట్ర కోర్టు రాజ్యాంగం ప్రకారం ఎన్నికలలో పోటీ చేసేందుకు ట్రంప్ అనర్హుడని తీర్పు ఇచ్చింది. ఇది ట్రంప్, అతగాడిని గుడ్డిగా సమర్థించేవారికి పెద్ద కుదుపు అని చెప్పక తప్పదు. పన్నుల ఎగవేత, రికార్డుల తారుమారు మొదలు బూతు పురాణం వరకు అనేక కేసులు అతగాడి మీద ఉన్నాయి. అన్నింటికీ మించి గత ఎన్నికల్లో ఓటమిని జీర్ణించుకోలేక పార్లమెంటు మీదనే తన అనుచరులను దాడికి పురికొల్పిన అంశం తెలిసిందే. అమెరికా రాజ్యాంగంలోని పద్నాలుగవ సవరణ, మూడవ సెక్షన్ ప్రకారం శాసన వ్యవస్థ మీద తిరుగుబాటు చేసిన లేదా చేయించిన వారికి ఆ సంస్థలకు ఎన్నికయ్యే హక్కు లేదని పేర్కొన్నందున వచ్చే ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనర్హుడని కొలరాడో కోర్టు 4-3 మెజారిటీతో తీర్పు ఇచ్చింది. వందల సంవత్సరాల నాడు అమెరికా అంతర్యుద్ధంలో తిరుగుబాటు చేసిన వారిని అడ్డుకొనేందుకు తెచ్చిన సవరణను తొలిసారిగా వినియోగించింది.



అమెరికా చరిత్రలో అధ్యక్షులుగా పని చేసిన వారిలో అత్యంత హీన, చెత్త నేపథ్యం గలిగిన వాడిగా డోనాల్డ్ ట్రంప్ చరిత్రకెక్కాడు. తాజాగా అలాంటిదే మరో ఘనతను కూడా తన ఖాతాలో వేసుకున్నాడు. దేశ అధికార కేంద్రంపై జరిపిన దాడిని తిరుగుబాటుగా పరిగణించిన కొలరాడో రాష్ట్ర కోర్టు రాజ్యాంగం ప్రకారం ఎన్నికలలో పోటీ చేసేందుకు ట్రంప్ అనర్హుడని తీర్పు ఇచ్చింది. ఇది ట్రంప్, అతగాడిని గుడ్డిగా సమర్థించేవారికి పెద్ద కుదుపు అని చెప్పక తప్పదు. పన్నుల ఎగవేత, రికార్డుల తారుమారు మొదలు బూతు పురాణం వరకు అనేక కేసులు అతగాడి మీద ఉన్నాయి. అన్నింటికీ మించి గత ఎన్నికల్లో ఓటమిని జీర్ణించుకోలేక పార్లమెంటు మీదనే తన అనుచరులను దాడికి పురికొల్పిన అంశం తెలిసిందే. అమెరికా రాజ్యాంగంలోని పద్నాలుగవ సవరణ, మూడవ సెక్షన్ ప్రకారం శాసన వ్యవస్థ మీద తిరుగుబాటు చేసిన లేదా చేయించిన వారికి ఆ సంస్థలకు ఎన్నికయ్యే హక్కు లేదని పేర్కొన్నందున వచ్చే ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనర్హుడని కొలరాడో కోర్టు 4-3 మెజారిటీతో తీర్పు ఇచ్చింది. వందల సంవత్సరాల నాడు అమెరికా అంతర్యుద్ధంలో తిరుగుబాటు చేసిన వారిని అడ్డుకొనేందుకు తెచ్చిన సవరణను తొలిసారిగా వినియోగించింది. 2021 జనవరి ఆరవ తేదీన అమెరికా అధికార కేంద్రం (పార్లమెంటు, అధ్యక్ష భవనాల ప్రాంతం) మీద ట్రంప్ దాడి చేయించిన సంగతి తెలిసిందే. ఒక రాష్ట్ర కోర్టుకు ఇలాంటి తీర్పు ఇచ్చే అధికారం లేదంటూ దేశ సుప్రీం కోర్టులో అప్పీలు చేసేందుకు ట్రంప్ బృందం నిర్ణయించింది. అక్కడ ఏం జరుగుతుందనేది చెప్పలేము.

కొలరాడో కోర్టు ఇచ్చిన తీర్పు ప్రభావం నామమాత్రమేనని, అసలు సదరు సెక్షన్ అధ్యక్ష పదవికి వర్తిస్తుందా లేదా అన్నది కూడా అస్పష్టంగా ఉందని, దీంతో ఇంకా ట్రంప్‌కు మద్దతు పెరగవచ్చని కూడా చెబుతున్నవారు లేకపోలేదు. ఎందుకంటే ఇతర కేసుల్లో గతంలో అరెస్టయి విడుదలైనపుడు ఇరవై నాలుగు గంటల్లోనే అభిమానులు 40 లక్షల డాలర్ల విరాళాలు ఇచ్చి ప్రోత్సహించటాన్ని చూశాము. ఈ తీర్పు ప్రజాస్వామ్య గుండె మీదనే జరిగిన దాడిగా ట్రంప్ ప్రతినిధి అలీనా హబ్బా వర్ణించింది. సుప్రీంకోర్టులో ఎక్కువ మంది న్యాయమూర్తులను నియమించింది ట్రంపే గనుక వారికి ఉప్పు తిన్న విశ్వాసం ఉంటుందని భావిస్తున్నారు. ఇదే గనుక జరిగితే అమెరికా న్యాయ వ్యవస్థకు అది చెరగని మచ్చ అవుతుంది. అధికార కేంద్రంపై జరిగిన దాడి తిరుగుబాటు పరిధిలోకి వస్తుందా రాదా అన్నది కూడా సుప్రీం కోర్టు తేల్చాల్సి ఉంది. కొలరాడో కోర్టు తీర్పును గుడ్డిగా పక్కన పెడుతుందా అన్నది ప్రశ్న. ట్రంప్ ఎన్నికల్లో పోటీని సవాలు చేస్తూ 25 రాష్ట్రాల్లో కేసులు ఉన్నాయి. ప్రస్తుతం జో బైడెన్ పలుకుబడి చాలా తక్కువగా ఉందని, ట్రంప్ ముందంజలో ఉన్నట్లు సర్వేలు వెల్లడిస్తున్నాయి.

రాజకీయంగా చూసినపుడు అధికారం లేని కోర్టు తీర్పుకు బలైన ఒక బాధితుడిగా ఓటర్ల ముందుకు వస్తాడని కొందరు, పలుకుబడి దిగజారవచ్చని మరికొందరు అభిప్రాయపడుతున్నారు. ఎన్నికల్లోపు మిగతా రాష్ట్రాల కోర్టుల్లో కూడా ఇదే విధమైన తీర్పులు వస్తే సాంకేతికంగా ఎలాంటి ఇబ్బందులు కలిగిస్తాయో తెలియదు గానీ జనంలో చర్చకు దారితీసి గబ్బుపట్టవచ్చు. డోనాల్డ్ ట్రంప్ నిర్వాకం ఇప్పటికే అమెరికాను రాజ్యాంగ రొంపిలోకి దించింది. మరోవైపు తమ నేత ఏం చేసినా సరైనదే అనే అడ్డగోలు ధోరణులు పెరుగుతున్నాయి. రాజ్యాంగాన్ని కాపాడతానని ప్రమాణం చేసిన ట్రంప్ దాన్ని ఉల్లంఘించి అదే రాజ్యాంగం ప్రకారం గెలిచిన జో బైడెన్ ఎన్నికను అడ్డుకొనేందుకు చూడటం తిరుగుబాటు కిందకే వస్తుందని కొందరి భాష్యం. దీన్ని చూసీ చూడనట్లు వదలివేస్తే, ఎలాంటి శిక్ష విధించకపోతే ముందు ముందు ఎవరైనా అలాంటి పనులకు పాల్పడవచ్చు. ఎక్కువ సార్లు పార్టీలు మారినవాడిగా, రెండు సార్లు అభిశంసనకు గురై, తొలిసారిగా అరెస్టుతో పేరుమోసిన పెద్దగా ట్రంప్ చరిత్రకు ఎక్కాడు. నైతికంగా కూడా దిగజారిన ఈ పెద్దమనిషిని తిరిగి గద్దెనెక్కించాలంటూ 'హౌడీ మోడీ' పేరుతో అమెరికా లోని హూస్టన్ నగరంలో నిర్వహించిన కార్యక్రమంలో చెట్టపట్టాలు వేసుకొని కలియతిరిగిన నరేంద్ర మోడీ 'అబ్ కీ బార్ ట్రంప్ సర్కార్' అని నినాదమిచ్చిన సంగతి తెలిసిందే. 'నీవు ఎలాంటి వాడివో చెప్పాలంటే నీ స్నేహితుడిని చూస్తే చాలన్నది' ఒక సామెత. ట్రంప్ పచ్చి మితవాది, అమెరికా లోని సంఘ పరివార్ సంస్థలకు చెందిన వారు ట్రంప్ ప్రధాన మద్దతుదారులు, మోడీ-ట్రంప్‌లు ఇద్దరూ మితవాద భావజాలాలకు చెందిన వారు కావటమే వారిని చెట్టపట్టాలు వేసుకు తిరిగేట్లు చేసింది. ఇప్పుడు కూడా నరేంద్ర మోడీ ట్రంప్ గెలవాలని కోరుకుంటారా ?

- ఫీచర్స్ అండ్ పాలిటిక్స్

★

పివిటిజిలకు కొండ కింద పక్కా గృహాలు

- చింతూరు ఐటిడిఎ పిఒ చైతన్య

ప్రజాశక్తి - చింతూరు

ఏజెన్సీలో వెనుకబడిన గిరిజన తెగలు (పివిటిజి) ప్రజలకు ప్రభుత్వం తరుపున కొండ దిగువన పక్కా గృహాలు నిర్మించి ఇస్తామని చింతూరు ఐటిడిఎ పిఒ కావూరి చైతన్య తెలిపారు. మండలంలోని ఏడుగురాళ్లపల్లి సచివాలయం, ఉప్పనపల్లి గుట్ట గ్రామ పరిధిలో కొండపైన కొండ రెడ్డిల కుటుంబాలు నివసిస్తున్న చింతల పాడు గ్రామాన్ని గురువారం ఆయన సందర్శించారు. గ్రామస్తులతో సమావేశమై ప్రధాన మంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ పథకం గురించి వివరించారు. ఈ పథకం ద్వారా పివిటిజిలకు పక్కా గృహాలు నిర్మించి ఇస్తామని చెప్పడంతో వారు కొండ కిందకు వచ్చి నివసించడానికి సుముఖత వ్యక్తం చేశారు. చింతలపాడు ప్రైమరీ స్కూల్‌ను సందర్శించి అక్కడ విద్యార్థులతో ముచ్చటించారు. పివిటిజిలకు పైలెట్ ప్రాజెక్ట్ ద్వారా కొత్త ఆధార్ కార్డులు జారీ, మార్పులు, చేర్పులు, రైతు భరోసా, అమ్మఒడి, కిసాన్ కార్డ్స్, పోస్టల్ బ్యాంక్ అకౌంట్ ద్వారా ఎన్ఆర్ఇజిఎస్ జాబ్ కార్డులు, ప్రభుత్వం ద్వారా అందించే అన్ని సేవలను కొండరెడ్లకు అందే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కొత్తగా పోడు భూమి పట్టాలు మంజూరు చేయటం కోసం చింతల పాడు హాబిటేషన్‌లో గ్రామసభ నిర్వహించారు. భద్రాచలం ఐటిడిఎ నుండి విడిపోయి కొత్తగా చింతూరు ఐటిడిఎ ఏర్పాటు చేసిన నాటి నుంచి ఏ ప్రాజెక్టు అధికారి తమ గ్రామానికి రాలేదని, ఎంతో ప్రయాస పడి ఇక్కడకు వచ్చిన చైతన్యకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూనవరం, వి.ఆర్.పురం ఎంపిడివోలు, కూనవరం ఎఫ్ఆర్ఓ, రెవెన్యూ, ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.



ఎయు న్యాయకళాశాలలో మ్యూట్ కోర్టులో పాల్గొన్న సిపి రవిశంకర్; ఎయు విసి

- చిన్నారుల భద్రతకు సమిష్టి కృషి
- ఎయులో పోక్సో చట్టంపై అవగాహనకు మూట్ కోర్టులో సిపి రవిశంకర్

ప్రజాశక్తి- విశాఖపట్నం

చిన్నారుల భద్రతకు సమిష్టిగా పనిచేయాలని నగర పోలీసు కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ పిలుపునిచ్చారు. గురువారం ఎయు న్యాయ కళాశాల, విశాఖ పోలీసు శాఖ సంయుక్త ఆధ్వర్యాన పోక్సో చట్టంపై మూట్ కోర్టు ప్రజెంటేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపి రవిశంకర్ మాట్లాడుతూ భవిష్యత్తులో ఇటువంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహణకు యువతతో కలసి పనిచేస్తామన్నారు. న్యాయ విద్యార్థులు సామాజిక బాధ్యతతో నడచుకోవాలన్నారు. చిన్నారులపై లైంగిక వేధింపుల సంఘటనల్లో అవసరమైన ఆధారాలు సేకరించి, న్యాయస్థానాలలో రుజువుచేయడం, నిందితులకు శిక్షలు పడేలా చేయాల్సిన అవసరం ఉందని, దీనికి పోలీసుశాఖ విశేషకృషి చేస్తుందన్నారు. యువతలో చైతన్యం పెంపొందిచే కార్యక్రమాలతో వ్యవస్థను మరింత మెరుగుపరిచేందుకు పోలీసుశాఖ పాటుపడుతుందన్నారు. న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వి.విజయలక్ష్మి, ఎయు రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ఆచార్య ఎస్.సుమిత్ర, ఆచార్య రాజ్యలక్ష్మి, ఆచార్య కె.సీతామాణిక్యం తదితరులు మాట్లాడారు.

అనంతరం వివిధ సంఘటలపై న్యాయస్థానాలలో జరిగే వాదనలు నమూనాను (మూట్ కోర్ట్) విధానాన్ని ఎయు న్యాయ కళాశాల విద్యార్థులు ప్రత్యక్షంగా చేసి చూపించారు. బాధితులు, నిందితుల తరుపున వాదోపవాదాలు జరిపే విధానం, న్యాయమూర్తులకు సాక్ష్యాధారాలను అందించి, నిందితులకు శిక్షపడే పద్ధతులు వంటి న్యాయస్థానం పనిచేసే విధానాన్ని కళ్లకు కట్టినట్టు చూపారు. కార్యక్రమంలో పలువురు పోలీసు అధికారులు, ఎయు సిబ్బంది, న్యాయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

అర్ధాకలితో మిడ్డేమీల్స్ కార్మికులు

- ధరలకనుగుణంగా పెరగని బడ్జెట్
- అమలుకు నోచుకోని కనీస వేతనం
- సమస్యల పరిష్కారం కోసం 5న 'చలో విజయవాడ'



ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

విద్యార్థులకు అన్నంపెట్టి కడుపు నింపుతున్న మిడ్డేమీల్స్ కార్మికులు మాత్రం అర్థాకలితో అలమటిస్తున్నారు. కనీస వేతనాలు లేక, బిల్లులు సకాలంలో విడుదల కాక నానా ఇబ్బందులకు గురవుతున్నారు. పాఠశాలల సెలవులు మినహా నెలంతా వండి పెట్టినా వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి వస్తున్నది రూ.3వేలు కూడా ఇవ్వడం లేదు. మధ్యాహ్న భోజన కార్మికుల పనికి భద్రత కల్పించడంతోపాటు మెస్ బిల్లులు ఎప్పటికప్పుడు చెల్లించాలని, కనీస వేతనం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతున్నా పట్టించుకున్న దాఖలాలే లేవు.

జిల్లాలో 980 స్కూళ్లలో మధ్యాహ్న భోజనాన్ని కార్మికులు వండి పెడుతున్నారు. వీటిలో 706 ప్రాథమిక, 85 ప్రాథమికోన్నత, 189 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు ఒక్కో విద్యార్థికి వండి పెట్టడానికి అవసరమైన నూనె, పోపు గింజలు, పప్పు, ఉప్పు, చింతపండు, కూరగాయలు, వంట చెరుకు తదితర సామగ్రి కోసం రూ.4.97 పైసలు, హైస్కూల్ విద్యార్థులకు రూ. 7.45 పైసలను మాత్రమే ప్రభుత్వం చెల్లిస్తోంది. కనీసం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రూ.10, హై స్కూల్ విద్యార్థులకు రూ.20 చెల్లించాలని కార్మికులు కోరుతున్నారు. సోమ, బుధ, శుక్రవారాల్లో మూడు రోజులపాటు కోడిగుడ్లు కూడా మెనూలో భాగంగా ఉంది. అయితే మార్కెట్‌లో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగినా ఒక్కో విద్యార్థి కోసం ఇచ్చే నగదును మాత్రం ప్రభుత్వం పెంచడం లేదు. సబ్సిడీపై వంటగ్యాస్ అందించాలనే డిమాండ్‌ను ప్రభుత్వం పూర్తిగా పెడచెవిన పెట్టింది. రాగి జావ పంపిణీకి అదనపు అలవెన్సులను చెల్లించట్లేదు.

రాజకీయ కోణంతో ఇబ్బందులు

వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే జగనన్న గోరుముద్ద పేరుతో మెనూలో మార్పులు చేసింది. ఆ మార్పులు తగినట్లుగా బిల్లులు మాత్రం పెంచలేదు. మరోవైపు పిఎంసి కమిటీలను నియమించింది. దీంతో రాజకీయ జోక్యం పెరిగింది. మధ్యాహ్న భోజన కార్మికుల అక్రమ తొలగింపులు, పని ప్రదేశాల్లో ఇబ్బందులకు గురి చేయడం సర్వసాధారణంగా మారాయి. నాణ్యత తగ్గినా, కూరలు, పప్పులు సరిపోయినంత ఇవ్వకున్నా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రాథమిక స్థాయి పిల్లలకు ఒక్కొక్కరికి ప్రభుత్వం వంద గ్రాముల బియ్యం ఇస్తుంది. గ్రామీణ ప్రాంతాల పిల్లలు అల్పాహారం తీసుకునే అలవాటు లేకపోవడం అందుకు వారి కుటుంబ ఆర్థిక పరిస్థితులు సహకరించకపోవడంతో మధ్యాహ్న భోజనంపైనే ఆధారపడుతున్నారు. అలాంటి విద్యార్థులకు ప్రభుత్వం ఇస్తున్న 100 గ్రాములు, 150 గ్రాముల బియ్యం సరిపోవడం లేదు. అదనంగా పిఎంసి కమిటీ సభ్యులు అక్కడే భోజనం చేయడం ఫలితంగా కొన్నిచోట్ల భోజనం సరిపోవడం లేదు. దీనికి కార్మికులనే బాధ్యులను చేస్తున్నారు.

చాలా చోట్ల కట్టెల పొయ్యే దిక్కు

మధ్యాహ్న భోజనం వండేందుకు ప్రభుత్వం గ్యాస్ సరఫరా చేయాలని, మెస్ చార్జీలు కాకుండా వంట కార్మికులకు కూడా సరఫరా చేయాలని కొన్నిచోట్లగా కోరుతున్నా ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం లేదు. గ్యాస్ భారం తట్టుకోలేక, అంత స్తోమత లేక ఇంకా చాలా చోట్ల కట్టెల పొయ్యిపైనే వంట చేయాల్సి వస్తుంది. దీనికి వంట చెరకును వారే సమకూర్చుకోవాల్సిన పరిస్థితి. దీంతో పొయ్యి నుంచి వచ్చే పొగ వల్ల కార్మికులు ఆరోగ్యపరమైన సమస్యలు ఎదుర్కొంటున్నారు. కార్మికుల్లో అత్యధిక మంది ఆస్తమా, ఎలర్జీలాంటి వ్యాధులతో బాధపడుతున్నారు. గ్యాస్‌పై వంట చేస్తున్నా వీరికి భారం తప్పట్లేదు. మూడు, నాలుగు నెలలకు ఒకసారి గాని బిల్లులు రావట్లేదు. దీంతో కార్మికులే అప్పోసప్పో చేసి గ్యాస్ బండలను వేయించుకుంటున్నారు. అలాగే సరుకులకు సంబంధించి కూడా బిల్లులు సకాలంలో చెల్లించట్లేదు.

జిల్లాలో నవంబరు నెల బకాయిలు రూ.57.75లక్షల వరకూ బకాయిలున్నాయి. ప్రతి నెల మండల విద్యాశాఖాధికారి జిల్లా అధికారులకు బిల్లును పంపగా అక్కడ నుంచి రాష్ట్ర ఫైనాన్స్ విభాగానికి వెళ్తాయి. నిధుల లభ్యతను బట్టి మూడు, నాలుగు నెలలకొకసారి ఫైనాన్స్ క్లియరెన్స్ అయ్యాక డబ్బు చెల్లిస్తున్నారు. అప్పటికే అప్పులకు వడ్డీలు కట్టలేక కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నారు.

సమస్యలను పరిష్కరించాలి

మిడ్డే మీల్స్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి. 20 ఏళ్లుగా పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండి పెడుతున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం చెల్లించే వేతనం మార్కెట్లో సరుకులు రావడం లేదు. నెల తరబడి బకాయిలు నిలిపివేయడంతో సొంత డబ్బులు పెట్టాల్సి వస్తుంది. మరికొంతకాలం అప్పులు చేసి పథకాన్ని నడుపుతున్నారు. కట్టెల పొయ్యి వాడకం ఫలితంగా చాలామంది అనారోగ్యాల పాలవుతున్నారు. నిత్యావసర సరుకుల, గ్యాస్‌ను ప్రభుత్వమే పంపిణీ చేయాలి. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రూ.10, హై స్కూల్ విద్యార్థులకు రూ.20 చొప్పున చెల్లించాలి. ఈ నెల 5న జరిగే చలో విజయవాడను విజయవంతం చేయాలి.

- ఎల్.ఆర్.ఈశ్వరి, అధ్యక్షులు, మిడ్డే మీల్స్ కార్మిక సంఘం, సీతానగరం

నేటి నుంచి జాతీయ స్థాయి నృత్యోత్సవాలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

నగరానికి చెందిన ప్రముఖ నృత్య సంస్థ అభినయ నృత్య భారతి 28వ జాతీయ స్థాయి నృత్యోత్సవాలు, నృత్యపోటీలు హేలాపురి లయన్స్ క్లబ్ సర్వీస్ ట్రస్ట్, లయన్స్ జిల్లా 316జి, నెహ్రూ యువకేంద్రం, హిందూ యువజన సంఘం (వైఎంహెచ్ఎ) సహకారంతో డిసెంబర్ 22, 23, 24 తేదీల్లో ఏలూరు వైఎంహెచ్ఎ హాలులో నిర్వహించనున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్ష, కార్యదర్శులు మనోహర్ గోపాల్ లునాని, నాట్యాచార్య లయన్ దువ్వి హేమసుందర్ ఒక ప్రకటనలో తెలిపారు.

నేటికీ అందని నవంబర్ నెల జీతాలు

- జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగుల ఆవేదన

ప్రజాశక్తి- విశాఖపట్నం

క్రిస్మస్ పండగ దగ్గరికి వస్తున్నా తమకు నవంబర్ నెల వేతనాలు ఇంకా అందకపోవడంతో వైద్యఆరోగ్యశాఖ నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం)లో పనిచేస్తున్న ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు. దసరా, దీపావళి, ఇపుడు క్రిస్మస్ ఇలా అన్ని పండగలకు సకాలంలో వేతనాలు అందకపోవడం వల్ల కుటుంబాలతో ఇబ్బందులు పడుతున్నామని నేషనల్ హెల్త్‌మిషన్ ఉద్యోగుల యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు గోపి, వీరబ్రహ్మాం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా 196 కేడర్‌లతో 22వేల మంది ఎన్‌హెచ్‌ఎంలో విధులు నిర్వహిస్తుండగా, ఉమ్మడి విశాఖలో 1500మందికి పైగా ఈ విభాగంలో పనిచేస్తున్నారు. తమకు కేంద్రం, రాష్ట్రం 60: 40 నిష్పత్తిలో వేతనాలు చెల్లించాల్సి ఉందని, అయినా ప్రతినెలా సకాలంలో వేతనాలు అందక ఆలస్యం కావడంతో అవస్థలు పడక తప్పడం లేదని వాపోతున్నారు. వేతనాలు సక్రమంగా అందకపోవడం వల్ల ఇంటి అద్దెలు, పిల్లల స్కూల్ ఫీజులు, నిత్యావసరాలు, ఇలా నెలవారీ కుటుంబపోషణ వ్యవహారాలన్నీ ఎలా సాగుతాయని ప్రశ్నించారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ప్రతినెలా ఒకటోతేదీన వేతనాలు చెల్లింపు చర్యలు చేపట్టాలని, అలాగే ప్రస్తుతం క్రిస్మస్‌కు వచ్చేనెలలో వచ్చే సంక్రాంతి ముందే వేతనాలు చెల్లింపునకు చర్యలు చేపట్టాలని వేడుకుంటున్నారు. దీనిపై నేషనల్ హెల్త్ మిషన్ ఎండి, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ తక్షణ చర్యలు చేపట్టాలని వేడుకుంటున్నారు.

భూయజమానులకే పరిహారం..!

- పూర్తయిన ఖరీఫ్ పంటనష్టం నమోదు ప్రక్రియ
- గ్రామ సచివాలయాల వద్ద జాబితాల ప్రదర్శన
- మరో నాలుగు రోజుల్లో తుదిజాబితా విడుదల
- 90 శాతం భూయజమానుల పేర్లే నమోదు
- ఇ-క్రాప్ పేరుతో కౌలురైతులకు తీరని అన్యాయం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి



ఖరీఫ్‌లో పంట నష్టపోయిన కౌలురైతులకు తీరని అన్యాయం జరుగుతోంది. పంటనష్టం నమోదులో 90 శాతం భూయజమానుల పేర్లే నమోదయ్యాయి. దీంతో పెట్టుబడి పెట్టి నష్టపోయిన కౌలురైతులకు పంట నష్టపరిహారం అందే పరిస్థితి లేకుండాపోయింది. రెండు జిల్లాలవ్యాప్తంగా ఖరీఫ్‌లో దాదాపు నాలుగు లక్షల ఎకరాలకుపైగా రైతులు వరిసాగు చేశారు. మిచౌంగ్ తుపాను విరుచుకుపడటంతో ముఖ్యంగా వరిసాగుపై తీవ్ర ప్రభావం చూపింది. పెద్దఎత్తున పంట దెబ్బతింది. ప్రాథమిక అంచనాల ప్రకారం దాదాపు లక్షా 30 వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు తేల్చారు. పూర్తిస్థాయిలో పంటనష్టం నమోదుకు ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. దీంతో ఆ ప్రక్రియను అధికారులు పూర్తి చేశారు. అభ్యంతరాల స్వీకరణ కోసం సచివాలయాల వద్ద జాబితాలను ప్రదర్శించారు. అభ్యంతరాల పరిష్కారం అనంతరం జిల్లా ఉన్నతాధికారులకు జాబితా చేరనుంది. ఈ నెల 26వ తేదీకి రెండు జిల్లాల్లో ఎంత పంట నష్టం జరిగిందో స్పష్టత రానుంది. అయితే సచివాలయాల వద్ద ప్రదర్శించిన జాబితాలు చూసి కౌలురైతులు లబోదిబోమంటున్నారు. పంట నష్టపోయిన వాస్తవ సాగుదారుని పేర్లు జాబితాలో లేకుండాపోయాయి. ఇ-క్రాప్ ఆధారంగా పంటనష్టం నమోదు ప్రక్రియ చేపట్టాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో అధికారులు అదేవిధంగా ప్రక్రియను పూర్తి చేశారు. ఇ-క్రాప్‌లో భూయజమానుల పేర్లే ఉన్నాయి. దీంతో పంటనష్టం నమోదు జాబితాలోనూ అవే పేర్లను అధికారులు చేర్చారు. మిచౌంగ్ తుపాను దెబ్బకు పొలాలు నేలనంటి నీటిలో నాని దెబ్బతిన్నాయి. ఎకరాకు రూ.30 వేలకుపైగా రైతులు పెట్టుబడులు పెట్టారు. మూడెకరాలు సాగు చేసిన రైతు దాదాపు రూ.లక్ష వరకూ నష్టపోయాడు. పదెకరాలు సాగు చేసిన రైతు రూ.మూడు లక్షల వరకూ నష్టపోయిన పరిస్థితి నెలకొంది. పంటనష్టం నమోదులో మాత్రం దెబ్బతిన్న కౌలురైతుల పేర్లు చేరలేదు. దీంతో ప్రభుత్వం అందించే సాయం కౌలురైతులకు అందని ద్రాక్షనే అని తేలిపోయింది. దీంతో కౌలురైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. అధికారులను ప్రశ్నిస్తే మీ భూయజమానితో మాట్లాడుకోవాలని చెబుతున్న పరిస్థితి నెలకొంది. భూయజమానిని అడిగితే వచ్చే సీజన్‌లో పొలం సాగుకు కౌలుకు ఇచ్చే పరిస్థితి లేకుండాపోవడంతో కౌలురైతులు మౌనంగా రోదిస్తున్నారు. వైసిపి ప్రభుత్వం కౌలుచట్టంలో మార్పులు చేసి కౌలురైతులను కోలుకోలేని దెబ్బతీసింది.

కౌలు రైతులకు న్యాయం జరిగేదెలా

ఖరీఫ్‌లో దెబ్బతిన్న పంటలకు సంబంధించి రూపాయి పెట్టుబడి కూడా భూయజమానులు పెట్టలేదు. అటువంటప్పుడు ప్రభుత్వం అందించే సాయం వాస్తవ సాగుదారుడైన కౌలురైతులకు కాకుండా భూయజమానికి ఇస్తే ఏవిధంగా మేలు జరుగుతుందో ప్రభుత్వం చెప్పాలి. ఇదే తరహాలో పంట నష్టపరిహారంతోపాటు బీమా సొమ్ము సైతం భూయజమానుల జేబుల్లోకే వెళ్లిపోనుంది. గడిచిన ఐదేళ్లలో జిల్లాలో కౌలురైతుల ఆత్మహత్యలు పదుల సంఖ్యలో చోటుచేసుకున్నాయి. దీనికి ప్రధానకారణం పంటను కోల్పోతున్న కౌలు రైతులకు ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయమూ అందకపోవడమే. ప్రభుత్వం తమను ఆదుకుంటుందనే భరోసా వాస్తవ సాగుదారుడైన కౌలురైతులకు లేకుండాపోయింది. రెండు జిల్లాల్లోనూ మూడు లక్షల మంది కౌలురైతులు ఉన్నారు. 80 శాతం సాగు కౌలురైతులే చేస్తున్నారు. దీనిలో పది శాతం మంది కౌలురైతుల పేర్లు కూడా పంటనష్ట నమోదు జాబితాలో చేరలేదు. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో కౌలురైతుల్లో తీవ్ర ఆగ్రహజ్వాలలు వ్యక్తమవుతున్నాయి. వైసిపి ప్రభుత్వం కౌలురైతులను పక్కనపెట్టి భూయజమానులకు కొమ్ముకాస్తుందనే విమర్శలు విన్పిస్తున్నాయి.

పంచాయతీల నిధులు దారిమళ్లింపు

- ఉత్సవ విగ్రహాలుగా సర్పంచ్‌లు
- రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షులు రాజేంద్రప్రసాద్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ఆర్థిక సంఘం నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారిమళ్లించిందని రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షులు వై.వి.బి రాజేంద్రప్రసాద్ ధ్వజమెత్తారు. నగరంలోని ఒక హోటల్‌లో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దీనివల్ల గ్రామాల్లో కనీస మౌలిక సౌకర్యాలు కల్పించలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. వాలంటీర్లు, గృహ సారథులకు అధికారాలను కట్టబెడుతూ సర్పంచ్‌ల హక్కులను కాలరాస్తూ వారిని ఉత్సవ విగ్రహాలుగా మార్చేసిందన్నారు. వైసిపి ప్రభుత్వం పంచాయతీలను పూర్తిగా నిర్వీర్యం చేసిందని విమర్శించారు. పంచాయతీలు, సర్పంచ్‌లకు సంబంధించిన 16 డిమాండ్లను నెరవేర్చాలని రాష్ట్రవ్యాప్త ఉద్యమాన్ని తీవ్రతరం చేయనున్నామని చెప్పారు. రాజకీయాలకతీతంగా సర్పంచ్‌లందరూ ఏకమై ఉమ్మడిగా ఉద్యమిస్తామన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కమిటీ

- గ్రామ, వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని గ్రామ, వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు షేక్ అబ్దుల్ రజాక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు రెండు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలన్నారు. ఉద్యోగులకు ఆలస్యంగా ప్రొబేషన్ డిక్లేర్ చేసినందున, ఆ సమయంలో రావాల్సిన బకాయిలు త్వరితగతిన ఇవ్వాలన్నారు. తక్షణమే ఉద్యోగోన్నతి ఛానల్ ప్రకటించి అర్హులైన సచివాలయ ఉద్యోగులందరికీ ఉద్యోగోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. సచివాలయ ఉద్యోగులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలన్నారు. యూనిఫామ్‌ను రద్దు చేయాలన్నారు. ఇన్‌ఛార్జులుగా విధులు నిర్వహిస్తున్న సచివాలయ ఉద్యోగులకు ఫుల్ అడిషనల్ చార్జ్ ఇచ్చి, అదనపు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయశాఖ, అనుబంధ శాఖల ఉద్యోగులకు తక్షణమే బదిలీలు చేపట్టాలన్నారు.

పార్లమెంట్ భద్రత ఇక 'సిఐఎస్ఎఫ్'కు



న్యూఢిల్లీ : ఇటీవల జరిగిన పార్లమెంట్ భద్రతా వైఫల్యం ఘటన ప్రపంచవ్యాప్తంగా సంచలనంగా మారింది. అలాగే ఈ ఘటనతో పార్లమెంట్ భద్రత పై అనేక సందేహాలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై పార్లమెంట్ భవన సముదాయంలో సమగ్ర భద్రత బాధ్యతలను సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సిఐఎస్ఎఫ్)కు అప్పగించాలని కేంద్రం నిర్ణయించినట్లు ప్రభుత్వ అధికారులు గురువారం తెలిపారు. అలాగే పార్లమెంట్ భవన సముదాయంలో సర్వే చేపట్టాలని కేంద్ర హోంశాఖ బుధవారం ఆదేశించినట్లు అధికారులు తెలిపారు. ఈ సర్వే అనంతరం పార్లమెంట్ ప్రాంగణంలో సిఐఎస్ఎఫ్ సిబ్బందిని మోహరించనున్నట్లు తెలుస్తోంది. సీఐఎస్ఎఫ్‌కు చెందిన గవర్నమెంట్ బిల్డింగ్ సెక్యూరిటీ (జిబిఎస్) యూనిట్ నిపుణులు, ఫైర్ యూనిట్ సభ్యులు ప్రస్తుత పార్లమెంట్ భద్రతా సిబ్బందితో కలిసి ఈ వారాంతంలో సర్వే చేపట్టనున్నారు. ఈ ప్రక్రియ అనంతరం.. పాత, కొత్త పార్లమెంట్ కాంప్లెక్స్‌లు, వాటి అనుబంధ భవనాలు అన్నింటినీ సీఐఎస్ఎఫ్ ఆధీనంలోకి తీసుకురానున్నట్లు తెలుస్తోంది. దీని కిందే ప్రస్తుతం పార్లమెంట్ వద్ద భద్రతను పర్యవేక్షిస్తున్న పార్లమెంట్ సెక్యూరిటీ సర్వీస్, ఢిల్లీ పోలీసు, సీఆర్పీఎఫ్‌కు చెందిన పార్లమెంట్ డ్యూటీ గ్రూప్ సిబ్బంది కూడా ఉన్నారు. సీఐఎస్ఎఫ్ అనేది.. కేంద్ర సాయుధ పోలీసు దళం. ప్రస్తుతం ఈ దళం ఢిల్లీలోని పలు కేంద్ర మంత్రిత్వ శాఖల భవనాలతో పాటు అణు, ఏరోస్పేస్ డొమైన్, సివిల్ ఎయిర్‌పోర్టులు, మెట్రో వద్ద భద్రత కల్పిస్తోంది.

విద్యార్థులందరూ సృజనకారులే..



అమరావతి బాలోత్సవంలో మాట్లాడుతున్న ఇంతియాజ్.



మంగళగిరి-తాడేపల్లి బాలోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్‌టిఎంసి కమిషనర్ నిర్మల్‌కుమార్

- వారిలో ప్రతిభాపాఠశాలను వెలికి తీయాలి
- బాలోత్సవాల్లో పలువురు వక్తలు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్ (గుంటూరు జిల్లా)/ ఎడ్యుకేషన్ (విజయవాడ)

విద్యార్థులందరూ సృజనకారులేనని, వారిలో నైపుణ్యాన్ని వెలికితీయడమే ఎవరైనా చేయాల్సిన పని అని పలువురు వక్తలు అన్నారు. పిల్లల్లోని ప్రతిభా పాఠవాలను వెలికి తీసేందుకు గుంటూరు, కృష్ణా జిల్లాల్లో బాలోత్సవాలు జరిగాయి. గుంటూరు జిల్లా మంగళగిరిలోని డాన్‌బాస్కో పాఠశాలలో రెండు రోజులపాటు జరిగే మంగళగిరి-తాడేపల్లి బాలోత్సవం ఉత్సాహభరిత వాతావరణంలో గురువారం ప్రారంభమైంది. ఈ బాలల పండుగను ఎమ్‌టిఎంసి కమిషనర్ నిర్మల్ కుమార్ ప్రారంభించారు. ప్రారంభ సభకు నిర్మల కళాశాల ప్రిన్సిపల్, బాలోత్సవం అధ్యక్షులు వివి ప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నిర్మల్ కుమార్ మాట్లాడుతూ.. చదువుతో పాటు ఇతర రంగాల్లోనూ రాణించి పరిపూర్ణమైన విద్యార్థిగా ఎదగడానికి వారధిగా బాలోత్సవాలు నిలుస్తాయన్నారు. బాలోత్సవం వ్యవస్థాపకులు వాసిరెడ్డి రమేష్‌బాబు మాట్లాడుతూ.. చిన్నారులు సహజంగా ఎదగడానికి ఇవి దోహదం చేస్తాయని వివరించారు. అమరా వతి బాలోత్సవం నిర్వాహకులు పిన్నమనేని మురళీకృష్ణ మాట్లాడుతూ.. ప్రశ్నించేతత్వం ఎల్లప్పుడూ ఉండాలని, సమాన అవకాశాలు అందరికీ అందాలని, విభేదాలు లేకుండా సమాజం ఎదగాలని ఆకాంక్షించే వారుగా బాలలు తయారు కావాలని పిలుపునిచ్చారు. సంగీతం, జానపద నృత్యాలు, నాటికలు, ఏకపాత్రాభినం, ఫ్యాన్సీడ్రస్, కథా రచన తదితర 40 రకాల అంశాల్లో 70 పాఠశాలల నుండి సుమారు 1500 మందికి పైగా విద్యార్థులు ఉత్సవానికి హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా ముగిసిన అమరావతి బాలోత్సవ్

విజయవాడ మొగల్‌రాజపురంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో మూడు రోజుల పాటు జరిగిన అమరావతి బాలోత్సవం ఆరవ పిల్లల పండుగ గురువారంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సెర్ప్ సిఇఒ ఎఎండి ఇంతియాజ్ పాల్గొని మాట్లాడుతూ.. విద్యార్థులు పరీక్షలకు ప్రిపేరయ్యే విధంగానే, ఆట, పాట, నృత్యం, చిత్రం, శిల్పం వంటి వాటిని పరీక్షల్లాగా ఎదుర్కోవాలని సూచించారు.

కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు మాట్లాడుతూ విద్యార్థుల్లో ఎన్నో అద్భుతమైన శక్తి సామర్థ్యాలు దాగిఉంటాయని వాటిని వెలికితీయడానికి బాలోత్సవం ఎంతగానో తోడ్పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి బాలోత్సవ్ కార్యదర్శి కొండలరావు అధ్యక్షత వహించగా కొత్తగూడెం బాలోత్సవ్ వ్యవస్థాపకులు డాక్టర్ వాసిరెడ్డి రమేష్, కెనరా బ్యాంకు ఎజిఎం మల్లికార్జునరావు, ప్రముఖ పారిశ్రామికవేత్త బాయన వెంకట్రావు, బాలోత్సవ్ అధ్యక్షులు ఎస్.పి.రామరాజు, గౌరవాధ్యక్షులు చలవాది మల్లిఖార్జునరావు, ఉపాధ్యక్షులు డాక్టర్ గుమ్మా సాంబశివరావు, డాక్టర్ వెన్నా వల్లభరావు, గోళ్ల నారాయణరావు పాల్గొన్నారు.



డాక్టర్ దీపను సత్కరిస్తున్న గీతం ప్రతినిధులు

మత్స్య వ్యర్థాలతో బహుళ ప్రయోజనాలు

గీతంలో అమెరికన్ వర్సిటీ పరిశోధకురాలు డాక్టర్ కె.దీప

ప్రజాశక్తి -మధురవాడ (విశాఖ)

సముద్ర ఆహారం మత్స్యసంపద నుంచి వేరుపడే వ్యర్థాల నుంచి ఎన్నో ప్రయోజనాలున్నాయని అమెరికాలోని క్రిస్టియన్ బ్రదర్స్ యూనివర్సిటీ, మెకానికల్ ఇంజనీరింగ్ పరిశోధకురాలు డాక్టర్ కె.దీప వెల్లడించారు. గురువారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ, మత్స్య పరిశ్రమలో చేపల చర్మం, రెక్కలు, ఎముకలు వంటివి వ్యర్థాలను వేరుచేస్తారన్నారు.ప్రపంచ వ్యాప్తంగా 8 మిలియన్ టన్నుల మత్స్యవ్యర్థాలు పరిశోధకులను ఆకర్షిస్తున్నాయన్నారు. మత్స్యాల నుంచి సేకరించే కొల్లిజన్, హైడ్రాక్సి ఎపటైట్ వంటి పదర్థాలు సౌందర్య సాధనాలు, బయో మెడికల్ రంగంలో వివిధ ఉత్పత్తులకు వాడుతున్నారని వెల్లడించారు. మత్స్యవ్యర్థాలతో తరహా ఫైబర్ తరహ నూతన పదార్థాలతో బహుళ ప్రయోజనాలున్నాయన్నారు మత్స్య పరిశ్రమ అధికంగా ఉండే ఆంధ్రప్రదేశ్‌లో పరిశోధకులు ఆయా అంశాలపై దృష్టి సారించాలని సూచించారు. మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం అధిపతి ప్రొఫెసర్ వి.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కోఆర్డినేటర్లు డాక్టర్ జె.సరోజిని, ఎస్.హేమంతకుమార్ పాల్గొన్నారు.

చురచంద్‌పూర్‌లో
87 కుకీ-జో మృతదేహాల సామూహిక ఖననం

ఇంఫాల్ : మణిపూర్‌లో జాతి హింసలో మరణించిన కుకీ-జో కమ్యూనిటీకి చెందిన 87 మంది మృతదేహాలను చురచంద్‌పూర్ జిల్లాలో సామూహిక ఖననం చేశారు. బుధవారం మధ్యాహ్నం 2.30 గంటలకు జిల్లాలోని సెహ్కెన్ గ్రామంలో అంత్యక్రియలు జరిగాయని రాష్ట్ర కుకీ-జో కమ్యూనిటీకి ప్రాతినిధ్యం వహిస్తున్న ఆదివాసీ గిరిజన నాయకుల ఫోరం తెలిపింది. అంతకుముందు రోజు, ట్యూబాంగ్ ప్రాంతంలోని పీస్ గ్రౌండ్‌లో మరణించిన వారికి వీడ్కోలు కార్యక్రమానికి వేలాది మంది హాజరయ్యారు.

ఇంఫాల్ నుంచి 41 మృతదేహాలను విమానంలో తరలించారు. మిగిలిన 46 మృతదేహాలను చురాచంద్‌పూర్ సివిల్ హాస్పిటల్‌లోని మార్చురీ నుంచి ఖననం చేసిన ప్రదేశానికి తీసుకువచ్చారు. ఈ విషయాన్ని ఇండిజినస్ ట్రైబల్ లీడర్స్ ఫోరమ్ ప్రతినిధి తెలిపారు. సామూహిక ఖననం వద్ద, సంతాపకులు "ఇగం హిలౌ హామ్(ఇది నా భూమి కాదా?)" వంటి పాటలు పాడారు. ఈనెల 15న ఇదే విధమైన సామూహిక ఖననం కాంగ్‌పోక్పి జిల్లాలో జరిగింది. ఇందులో కుకీ-జో కమ్యూనిటీకి చెందిన 19 మంది సభ్యుల మృతదేహాలకు అంత్యక్రియలు జరిగాయి. మణిపూర్‌లో మెయిటీ, కుకీ వర్గాల మధ్య ఈ ఏడాది మే ప్రారంభం నుంచి జాతి ఘర్షణలు జరుగుతున్నాయి. పోలీసు రికార్డుల ప్రకారం.. ఈ ఘర్షణలో 175 మంది మరణించారు. దాదాపు 60,000 మంది ప్రజలు తమ ఇండ్లను విడిచిపెట్టాల్సి వచ్చింది. మణిపూర్‌లో జరిగిన జాతి హింసలో మరణించిన వారందరికీ గౌరవప్రదమైన ఖననం, దహన సంస్కారాలు నిర్వహించాలన్న కోర్టు ఆదేశాలనుసారం మణిపూర్ ప్రభుత్వం ఈ విధమైన సామూహిక అంత్యక్రియలను జరిపింది.

ఏజెన్సీలో పెరిగిన చలి ప్రభావం

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం(విజయనగరం జిల్లా)

మన్యంలో గత ఐదు రోజుల నుంచి చలి తీవ్రత పెరిగింది. సాయంత్రం 6 గంటల నుంచి మొదలైన మంచు మరుసటి రోజు ఉదయం 9 గంటల వరకు కురుస్తుంది. దీంతో ఏజెన్సీలో ఉష్ణోగ్రతలు కనిష్టం 11, గరిష్టం 28 డిగ్రీలు నమోదు అవుతుంది. చలి తీవ్రతను తట్టుకునేందుకు గిరిజన గ్రామాల్లో ప్రజలు చలి మంటలు వేసుకుని వెచ్చదనం పొందుతున్నారు. ఉదయం 7 వరకు పొగ మంచు కురవడంతో లైట్లు వేసుకొని వాహనాలు ప్రయాణిస్తున్నారు. మంచు ప్రభావం కారణంగా జలుబు, దగ్గు లక్షణాలతో ఆసుపత్రులకు వెళ్తున్నారు. ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

గ్రామాల్లో నగదు కొరత

- పేరుకే బిజినెస్ కరస్పాండెంట్లు
- అనునిత్యం నగదు లేమితో విలవిల
- పెన్షనర్లకు, డిబిటి లబ్ధిదారులకు ఇక్కట్లు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ప్రభుత్వ పథకాలు అందుకుంటున్న లబ్ధిదారులు, ఇతర పింఛనుదారులకు గ్రామాల్లో సమస్యలు నెలకొంటున్నాయి. వారికి బ్యాంకుల ద్వారా సాయం అందించేందుకు నియమిస్తున్న బిజినెస్ కరస్పాండెంట్ల వద్ద నగదు లేకపోవడంతో ఈ సమస్యలు తలెత్తుతున్నాయి. దీనిపై బ్యాంకుల యాజమాన్యాలకు తగిన సూచనలు వెళ్తున్నప్పటికీ ఫలితం మాత్రం కనిపించడం లేదు. ప్రధానంగా నేరుగా నగదు బదిలీ ద్వారా మేలు పొందేవారికి ఈ పరిస్థితి ఇబ్బందులు కలిగిస్తోంది.

బ్యాంకింగ్ సౌకర్యాలు లేని మారుమూల గ్రామాల్లోని ప్రజలకు ఆర్థిక అవసరాలు తీర్చేందుకు గానూ బిజినెస్ కరస్పాండెంట్ల (బిసి)ను నియమించారు. వీరంతా బ్యాంకుల ఆధీనంలోనే పనిచేయాల్సి ఉంటుంది. బ్యాంకుల ద్వారా బిసిలకు నగదు అందుతుంది. వారి నుంచి పింఛనుదారులు, నగదు బదిలీ లబ్ధిదారులు, ఇతర ప్రభుత్వ పథకాలు అందుకునే వారు నగదు తీసుకుంటారు. దూరాన ఉన్న బ్యాంకులకు వెళ్లలేని వారికి బిజినెస్ కరస్పాండెంట్ల విధానం ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. అయితే ప్రస్తుతం అనేక ప్రాంతాల్లో బిజినెస్ కరస్పాండెంట్ల వద్ద నగదు నిల్వ లేకపోవడంతో లబ్ధిదారులకు నగదును అందించలేకపోతున్నారు. దీంతో ఆ లబ్ధిదారులంతా దూరంగా ఉన్న బ్యాంకులకు పరుగులు తీయాల్సి వస్తోంది. బ్యాంకుల్లో కూడా గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి రావడంతో వారికి ఇబ్బందిగా మారుతోంది. ఇదే అంశంపై బ్యాంకులకు కూడా ఇబ్బడిముబ్బడిగా ఫిర్యాదులు అందాయి. తాజాగా ఇదే అంశం రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమితి దృష్టికి రావడంతో కొద్ది రోజుల క్రితమే నిశితంగా చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వ అధికారులు కూడా బ్యాంకర్లతో సమీక్షించి లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా బిజినెస్ కరస్పాండెంట్ల వద్ద నగదు నిల్వ ఉండేలా చూడాలని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలోనే బ్యాంకుల నుంచి బిజినెస్ కరస్పాండెంట్లకు అవసరమైన సూచనలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. బిసిలు బ్యాంకు శాఖల్లో కాకుండా నేరుగా వారికి కేటాయించిన గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలని నిర్దేశించింది.


ఇడి విచారణకు కేజ్రీవాల్ డుమ్మా

- రెండోసారి పంపిన నోటీసులనూ పట్టించుకోని ఢిల్లీ సిఎం
- నోటీసులు రాజకీయ ప్రేరేపితం, అక్రమమని విమర్శ

న్యూఢిల్లీ : ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో వాంగ్మూలం నమోదు చేయటానికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఇడి) జారీ చేసిన రెండో సమన్లనూ ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ నాయకులు క్రేజీవాల్ దాటవేశారు. గురువారం హాజరు కావాలని ఇడి అధికారులు కేజ్రీవాల్‌కు సమన్లు జారీ చేసిన సంగతి తెలిసందే. అయితే, వీటిని మాత్రం ఆయన పట్టించుకోలేదు. ఈ నోటీసులపై తీవ్రంగా కేజ్రీవాల్ స్పందించారు. ఇది రాజకీయ ప్రేరేపితం, అక్రమమని అన్నారు. సమన్లను ఉపసంహరించుకోవాలవని తెలిపారు. తాను జీవితాన్ని నిజాయితీగా, పారదర్శకంగా గడిపాననీ, తాను దాచడానికి ఏమీ లేదు అని కేజ్రీవాల్ చెప్పారు. కేజ్రీవాల్ ఈడీ నుంచి అందిన సమన్లను దాటవేయడం ఇది రెండోసారి. నవంబర్ 2న విచారణాధికారుల ముందు హాజరుకావాలని గతంలో కోరగా, ఆ సమయంలోనూ ఆయన సమన్లను పట్టించుకోలేదు. మధ్యప్రదేశ్ ఎన్నికలకు ముందు ప్రచారానికి వెళ్లినందున తాను హాజరు కాలేనని కేజ్రీవాల్ అప్పట్లో ఈడీకి తెలిపారు. ఢిల్లీ ప్రభుత్వం ఇప్పుడు రద్దు చేసిన ఎక్సైజ్ పాలసీలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ సీబీఐ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ కేసు నమోదైన విషయం విదితమే. ఈ కేసులో ఇద్దరు ఆప్ సీనియర్ నేతలు మనీష్ సిసోడియా, సంజయ్ సింగ్ ప్రస్తుతం జైలులో ఉన్నారు.

ఆ దగ్గు మందులపై నిషేధం

- సిడిఎస్‌సిఒ నిర్ణయం



న్యూఢిల్లీ : నాలుగేళ్లలోపు వయసున్న పిల్లలకు ఒక జలుబు, దగ్గు నిరోధక ఔషధ మిశ్రమాన్ని వాడటాన్ని నిషేధిస్తూ భారత డ్రగ్ కంట్రోలర్ అయిన సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (సిడిఎస్‌సిఒ) నిర్ణయం తీసుకుంది. గత సంవత్సరం గాంబియా, ఉజ్బెకిస్తాన్‌లలో చాలా మంది పిల్లలు భారత దగ్గు మందు వాడిన కారణంగా ప్రాణాలు కోల్పోయారని ఆరోపణలు వచ్చాయి. ఈ దగ్గు మందులు భారత్‌లో తయారై, అక్కడికి ఎగుమతి అయ్యాయి. మన దేశంలో కూడా 2019 నుంచి 2020 మధ్య 12 మంది పిల్లలు దగ్గు మందు కారణంగా ప్రాణాలు కోల్పోయారనే ఆరోపణలు వచ్చాయి. వీటిని తయారు చేసిన కంపెనీలు మాత్రం ఆరోపణలను కొట్టిపడేశాయి. ఇవి సురక్షితమైనవేనని, వీటి తయారీలో ఎలాంటి పొరపాట్లు జరగలేదని చెప్పాయి. నిషేధించిన డ్రగ్ కాంబినేషన్‌లో క్లోర్ఫెనిరామైన్ మేలియేట్, ఫినైలెఫ్రిన్ ఔషధాలు ఉన్నాయని రాయిటర్స్ వార్తాసంస్థ తెలిపింది. దీనిని 2015లో ఆమోదించారు. ఈ కాంబినేషన్‌ను దగ్గు సిరప్‌లలో, సాధారణ జలుబు చికిత్స కోసం వాడే ట్యాబ్లెట్లలో వినియోగిస్తారు. ఈ కాంబినేషన్‌ను నిషేధిస్తూ ఈ నెల 18న జారీ చేసిన ఉత్తర్వును 20న బహిరంగపరిచారు. దీంతో మందుల తయారీ కంపెనీలు ఈ కొత్త ఆదేశాలను తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది. ఒకవేళ ఈ కాంబినేషన్ ఉన్న దగ్గు మందులని అమ్మాలనుకుంటే నాలుగేళ్లలోపు పిల్లలకు వీటిని వాడకూడదని హెచ్చరించే లేబుల్‌ని తప్పనిసరిగా పెట్టాలి.

డబ్ల్యుహెచ్ఒ హెచ్చరికలతో పెరిగిన పర్యవేక్షణ

గాంబియాలో 66 మంది పిల్లలు ప్రాణాలు కోల్పోయారని తెలిసి, భారత్‌లో తయారవుతున్న దగ్గు మందులపై ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఒ) అంతర్జాతీయంగా హెచ్చరిక జారీ చేయడంతో, దగ్గు మందులపై పర్యవేక్షణ పెరిగింది. దగ్గు మందులో డైఇథలీన్ గ్లైకాల్, విషపూరిత ఆల్కహాల్‌గా భావించే డ్రగ్ ఇథలీన్ గ్లైకాల్ పరిమితికి మించిన మోతాదులో ఉన్నాయని లేబొరేటరీ విశ్లేషణలో బయటపడింది. తర్వాత ఇలాంటి మరణాలే ఉజ్బెకిస్తాన్‌లోనూ చోటుచేసుకున్నాయి. భారత్‌లో తయారైన దగ్గు మందు కారణంగా 2022 నాటికి 18 మంది పిల్లలు మరణించారని ఉజ్బెకిస్తాన్ ఆరోగ్య శాఖ ఆరోపించింది. భారత్‌లోని జమ్మూ ప్రాంతంలో కూడా 2019లో కొందరు పిల్లలు ప్రాణాలు కోల్పోయారు. రెండేళ్ల వయసు నుంచి ఆరేళ్ల వయసులోపు పిల్లలు 12 మంది దగ్గు మందు తాగి ప్రాణాలు కోల్పోయారు. దీనిపై సిడిఎస్‌సిఒ స్పందిస్తూ ఇది అరుదైన ఘటనగా పేర్కొంది. గాంబియాలోని పిల్లల మరణాలతో సంబంధమున్న నాలుగు దగ్గు మందులు కూడా క్లియరెన్స్ పరీక్షల్లో నిబంధనలకు అనుగుణంగానే ఉన్నాయని సిడిఎస్‌సిఒ చెప్పుకొచ్చింది. అయితే,ఈ వాదనతో ప్రపంచ ఆరోగ్య సంస్థ ఏకీభవించలేదు. అనంతరం ఉజ్బెకిస్తాన్‌లోని పిల్లల మరణాలకు కారణమైందనే ఆరోపణలు ఎదుర్కొన్న భారతీయ మందుల తయారీ కంపెనీ లైసెన్స్‌ను రద్దు చేసింది. అలానే మందుల తయారీ ప్రక్రియపై లోతైన పర్యవేక్షణ ఉండేలా చర్యలు చేపట్టారు. భారత్‌లోని మందుల తయారీ కంపెనీలన్నీ, ఇతర దేశాలకు దగ్గు మందు ఎగుమతులు చేసే మందు నిర్దేశిత పరీక్షలు చేయించడాన్ని తప్పనిసరి చేస్తూ జూన్‌లో ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

ఒక రోజు ముందే.. ముగిసిన పార్లమెంట్

- 18 బిల్లులు ఆమోదం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

షెడ్యూల్‌లో ప్రకటించిన దాని కంటే ఒక రోజు ముందుగానే పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ముగిసాయి. భద్రతా వైఫల్యం ఘటన...ఈ అంశంపై ఉభయ సభల్లో ప్రతిపక్షాల ఆందోళన... రికార్డు స్థాయిలో రెండు సభల నుంచి ఎంపిల సస్పెన్షన్... పలు కీలక బిల్లులకు ఆమోదం, వాడి వేడి చర్చల మధ్య నిర్ణయించిన షెడ్యూల్ కన్న ముందే పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ముగిసాయి. ఈనెల 4న ప్రారంభమైన పార్లమెంట్ సమావేశాలు మొత్తం 14 రోజులు జరిగాయి. 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు ఈ సమావేశాలు కీలకంగా భావించిన కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం సుదీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న కీలక బిల్లులను పాస్ చేసుకుంది. కొత్తగా తీసుకొని వచ్చిన మూడు క్రిమినల్ చట్టాలు, జమ్మూ కశ్మీర్ పునర్వ్యవస్థీకరణ బిల్లు, సెంట్రల్ యూనివర్సిటీల సవరణ బిల్లు(తెలంగాణ సమ్మక్క, సారక్క ట్రైబల్ యూనివర్సిటీ ఏర్పాటు బిల్లు), చీఫ్ ఎలక్షన్ కమిషనర్, ఎలక్షన్ కమిషనర్ల నియామకం తదితర బిల్లులకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. ముఖ్యంగా చివరి రోజు లోక్‌సభలో ప్రెస్ అండ్ రిజిర్ట్రేషన్ ఆఫ్ పీరియాడికల్స్ బిల్లు-2023, సిఇసి నియామకాల బిల్లు ను మూజువాణి ఓటుతో ఆమోదం తెలిపారు. అనంతరం సభను స్పీకర్ ఓం బిర్లా నిరవధికంగా వాయిదా వేశారు.

లోక్‌సభలో 18 బిల్లులు ఆమోదం

మొత్తం 14 రోజుల పాటు సమావేశమైన లోక్ సభలో... 61.50 గంటలు సభ సాగినట్లు స్పీకర్ ఓంబిర్లా తెలిపారు. దిగువ సభలో 74 శాతం ఉత్పాదకత నమోదైనట్లు పేర్కొన్నారు. ఈ సెషన్ లో కొత్తగా 12 బిల్లులను సభలో ప్రవేశ పెట్టగా... 18 బిల్లులు పాస్ అయినట్లు వెల్లడించారు. ఇందులో తెలంగాణ గిరిజన యూనివర్శిటీ బిల్లు, టెలికమ్యూనికేషన్, ప్రెస్ అండ్ రిజిర్ట్రేషన్ ఆఫ్ పీరియాడికల్స్ బిల్లు -2023, సిఈసి నియామకాల బిల్లు, భారతీయ న్యాయ సన్ హిత -2023, భారతీయ నాగరిక్ సురక్ష సన్హిత, భారతీయ సక్ష, బిల్లు, సీజీఎస్టీ రెండో సవరణ వంటి బిల్లులు ఉన్నట్లు తెలిపారు. అలాగే జీరో అవర్ లో 182 పబ్లిక్ ఇంపార్టెన్స్ అంశాలను సభ్యులు లేవనెత్తినట్లు తెలిపారు. పలు స్టాండింగ్ కమిటీలు 35 రిపోర్ట్ లను సభకు సమర్పించినట్లు వెల్లడించారు.



రాజ్యసభలో 17 బిల్లులు ఆమోదం

మరోవైపు రాజ్యసభలో 17 బిల్లులు పాసైనట్లు చైర్మన్ జగదీప్ ధనకడ్ వెల్లడించారు. వీటిల్లో జమ్మూ కాశ్మీర్, ఎన్నికల కమిషనర్ల నియామకం, పోస్టాఫీసు బిల్లు, టెలికమ్యూనికేషన్స్ బిల్లులతో పాటూ భారతీయ సాక్ష్య బిల్లు, భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత బిల్లులు ఈ సెషన్‌లో ఆమోదించబడ్డాయన్నారు. 14 సిట్టింగ్ ల్లో 65 గంటలు సభ సాగినట్లు తెలిపారు. అయితే మరో 22 గంటల విలువైన సమయం వృథాకావడం బాధించిందన్నారు. దీంతో 79 శాతంగా ఉత్పాదకత నమోదైన్నారు. కాగా అధికార, ప్రతిపక్షాల నుంచి 2,300 ప్రశ్నలు అడిగారు.

ఏకపక్షంగా
సిఈసి, ఈసి బిల్లు ఆమోదం

ప్రజాశక్తి- ఢిల్లీ బ్యూరో

ప్రతిపక్ష సభ్యుల గెంటివేత, గందరగోళం మధ్య ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఈసి), ఎన్నికల కమిషనర్ల (ఈసి) నియామకాలు, సర్వీసు నిబంధనల బిల్లుకు లోక్‌సభ గురువారం ఆమోదం తెలిపింది. 'ది చీఫ్ ఎలక్షన్ కమిషనర్, అండ్ అదర్ ఎలక్షన్ కమిషనర్స్ (అపాయింట్మెంట్, కండీషన్స్ ఆఫ్ సర్వీస్ అండ్ టెర్మ్ ఆఫ్ ఆఫీస్) బిల్లు- 2023'ను గురువారం స్వల్పకాలిక చర్చ అనంతరం లోక్‌సభ ఆమోదించింది. ఈ బిల్లుకు రాజ్యసభ ఇప్పటికే ఆమోదం తెలిపింది. ఇప్పటివరకు సిఈసి, ఈసిలను ప్రభుత్వమే నియమించేది. ఈ కొత్త బిల్లు ప్రకారం.. ఇక నుంచీ సెర్చ్, ఎంపిక కమిటీలు ఈ బాధ్యతలను నిర్వహించనున్నాయి. సిఈసి, ఈసిల నియామకం కమిటీ నుంచి ప్రధాన న్యాయమూర్తిని తొలగించింది. ఎన్నికల కమిషనర్ల నియామకాలకు సంబంధించిన నిబంధనలు లేవని పేర్కొంటూ.. 1991 నాటి చట్టం స్థానంలో కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లును తెచ్చింది. ప్రస్తుతమున్న చట్టంలోని లోపాలను సరిదిద్ది కొత్త బిల్లును తీసుకొచ్చామని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ వెల్లడించారు. ఈ ఏడాది మార్చిలో సిఈసి, ఈసిల నియామకాలపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పునకు అనుగుణంగా ఈ బిల్లు ఉందని వివరించారు. రాజ్యాంగంలో పేర్కొన్నట్లుగా అధికారాల విభజనకు అనుగుణంగా రూపొందించామని తెలిపారు. సిఈసి, ఇతర ఎన్నికల కమిషనర్ల హోదా, వేతనాలకు సంబంధించిన సవరణలూ ఇందులో పొందుపర్చారు.

బిజెపిని గద్దె దించేందుకు దూకుడు పెంచాలి

- కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ నిర్ణయం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

బిజెపిని గద్దె దించేందుకు దూకుడు పెంచాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సిడబ్ల్యుసి) నిర్ణయించింది. సిడబ్ల్యుసి సమావేశం గురువారం ఎఐసిసి కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షత వహించారు. ఖర్గే అధ్యక్షుడిగా ఎన్నికైన తరువాత ఇది మూడో సిడబ్ల్యుసి సమావేశం. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. ప్రధానంగా 2024 సార్వత్రిక ఎన్నికలపై చర్చించారు. బిజెపిని ఎలా ఎదుర్కోవాలనే అంశంపై వ్యూహాలు, ప్రతి వ్యూహాలపై చర్చించారు. ఇటీవల వెల్లడైన ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు, 2024 సార్వత్రిక ఎన్నికల వ్యూహాలు, బిజెపిని గద్దె దించడానికి ఇండియా ఫోరంతో కలిసి పనిచేయడం, దేశ ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై చర్చించారు. లోక్‌సభ ఎన్నికల ప్రచార వ్యూహాలు, రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర రెండో విడత జనవరిలో తూర్పు నుంచి పడమర వరకు చేపట్టాలనే ప్రతిపాదనపై కూడా చర్చించినట్లు తెలస్తోంది. ఈశాన్య రాష్ట్రాల నుంచి గుజరాత్ వరకు చేసే జోడో యాత్ర ప్రభావం చూపుతుందని కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు. ఇండియా ఫోరంలో భాగంగా కీలక రాష్ట్రాల్లో సీట్ల పంపకాల అంశాలపైనా సిడబ్ల్యుసి చర్చించింది. పార్టీ 139వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా నాగ్‌పూర్‌లో మెగా ర్యాలీతో జరుపుకోవడానికి ముందు కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్లు సమాచారం. ఈ సిడబ్ల్యుసి అనేది కాంగ్రెస్ పార్టీలో అత్యున్నత నిర్ణాయక కమిటీ అనే విషయం తెలిసిందే. గురువారం జరిగిన సిడబ్ల్యుసి సమావేశంలో సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, చిదంబరం, అధిర్ రంజన్ చౌదరి, దిగ్విజయ్ సింగ్, మీరా కుమారి, అజయ్ మాకెన్, మానిక్కం ఠాగూర్, రఘువీరారెడ్డి, పల్లం రాజు, కొప్పుల రాజు, టి సుబ్బిరామిరెడ్డి, సిడబ్ల్యుసి సభ్యులు, శాశ్వత ఆహ్వానితులు, ప్రత్యేక ఆహ్వానితులు పాల్గొన్నారు.

ప్రధానిపై అభ్యంతరకర వ్యాఖ్యలు
రాహుల్‌గాంధీపై చర్యలు తీసుకోండి

- ఇసికి ఢిల్లీహైకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ : ప్రధానమంత్రి నరేంద్ర మోడీపై అభ్యంతరకర వ్యాఖ్యలు కేసులో కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీపై చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘాన్ని (ఇసి) ఢిల్లీ హైకోర్టు ఆదేశించింది. ప్రధాని మోడీ 'జేబు దొంగ' అంటూ అభ్యంతరకర వ్యాఖ్యలు కేసులో ఈ ఆదేశాలు ఇచ్చింది. రాహుల్‌పై గాంధీపై ఎనిమిది వారాల్లోగా చర్యలు తీసుకోవాలని ఇసికి స్పష్టం చేసింది. నవంబరు 22న ఒక ఎన్నికల ప్రచారసభలో రాహుల్ గాంధీ ప్రధాని మోడిపై ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన బిజెపి ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. నవంబర్ 23నే రాహుల్‌కు ఇసి నోటీసులు జారీ చేసింది. అయినా రాహుల్ స్పందించలేదు. దీంతో రాహుల్‌పై చర్యలు తీసుకోవాలంటూ ఢిల్లీ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. ప్రభుత్వంలో ఉన్నత పదవుల్లో ఉన్న వ్యక్తిపై ఇలాంటి వ్యాఖ్యలు దారుణమని పిటిషనర్ పేర్కొన్నారు. అలాగే భవిష్యత్తులో రాజకీయ నేతలెవ్వరూ ఇలా మాట్లాడకుండా మార్గదర్శకాలు జారీ చేసేలా ఆదేశాలివ్వాలని కూడా కోరారు. దీనిపై

ఢిల్లీ హైకోర్టు గురువారం విచారణ చేపట్టింది. 'ప్రధానిపై అలాంటి వ్యాఖ్యలు సముచితం కావు. ఆ వ్యాఖ్యలను పరిశీలించి ఇసి ఆయనకు (రాహుల్) నోటీసులు జారీ చేసింది. వాటిపై స్పందనకు గడువు కూడా తీరింది. అయినా ఆయన నుంచి సమాధానం రాలేదు. అందువల్ల ఈ అంశంపై ఎనిమిది వారాల్లోగా ఇసి తగిన చర్యలు తీసుకోవాలి" అని కోర్టు ఆదేశించింది.

బ్రిజ్ భూషణ్ చేతిలోనే డబ్ల్యుఎఫ్ఐ

(మొదటి పేజీ తరువాయి)

చూస్తామన్న మాటకు ప్రభుత్వం కట్టుబడి ఉండకపోవడం దురదృష్టకరం" అని వ్యాఖ్యానించారు. "జనవరిలో మా నిరసనను అనుసరించి, మంత్రిత్వ శాఖ ఒక పర్యవేక్షణ కమిటీని ఏర్పాటు చేసింది. పలువురు మహిళా రెజ్లర్లు ప్యానెల్ ముందు నిలదీశారు, బ్రిజ్ భూషణ్‌తో సంబంధం ఉన్న ఏ వ్యక్తి కూడా రెజ్లింగ్ ఫెడరేషన్‌లోకి ప్రవేశించరని క్రీడా మంత్రి మీడియా ముందు మాకు హామీ ఇచ్చారు. మేము మా సోదరీమణులు, కుమార్తెల గౌరవం కోసం పోరాడుతున్నాము, మా పోరాటాన్ని రాబోయే ఒకటి లేదా రెండు తరాలు కొనసాగించాలని ఆశిస్తున్నాను.. న్యాయం కోసం మా శాయశక్తులా పోరాడాం, కానీ ప్రభుత్వం విశ్వాస ఘాతుకానికి పాల్పడింది. అయితే, మాకు న్యాయవ్యవస్థపై నమ్మకం ఉంది " అని పునియా అన్నారు. రెజ్లింగ్ ఫెడరేషన్‌కు ఇటీవల ఎన్నికలు జరగ్గా.. గురువారం జరిగిన ఓట్ల లెక్కింపులో సంజయ్ సింగ్ 40 ఓట్లు రాగా.. ప్రత్యర్థి అనితా షెరాన్‌కు కేవలం 7 ఓట్లు మాత్రమే దక్కాయి.

సంజయ్‌సింగ్ గతంలో ఉత్తరప్రదేశ్ రెజ్లింగ్ సంస్థకు ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. డబ్ల్యుఎఫ్ఐ చివరి ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడిగా, 2019 నుండి జాయింట్ సెక్రటరీగా పనిచేస్తున్నారు. డబ్ల్యుఎఫ్ఐ ఉపాధ్యక్ష పదవి రేసులో ఉన్న ప్రస్తుత మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ కూడా ఈ ఎన్నికల్లో ఓడిపోయారు. అధ్యక్ష పదవితో పాటు సీనియర్ వైస్ ప్రెసిడెంట్, నలుగురు ఉపాధ్యక్షులు, సెక్రటరీ జనరల్, కోశాధికారి, ఇద్దరు జాయింట్ సెక్రటరీలు, ఐదుగురు కార్యనిర్వాహక సభ్యుల భర్తీకి ఎన్నికలు జరిగాయి. డబ్ల్యుఎఫ్ఐ ఎన్నికల ప్రక్రియ జులైలో ప్రారంభం కాగా.. కోర్టు కేసుల కారణంగా ఎన్నికలు ఆలస్యమయ్యాయి. దీంతో అంతర్జాతీయ రెజ్లింగ్ సంస్థ డబ్ల్యుఎఫ్ఐని సస్పెండ్ చేసింది. ఎన్నికలపై పంజాబ్ మరియు హర్యానా హైకోర్టు విధించిన స్టేను ఇటీవల సుప్రీంకోర్టు రద్దు చేయడంతో ఎన్నికలకు లైన్ క్లియరైంది.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకపోతే 26 తర్వాత ప్రత్యక్ష మద్దతు

(మొదటి పేజీ తరువాయి)

వారు కోరారు. వేతనాలు పెంచాలని కోరితే అప్పుల్లో ఉన్నామని చెబుతున్నారని, అంగన్‌వాడీల కోసం కొంత అప్పుచేస్తే ఎవరైనా వద్దన్నారా? అని ప్రశ్నించారు. ఏజెన్సీలోని చింతపల్లిలో ముఖ్యమంత్రి బైజూస్‌కు సొమ్ము కట్టబెట్టడానికి విద్యార్థులకు ట్యాబులు పంపిణీ చేస్తున్నారని, అదే ఏజెన్సీలో గిరిజనుల భూములు గుంజుకుంటున్నారని మండిపడ్డారు. వేలకోట్లు కార్పొరేట్లకు కట్టబెట్టడాన్ని మానుకుంటే అంగన్‌వాడీల వేతనాలు పెంచొచ్చని సూచించారు. పైగా వేతనాలు పెంచమని కోరుతున్న వారిని వదిలేసి వారిపై రెచ్చగొట్టేందుకు వలంటీర్లకు గౌరవ వేతనం పెంచుతున్నట్లు ప్రకటించి, అంగన్‌వాడీలను కవ్విస్తున్నదని ఇదేమీ న్యాయమో, పాలనో అర్థం కావడం లేదని అన్నారు. 30 లక్షల కుటుంబాల్లో పిల్లలకు తల్లులుగా మారిన అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరారు.

ప్రజాస్వామ్యానికి ప్రమాదం

పార్లమెంటులో 143 మంది ఎంపిలను సస్పెండ్ చేయడం ప్రజాస్వామ్యానికి ప్రమాదమని వారు తెలిపారు. బిజెపి సిఫార్సు లేఖతో అగంతకులు పార్లమెంటులో దూకారని, దానిపై సమాధానం చెప్పాలని అడిగితే ఎంపిలను సస్పెండ్ చేయడం అప్రజాస్వామికమని అన్నారు. సస్పెన్షన్లను వామపక్ష పార్టీలుగా తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. 22వ తేదీన ఇండియా వేదిక పిలుపునకు వామపక్ష పార్టీలు మద్దతు ప్రకటించాయి.

గవర్నరును తక్షణమే వెనక్కి పిలవండి



(మొదటి పేజీ తరువాయి)

ఆందోళన చేపట్టింది. మిస్టర్ ఖాన్ సంఘ్ పరివార్ చేతిలో పావులా వ్యవహరిస్తున్నారని, గవర్నరుకు, హిందుత్వ మెజారిటీ జాతీయవాద సిద్ధాంతకర్త సావర్కర్‌కు మధ్య సైద్ధాంతిక సారూప్యతను తెలియజేస్తూ కార్యకర్తలు క్యాంపస్ అంతటా బ్యానర్లు, పోస్టర్లు ప్రదర్శించారు.

మిస్టర్ ఖాన్ ప్రోటోకాల్‌ను పదేపదే ఉల్లంఘిస్తున్నారు అసెంబ్లీ ఆమోదించి పంపిన బిల్లులను ఏళ్ల తరబడి తొక్కిపట్టడంపై సుప్రీం కోర్టు చీవాట్లు పెట్టిన తరువాత కూడా ఆయన తీరు మారలేదు. అసెంబ్లీ ఆమోదించిన ఏడు బిల్లులను రాష్ట్రపతి పరిశీలనకు పంపడం ద్వారా ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టారు.

ప్రజలకు చేరువగా ఉండేందుకు కేబినెట్ నిర్ణయం మేరకు ప్రభుత్వం చేపట్టిన నవకేరళ సదస్సు హేతుబద్ధతను ప్రశ్నించే దాకా వెళ్లారు.

రాష్ట్రాన్ని కించపరిచేలా అనుచిత భాష ఉపయోగించడంపై నిరసన తెలిపిన విద్యార్థులను నేరస్థులుగా చిత్రీకరించడం, కేరళలో శాంతియుత వాతావరణాన్ని దెబ్బతీయడానికి ఉద్దేశపూర్వకంగా రెచ్చగొట్టే చర్యలకు పదే పదే పాల్పడుతుండడం వంటి గవర్నరు చర్యలను ముఖ్యమంత్రి ఆ లేఖలో సోదారహరణంగా వివరించారు. అంతకుముందు విజయన్ మాట్లాడుతూ, గవర్నరు ఖాన్ "బహిరంగ పోకడలు, విధ్వంసకర ప్రకటనలు, రెచ్చగొట్టే చర్యలు రోజురోజుకీ మితిమీరుతుండడంతో ఆయనను రీకాల్ చేయాలని కోరడం మినహా మరో మార్గం లేని పరిస్థితి ఏర్పడిందని చెప్పారు.

జమ్ముకాశ్మీర్‌లో ఆర్మీ వాహనం పై దాడి

- నలుగురు సైనికులు మృతి
- మరో ముగ్గురికి గాయాలు

శ్రీనగర్: జమ్ముకాశ్మీర్‌లో ఉగ్రవాదులు మరోసారి దాడికి తెగబడ్డారు. భద్రతాబలగాలే లక్ష్యంగా జరిపిన ఈ దాడిలో నలుగురు సైనికులు మరణించారు. మరో ముగ్గురు సైనికులు తీవ్రంగా గాయపడ్డారు. రాజౌరీ జిల్లాలోని పిర్ పంజల్ వ్యాలీ వద్ద సైనికులతో ప్రయాణిస్తున్న రెండు ఆర్మీ వాహనాలపై సాయంత్రం 3:45 గంటల ప్రాంతంలో ఉగ్రవాదులు ఒక్కసారిగా కాల్పులు ప్రారంభించారు. దీంతో ముగ్గురు జవాన్లు మృతి చెందగా, మరో ముగ్గురు గాయపడినట్లు అధికారులు వెల్లడించారు. రాజౌరీ జిల్లాలోని డేరా కి గాలి, ధనమంది వద్ద బుధవారం రాత్రి నుంచి ఉగ్రవాదుల కోసం తనిఖీలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో రెండు వాహనాల్లో జవాన్లు ఆ ప్రదేశానికి వెళుతుండగా ఈ దారుణం జరిగింది. సైనికుల సైతం ఉగ్రవాదులపై ఎదురుకాల్పులకు పాల్పడ్డారు. సమాచారం అందుకున్న వెంటనే ఘటనాస్థలానికి అదనపు బలగాలతోపాటు అంబులెన్స్‌లను తరలించినట్లు అధికారులు తెలిపారు. ఉగ్రవాదులు కోసం ఈ ప్రాంతంలో సోదాలు జరుపుతున్నట్లు అధికారులు తెలిపారు.

పని చేయడానికి అత్యంత ఇష్టపడే రాష్ట్రంగా కేరళ

తిరువనంతపురం : ఎల్‌డిఎఫ్ పాలనలో కేరళ మరో ఘనత సాధించింది. పని చేయడానికి యువతీ యువకులు అత్యంత ఇష్టపడే రాష్ట్రంగా కేరళ నిలిచింది. ఇండియా స్కిల్స్ రిపోర్టు 2024 ఈ విషయాన్ని వెల్లడించింది. దేశవ్యాప్తంగా సుమారు 4 లక్షల మంది యువతీ యువకుల్ని సర్వే చేసి ఈ నివేదిక తయారు చేశారు. విభిన్న నైపుణ్యాలు ఉన్న యువతీ యువకులు తాము పని చేయడానికి అత్యంత ఇష్టపడే రాష్ట్రంగా కేరళను ఎన్నుకున్నారు. తిరువనంతపురం, కొచ్చి నగరాలు యువతను ఆకర్షించడంలో ముందు ఉన్నాయి. విద్య పట్ల సమతుల్య విధానాన్ని అందించడంలోనూ, భవిష్యత్తు నైపుణ్యాలను మెరుగుపర్చడంలోనూ కేరళ చేస్తున్న కృషి యువతీ యువకులు ప్రశంసించారు. అలాగే కంప్యూటర్ నైపుణ్యాలను పెంపొందించడంలో కేరళ గొప్పతనాన్ని ఈ నివేదిక ప్రత్యేకంగా ప్రస్తావించింది. కేరళ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమ్యూనిటీ స్కిల్ పార్కులు, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లను దేశంలోనే అధునాతన సాంకేతికత శిక్షణకు ఆదర్శప్రాయమైన నమూనాలుగా నివేదిక గుర్తించింది.

ఎంపి ధీరజ్ సాహు కేసులో రూ. 329 కోట్లు స్వాధీనం

న్యూఢిల్లీ : ఒడిషాలోని కాంగ్రెస్ ఎంపి ధీరజ్ సాహు ఆస్తులపై ఆదాయపన్ను శాఖ సోదాలు చేయడం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ సోదాల్లో స్వాధీనం చేసుకున్న ఆస్తులపై ఆదాయపన్ను శాఖ స్పందించింది. శిథిలావస్థలో ఉన్న రహస్య భవనాల నుంచి రూ.329 కోట్లను స్వాధీనం చేసుకున్నట్లు గురువారం అధికారులు తెలిపారు. విలువైన పత్రాలు, డిజిటల్ సమాచారాన్ని కూడా చేసుకున్నట్లు చెప్పారు. అలాగే నేరాన్ని రుజువు చేయడానికి కావాల్సిన అన్ని అధారాలు లభ్యమైనట్లు వెల్లడించారు. ఒడిషా, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్‌లో ఉన్న ఎంపి ధీరజ్ సాహుకు చెందిన ఆస్తులపై వరుస దాడులు చేసిన విషయం తెలిసిందే. ఈ నెల 6న ప్రారంభమైన ఈ సెర్చ్ ఆపరేషన్ వారానికి పైగా కొనసాగింది. ఈ మూడు రాష్ట్రాల్లో 10 జిల్లాల్లో 30కి పైగా ప్రదేశాల్లో దర్యాప్తు చేపట్టింది. ఈ దాడుల్లో 100 మందికి పైగా ఐటి అధికారులు పాల్గొన్నారు. స్వాధీనం చేసుకున్న నగదును లెక్కించడానికి 40కి పైగా యంత్రాలను వినియోగించారు.

విదేశీ నిధుల కేసులో ఆమ్నెస్టీ ఇండియాపై సిబిఐ అనుబంధ ఛార్జిషీట్

న్యూఢిల్లీ : విదేశీ నిధుల నిబంధనలను ఉల్లంఘించారనే ఆరోపణలపై మానవ హక్కుల సంస్థ ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఇండియా, దాని మాజీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆకర్ పటేల్, మరో ఆరుగురు వ్యక్తులు, సంస్థలపై సిబిఐ అనుబంధ చార్జిషీట్ దాఖలు చేసింది. ఈ జాబితాలో పటేల్‌తో పాటు ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఇండియా ప్రయివేట్ లిమిటెడ్, ఇండియన్స్ ఫర్ ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ట్రస్ట్, ఏఐపీఎల్ మాజీ డైరెక్టర్లు శోభా మథాయ్, నందిని ఆనంద్ బసప్ప, మినార్ వాసుదేయో పింపుల్, ఏఐపీఎల్ ఆపరేషన్స్ హెడ్ మోహన్ ప్రేమానంద ముండ్కూర్, దాని అధీకృత సంతకందారు రాజ్ కిషలు ఉన్నారు. నిందితులపై ఐపీసీలోని సెక్షన్ 120బి, విదేశీ కాంట్రిబ్యూషన్ (రెగ్యులేషన్) చట్టం, 2010లోని నిబంధనల ప్రకారం సీబీఐ అభియోగాలు మోపింది. ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్.. యునైటెడ్ కింగ్‌డమ్ నుంచి విదేశీ విరాళాలను స్వీకరించడానికి ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఇండియా ఫౌండేషన్ ట్రస్ట్‌కు 2011-12లో అనుమతి లభించిందని సీబీఐ తెలిపింది. అయితే, భద్రతా ఏజెన్సీల నుంచి ప్రతికూల ఇన్‌పుట్‌ల కారణంగా అనుమతి రద్దయ్యింది. భారత్‌లోని లాభాపేక్ష లేని సంస్థలు విదేశీ నిధులను స్వీకరించాలంటే అవి తప్పనిసరిగా విదేశీ కాంట్రిబ్యూషన్ (నియంత్రణ) చట్టం కింద నమోదు చేయబడాలి. ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఇండియా.. భారత, అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా నిలుస్తుందని తెలిపింది.

తమిళనాడు మంత్రికి మూడేళ్ల జైలు

చెన్నై: అక్రమాస్తుల కేసులో తమిళనాడు విద్యాశాఖ మంత్రి కె.పొన్ముడి, ఆయన భార్యకు మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ మద్రాసు హైకోర్టు తీర్పు వెలువరించింది. ఈ కేసులో పొన్ముడి, ఆయన భార్య విశాలాక్షిని నిర్దోషులుగా పేర్కొంటూ వేలూరులోని దిగువ కోర్టు ఇచ్చిన తీర్పును మద్రాసు హైకోర్టు రెండు రోజుల క్రితం కొట్టివేసి.. తీర్పును రిజర్వు చేసింది. గురువారం మంత్రి, ఆయన భార్యను దోషులుగా తేల్చి మూడేళ్ల జైలు శిక్షతోపాటు, రూ.50 లక్షలు జరిమానా విధిస్తూ జస్టిస్ జి.జయచంద్రన్ తీర్పు వెలువరించారు. నిందితులు లొంగిపోయేందుకు, ఈ తీర్పును సుప్రీం కోర్టులో సవాలు చేసేందుకు 30 రోజుల గడువు ఇస్తున్నట్లు తెలిపారు. మరోవైపు రెండేళ్లకు మించి జైలు శిక్ష పడటంతో పొన్ముడి తన శాసనసభ సభ్యత్వాన్ని కోల్పోనున్నారు.

ఆధార్‌తో ఆస్తుల అనుసంధానం

- మూడు నెలల్లో నిర్ణయం తీసుకోండి
- కేంద్రానికి ఢిల్లీ హైకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ : దేశంలో ఉన్న ప్రతీ ఒక్కరి స్థిర, చరాస్తులను ఆధార్‌తో అనుసంధానం చేసే విషయంపై మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఢిల్లీ హైకోర్టు ఆదేశించింది. దేశంలో ప్రతీ ఒక్కరి ఆస్తులను ఆధార్‌తో అనుసంధానం చేయాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం(పిల్)పై ఢిల్లీ హైకోర్టు గురువారం విచారణ నిర్వహించింది. ఈ విచారణలోనే కేంద్రానికి ఈ కీలక ఆదేశాలను జారీ చేసింది. అలాగే, పిటిషనర్ లేవనెత్తిన అంశాలను విజ్ఞాపనగా తీసుకోవాలని కేంద్రానికి కోర్టు సూచించింది. అయితే, అవినీతి, నల్లధనం ఉత్పత్తి, బినామీ లావాదేవీలను అరికట్టేందుకు పౌరుల చర, స్థిరాస్తి పత్రాలను వారి ఆధార్ నంబర్‌తో అనుసంధానం చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం, ఢిల్లీ ప్రభుత్వాన్ని ఆదేశించాలని పిటిషనర్ కోరారు. దీంతో, జస్టిస్ రాజీవ్ శక్దేర్, జస్టిస్ గిరీష్ కత్పాలియాలతో కూడిన డివిజన్ బెంచ్ కేంద్రాన్ని పైవిధంగా ఆదేశించింది.

ప్రమాదకర స్థాయికి భారత అప్పులు..!

- జిడిపిలో 100 శాతానికి మించొచ్చు..
- ఐఎంఎఫ్ హెచ్చరిక

న్యూఢిల్లీ : మోడీ ప్రభుత్వం చేస్తున్న ఇబ్బడిమబ్బడి అప్పులపై అంతర్జాతీయ ఏజెన్సీలు హెచ్చరికలు జారీ చేస్తున్నాయి. భారత అప్పులు ప్రమాదకర స్థాయికి చేరుతున్నాయని అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్) ఆందోళన వ్యక్తం చేసింది. మధ్యస్థ కాలానికి జిడిపిలో ప్రభుత్వ అప్పులు 100 శాతానికి మించొచ్చని మంగళవారం హెచ్చరించింది. దీర్ఘకాల అప్పుల అధిక రిస్కులను ఎదుర్కోవడానికి భారత్‌కు గణనీయమైన పెట్టుబడులు అవసరమని ఐక్యరాజ్య సమితికి చెందిన ఐఎంఎఫ్ పేర్కొన్నట్లు ఓ ఆంగ్ల పత్రిక కథనం ప్రచురించింది. ఏడాది కాలం స్థూల దేశీయోత్పత్తి (జిడిపి)కి సమానమైన అప్పులను 100 శాతంగా భావిస్తారు.

"ప్రాధాన్యంగా రాయితీతో కూడిన ఫైనాన్సింగ్ వనరులు, అదే విధంగా ప్రయివేటు రంగ పెట్టుబడులు, సమానమైన యంత్రాంగం అవసరం. అసాధారణమైన ఆర్థిక సహాయం లేకుండా లేదా డిఫాల్ట్‌కు వెళ్లకుండా ప్రభుత్వం



దాని ప్రస్తుత, భవిష్యత్తు చెల్లింపు బాధ్యతలన్నింటినీ తీర్చగలిగితే దేశం రుణం స్థిరమైనదిగా పరిగణించబడుతుంది." అని ఐఎంఎఫ్ పేర్కొంది.

"అధిక మూలధన వ్యయం, ఉపాధి ఆధారంగా ఇటీవల భారత వృద్ధి రేటు అంచనాలను మధ్యస్థ కాలానికి 6 శాతం నుంచి 6.3 శాతానికి పెంచినట్లు పేర్కొంది. భారత ఆర్థిక వృద్ధి సమతూల్యంగా ఉన్నప్పటికీ.. వచ్చే నష్టాలు కూడా అదే స్థాయిలో ఉన్నాయి. సమీప కాలంలో ప్రపంచ వృద్ధి మందగమించడం ద్వారా భారత వాణిజ్యం ప్రభావితం కానుంది. సరఫరాలో లోపాలు తలెత్తడంతో కమోడిటీ ధరలు పెరుగొచ్చు.. దీంతో విత్త లోటులో ఒత్తిడి నెలకొనవచ్చు." అని ఐఎంఎఫ్ తెలిపింది.

"దేశీయంగా వాతావరణ ప్రతికూలాంశాలు ద్రవ్యోల్బణ ఒత్తిళ్లను మళ్లీ పెంచొచ్చు. అహార ఉత్పత్తుల ఎగుమతులపై ఆంక్షలు పెరగొచ్చు. అంచనాల కంటే వినియోగదారుల డిమాండ్ పెరగడంతో ప్రయివేటు పెట్టుబడుల్లోనూ వృద్ధి చోటు చేసుకోవచ్చు. భారత్ 7-8 శాతం మధ్య వృద్ధి రేటును నమోదు చేయవచ్చు." అని పేర్కొంది. 2005-06లో భారత జిడిపిలో అప్పులు 81 శాతంగా ఉండగా.. 2021-22 నాటికి 84 శాతానికి ఎగిశాయని.. ఆ తర్వాత 2022-23లో 81 వాతానికి తగ్గాయని ఫండ్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కెవి సుబ్రమణ్యయన్ పేర్కొన్నారు. బిజెపి ప్రభుత్వం ఇటీవల అడ్డగోలుగా అప్పులు చేస్తోన్న విషయం తెలిసిందే. 2023 సెప్టెంబర్ ముగింపు నాటికి భారతదేశ మొత్తం అప్పులు రూ.205 లక్షల కోట్లకు చేరాయి. ఇంతక్రితం మార్చి త్రైమాసికం నాటికి రూ.200 లక్షల కోట్ల అప్పులున్నాయి. ఇదే సమయం నాటికి రూ.1.34 లక్షల కోట్లుగా ఉన్న కేంద్ర ప్రభుత్వ అప్పులు.. సెప్టెంబర్ ముగింపు నాటికి రూ.161.1 లక్షల కోట్లకు చేరాయి.

ప్రేగ్ యూనివర్శిటీలో కాల్పులు
15 మంది మృతి

ప్రేగ్ : చెక్ రిపబ్లిక్ రాజధాని ప్రేగ్‌లోని ఒక యూనివర్శిటీలో ఒక సాయుధుడు జరిపిన కాల్పుల్లో 15 మంది మరణించగా, పదుల సంఖ్యలో గాయపడ్డారు. సాయుధుడ్ని కూడా పోలీసులు కాల్చి చంపారు. గురువారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఈ దుర్ఘటన జరిగింది. ఛార్లెస్ యూనివర్శిటీలోకి ప్రవేశించిన దుండగుడు కాల్పులు ప్రారంభించారు. సిబ్బందిని గదిలో బంధించాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని యూనివర్శిటీని తమ స్వాధీనంలోకి తీసుకున్నారు. తరువాత షూటర్‌ను కాల్చిచంపారు.

భద్రతా వైఫల్యం కేసు
నిందితులు కస్టడీ పొడిగింపు

న్యూఢిల్లీ : పార్లమెంట్ భద్రతా వైఫల్యం కేసులో నిందితులను కస్టడీని పొడిగించారు. ఈ నిందితులను పోలీసులు గురువారం న్యాయస్థానంలో హాజరుపరిచారు. గతంలో ఈ నలుగురు నిందితులకు పటియాలా హౌస్ కోర్టు విధించిన ఏడు రోజుల కస్టడీ గురువారంతో ముగిసింది. దీంతో మరోసారి పోలీసులు నిందితులను ప్రత్యేక న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచారు. మనోరంజన్ డి, సాగర్ శర్మ, అమోల్ ధన్‌రాజ్ శిందే, నీలమ్‌దేవిలను 15 రోజుల పాటు తమ కస్టడీకి ఇవ్వాలని పోలీసులు కోరారు. దీంతో జడ్జి ఈ నలుగురినీ జనవరి 5వరకు (15 రోజుల పాటు) పోలీస్ కస్టడీకి అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేశారు. వీరిపై ఉపా కింద కేసులు నమోదైంది. కాగా ఈ కేసులో బెంగళూరుకు చెందిన ఓ టెకీని పోలీసులు గురువారం అరెస్టు చేసినట్లు సమాచారం. కర్ణాటక పోలీసు శాఖలో రిటైర్డ్ డిఎస్‌పి కుమారుడు సాయికృష్ణను అరెస్టు చేశారు. ఇతను మనోరంజన్‌కు స్నేహితుడు.



ఇజ్రాయిల్, హమాస్ మధ్య సంధికి యత్నాలు

- గాజా నుంచి మరింత మందిని ఖాళీ చేయించే పనిలో నెతన్యాహు

గాజా సిటీ: రెండు మాసాలుగా సాగుతున్న ఇజ్రాయిల్ దురాక్రమణ పూరిత దాడులను ఆపాలని, హమాస్, ఇజ్రాయిల్ మధ్య సంధికి దౌత్య మార్గాల ద్వారా యత్నించాలని అంతర్జాతీయ సమాజం నుంచి ఒక వైపు ఒత్తిడి పెరుగుతుంటే, మరో వైపు గాజాలో మరిన్ని కుటుంబాలను తమ ఇళ్లను ఖాళీ చేసి వెళ్లి పోవాలని ఫాసిస్టు నెతన్యాహు ప్రభుత్వం గురువారం హుకుం జారీ చేసింది. బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ గాజాలో దాడులను ఆపి "స్థిరమైన సంధి"ని కుదుర్చుకోవాలని పిలుపునిచ్చాయి. ఇజ్రాయిల్ దాడుల్లో ఇప్పటివరకు 20 వేల మందికిపైగా పాలస్తీనీయులు చనిపోయారు. వీరిలో 8,000 మంది చిన్నారులు, 6,200 మంది మహిళలు ఉన్నారు. మరో 1,40,000 మందికి పైగా నిరాశ్రయులయ్యారు. వీరు ఆశ్రయం పొందుతున్న ఖాన్ యూనిస్‌లోని భూ భాగం నుంచి కూడా తరిమేయాలని ఇజ్రాయెల్ చూస్తోంది. ఇదిలా ఉండగా దీర్ఘకాలిక కాల్పుల విరమణ కోసం చర్చలు ఊపందుకున్నాయి. పాలస్తీనా మిలిటెంట్ గ్రూప్ అధినేత ఈజిప్ట్‌ను సందర్శించి యూరప్ దౌత్యవేత్తలతో చర్చలు జరుపుతుండడంతో ఇజ్రాయెల్ -హమాస్ మధ్య మరో సారి కాల్పుల విరమణ, పరస్పర బందీల విడుదలకు అవకాశాలు మెరుగయ్యాయని అంతర్జాతీయ పరిశీలకులు భావిస్తున్నారు. ఖతార్‌కు చెందిన హమాస్ చీఫ్ ఇస్మాయిల్ హనియే బుధవారం ఈజిప్టుకు వచ్చి ఆ దేశ ఇంటెలిజెన్స్ చీఫ్ అబ్బాస్ కమెల్‌తోను, ఇరాన్ విదేశాంగ మంత్రి హొస్సేన్ అమీర్-అబ్దుల్లాహియాన్ తదితరులతో చర్చలు జరిపారు.

ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు మాట్లాడుతూ, హమాస్‌ను గాజా నుంచి తరిమేసే దాకా కాల్పుల విరమణకు అంగీకరించేది లేదని పాత పాటే పాడారు.


ఈజిప్ట్ , అమెరికా మద్దతుతో ఖతార్, గత నెలలో 240 మంది పాలస్తీనా ఖైదీలకు బదులుగా 80 మంది ఇజ్రాయెలీ బందీలను విడిపించిన మొదటి వారంలో కాల్పుల విరమణ ఒప్పందానికి మధ్యవర్తిత్వం వహించింది.







తప్పు తెలుసుకుంటే ...



రంగాపురం గ్రామంలో దర్జీగా జీవనం పోసుకుంటున్న రంగస్వామి, జానకమ్మ దంపతులకు ఒక్కగానొక్క కొడుకు బబ్లూ. లేక లేక పుట్టినవాడవడం వల్ల వాడిని ఎంతో అల్లారు ముద్దుగా పెంచుకోసాగారు. గారాబంతో వాడు పెంకిఘటంగా తయారయ్యాడు. స్కూలుకు వెళ్లకుండా మారాం చేసేవాడు. బలవంతాన పంపితే అల్లరి చేసేవాడు. టీచరు చెప్పిన పాఠం వినేవాడు కాదు.

బబ్లూలో ఎలాగైనా మార్పు తేవాలని టీచరు చాలా ఆలోచించారు. ఒకసారి బబ్లూతో ఆడుకుంటూ పాఠం వినకుండా ఉన్న ఇద్దరు పిల్లలను బబ్లూతో పాటు క్లాసు బయట నుంచోపెట్టారు. అప్పుడే ఆ పిల్లల్లో ఒకడి తండ్రి అటువైపుగా వెళుతూ లోపలికి వచ్చాడు.

'బయట ఎందుకు ఉన్నావ'ని కొడుకుని అడిగాడు. జరిగిందంతా తెలుసుకుని తన కొడుకుని బబ్లూ పక్కన కాకుండా దూరంగా కూర్చోబెట్టుమని టీచరుతో చెప్పి వెళ్ళిపోయాడు. ఈ సంఘటన క్లాసులో మిగతా పిల్లలందరిపై బాగా ప్రభావం చూపించింది. బబ్లూతో మాట్లాడడం మానేశారు. తనతో ఆడుకునే వాళ్ళు ఎవరూ లేక బబ్లూ చాలా బాధపడ్డాడు.

ఒకరోజు శారీరక శుభ్రత గురించి పాఠం చెబుతూ, 'బబ్లూ నువ్వు ఇంటికి వెళ్లి పళ్ళు తోముకునిరా' అన్నారు టీచరు. 'మధ్యాహ్నం వేళ ఎవరైనా పళ్ళు తోముకుంటారేంటి' అని అడిగాడు బబ్లూ. 'మరి పళ్ళు ఎప్పుడు తోముకుంటావ'ని అడిగారు టీచరు. 'ఉదయం నిద్ర లేచిన వెంటనే తోముకుంటాన'ని బబ్లూ చెప్పాడు. 'మరి టీచర్ పాఠం చెబుతున్నప్పుడు ఏం చేయాల'ని క్లాసులో పిల్లలందరినీ ఉద్దేశించి అడిగారు టీచరు. 'శ్రద్ధగా వినాల'ని పిల్లలందరూ ఒకేసారి అరిచారు.

'అంటే ఉదయం లేచాక చేయాల్సిన పనులు అప్పుడే చేయాలి. చదువుకోవాల్సిన సమయంలో చదువుకోవాలి. ఆడుకోవాల్సిన సమయంలో ఆడుకోవాలి. అంతేగాని, ఒక పని చేయాల్సిన సమయంలో మరొక పని చేస్తే మనకు ఏ పనీ రాదు' అని వివరించారు టీచరు.

బబ్లూకి తాను చేసిన తప్పేమిటో అర్థమైంది. ఇంతకాలం తను చదువుకోకుండా అమ్మని నాన్నని ఎంత బాధ పెట్టాడో అర్థమైంది. వెంటనే టీచరుతో 'ఇక నుండి క్లాసులో బుద్ధిగా చదువుకుంటాను టీచర్' అని కన్నీళ్లు పెట్టుకున్నాడు. టీచర్ పిల్లలందరి చేత చప్పట్లు కొట్టించారు. అప్పటినుంచి బాగా చదువుకోవడం మొదలుపెట్టిన బబ్లూ, తరగతి గదిలో బుద్ధిమంతుడే కాదు, బాగా చదివే కుర్రాడు అనిపించుకున్నాడు.

- కొత్తపల్లి ఉదయబాబు,
95337 56075.

నేను గీసిన బొమ్మ





షేక్ రిహాన,
రెండోతరగతి,
ఎంపిపి స్కూల్,
పాటిమీదపాలెం,
చీమకుర్తి మండలం,
ప్రకాశం జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

లెక్కలను మచ్చిక చేసే మాస్టారు

ఇష్టపడి చేస్తే లెక్కలంత సులభమైన పాఠ్యాంశం మరొకటి లేదని అంటున్నారు డాక్టర్ రంభ రజనీకాంత్. విద్యార్థుల్లో గణితంపై భయాన్ని ఆయన గుర్తించి దానిని పారదోలటానికి తన వంతు కృషి చేస్తున్నారు. ప్రస్తుతం ఆయన పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు మున్సిపాలిటీ పరిధిలోని బంగారమ్మ పేట ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడుగా ఉన్నారు. డాక్టర్ రజనీకాంత్ గత 23 సంవత్సరాలుగా గణితంలో సులువైన పద్ధతులు వివరిస్తూ, ఎందరో విద్యార్థుల ఉన్నతికి పునాది వేశారు. గణిత క్లబ్, గ్రంథాలయం వంటివి నిర్వహిస్తూ విజ్ఞాన వ్యాప్తికి పాటు పడుతున్నారు.




ఆంధ్రా- ఒరిస్సా సరిహద్దు ప్రాంతానికి దగ్గరలోని పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు పట్టణానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉంది బంగారమ్మ పేట ప్రాథమికోన్నత పాఠశాల. 88 మంది విద్యార్థినీ విద్యార్థులు ఇక్కడ విద్యాభ్యాసాన్ని కొనసాగిస్తున్నారు. ఇక్కడికి వచ్చే విద్యార్థులంతా పేదల పిల్లలే.. చదువులోనూ, అందులోనూ గణితం సబ్జెక్టులో పిల్లలు బాగా వెనుకబడి ఉండటాన్ని రజనీకాంత్ మాస్టారు గుర్తించి తర్ఫీదిచ్చి వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందింపజేస్తున్నారు.

సులభమైన పద్ధతుల్లో ...

ప్రతి రోజూ గణితానికి సంబంధించిన అంశాలు నేర్పించటం, సూత్రాలను బట్టీ తరహాలో కాకుండా అంకెలు, సంజ్ఞల రూపంలో చెప్పించటం, సబ్జెక్టులో వెనుకబడిన విద్యార్థులకు సైతం అర్థమయ్యే రీతిలో స్వేచ్ఛగా భావవ్యక్తీకరణకు అవకాశం ఇస్తున్నారు. కృత్యాల్లో పాల్గొనటం, మాట్లాడటం, చర్చించటం ద్వారా సులభంగా లెక్కలు చేయొచ్చునని ఆచరణ ద్వారా నిరూపిస్తున్నారు. కృత్యాలను వ్యక్తిగతంగానూ, జట్టు కృత్యంగా చేయిస్తూ మెరుగైన ఫలితాలు చేసిన వారికి బహుమతులు ఇవ్వటం ద్వారా ప్రోత్సహిస్తున్నారు. లెక్కలకు సంబంధించి కూడికలు, గుణింతాలు, తీసివేతలు, భాగహారాలు, ఆరోహణ, అవరోహణ అంశాలు ... ఇలా ప్రతి ఒక్క దాని గురించి చెప్పించటం వల్ల సులభంగా గుర్తుండేలా చేస్తున్నారు. గణితంలో సూత్రాలు, పీరియాడిక్ టేబుళ్ల వంటి అంశాలపై కృత్య పద్ధతులపై అవగాహన కల్పించటం ఆయన ప్రత్యేకత. తోటి ఉపాధ్యాయులను కూడా ఇదే తరహాలో బోధనకు కృషిచేస్తున్నారు. 2018లో ఆయన రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. 2023లోనూ అవార్డుకు ఎంపిక కాగా, జాతీయ అవార్డుకు నామినేషన్ పంపటంతో సున్నితంగా తిరస్కరించారు.

సాలూరుకు చెందిన రజనీకాంత్ విద్యాభ్యాసమంతా స్థానికంగానే జరిగింది. ఎమ్మెస్సీ నాగార్జున యూనివర్శిటీలోనూ, బిఈడీ గుంటూరులోనూ పూర్తిచేశారు. 2000లో ఉపాధ్యాయుడిగా సాలూరు మున్సిపాలిటీ పరిధిలోని బంగారమ్మపేట ప్రాథమికోన్నత పాఠశాలలో ఉద్యోగ బాధ్యతల్లో చేరారు. ఆ తర్వాత ప్రధానోపాధ్యాయుడిగా అదే పాఠశాలలో ఉద్యోగోన్నతి పొందారు.



పిల్లల్లో భయాన్ని పోగొడుతూ...

పిల్లల్లో గణితం పట్ల నెలకొన్న తెలియని భయాన్ని పోగొట్టేందుకు ఆయన తనవంతుగా కృషి చేస్తున్నారు. గణితంపై విద్యార్థుల్లో ఆసక్తి పెంచడానికి గణితశాస్త్ర కోవిదుడు శ్రీనివాస రామానుజన్ పేరున 2001లో గణిత క్లబ్‌ను స్థాపించారు. ఈ క్లబ్ సేవలు ఉత్తరాంధ్ర స్థాయిలో విస్తరించటం వెనుక ఆయన మిత్రులు ఎంవి గౌరీశంకర్, కె.విశ్వనాథ శాస్త్రి, బి.వీరభద్రరావు, ఎన్.అశోక్‌కుమార్ తదితరులు వెన్నంటి ఉండి తోడ్పాటు అందిస్తున్నారు. ఇప్పటివరకూ లక్షమందికిపైగా విద్యార్థులు ఈ క్లబ్ ద్వారా నిర్వహించిన టాలెంట్ టెస్టుల్లో పాల్గొన్నారు. విద్యార్థి దశలోనే గణితంపై పట్టు సాధిస్తే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించొచ్చుననే అవగాహన కల్పిస్తూ క్లబ్ సేవలను కొనసాగిస్తున్నారు. డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.రామానుజన్‌మేథ్స్‌క్లబ్‌ఆర్గ్ అనే వెబ్‌సైట్‌ను కూడా నిర్వహిస్తున్నారు.

సొంత డబ్బుతో గ్రంథాలయం

రజనీకాంత్ ప్రతినెలా రూ.12 వేలు చొప్పున వెచ్చించి, పేద విద్యార్థులు, నిరుద్యోగ యువత కోసం గణిత గ్రంథాలయాన్ని నిర్వహిస్తున్నారు. గణిత పుస్తకాలు, మేగజైన్లు, దినపత్రికలు, పోటీపరీక్షలకు ఉపయోగపడే మెటీరియల్స్‌ను అందుబాటులో ఉంచారు. గణితంతోపాటు ఇతర పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువకులకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటోంది.

సామాజిక సేవల్లోనూ ముందంజ

పట్టణానికి దూరంగా ఉన్న ఈ పాఠశాలకు విద్యార్థుల రాకపోకల కోసం ఏడేళ్లుగా రెండు ఆటోలు ఏర్పాటు చేశారు. వాటికి ప్రతినెలా రూ.6000 వరకూ చెల్లిస్తున్నారు. రజనీకాంత్ సామాజిక సేవలను గుర్తించిన గత కలెక్టర్ డాక్టర్ హరిజవహర్‌లాల్ స్వయంగా పాఠశాలకు వచ్చి సన్మానించి మరీ వెళ్లారు.

- యడవల్లి శ్రీనివాసరావు

పలు అవార్డులు

2019లో బెంగుళూరు నేషనల్ వరుచ్యువల్ యూనివర్శిటీ నుంచి గౌరవ డాక్టరేట్
2019లో ఢిల్లీ తెలుగు అకాడమీ ప్రతిభా పురస్కారం
2018లో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు
2010లో రాష్ట్ర ఉగాది పురస్కారం
2006, 2007, 2010లో మూడుసార్లు కలెక్టర్ నుంచి ప్రశంసాపత్రాలు
2010లో రోటరీ ఎక్సలెన్స్ అవారు

నేర్చుకుంటే గణితం సులభమే...

గ్రామీణ విద్యార్థుల్లో గణితం పట్ల ఉన్న భయాందోళనలు పోగొట్టి సులభంగా అవగాహన పెంచుకోవటానికి మేథ్స్ క్లబ్ ద్వారా ఏటా ప్రతిభా పరీక్షలు నిర్వహిస్తున్నాం. గత 23 సంవత్సరాలుగా జిల్లా స్థాయిలో పదో తరగతి విద్యార్థులకు ప్రతిభా పరీక్షలు నిర్వహిస్తున్నాం. గత కొన్నేళ్లుగా గణిత గ్రంథాలయం కూడా నిర్వహిస్తున్నాను. ఫ్లోచార్టులు, టిఎల్ఎం, కృత్యపద్ధతులను ఆచరిస్తున్నా. ఎలాంటి సంకోచం లేకుండా పిల్లలు మాట్లాడే స్వేచ్ఛతో సందేహాలు నివృత్తి చేసుకుంటున్నారు. గణితంలో నేను చేస్తున్న కృషికి గాను 2019లో బెంగుళూరు నేషనల్ వరుచ్యువల్ యూనివర్శిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది.

- డాక్టర్ రంభ రజనీకాంత్,
రామానుజన్ మేథ్స్ క్లబ్ , వ్యవస్థాపకులు.

రంగవల్లి





సి.పుష్పకుమారి,
కమ్మవారిపాలెం
కందుకూరు మండలం,
నెల్లూరుజిల్లా.

5 చుక్కలు 3 వచ్చే వరకు
(మధ్య చుక్క)

ముగ్గులు పంపాల్సిన మా చిరునామా :
మెయిల్ ఐడి : jeevanapageps@ gmail.com
వాట్సాప్ : 83329 25496



'ఫ్యామిలీ స్టార్' నాకు బాగా కనెక్ట్ అయ్యింది

విజయ్ దేవరకొండ హీరోగా 'ఫ్యామిలీ స్టార్' సినిమా తెరకెక్కుతోంది. 'గీత గోవిందం' తీసిన పరశురామ్ దీనికి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ జరుపుకుంటోంది. షూట్ నిమిత్తం విదేశాల్లో ఉన్న విజయ్ ఇటీవలే మీడియాకు ఇంటర్వ్యూ ఇచ్చారు. 'నేను చేసిన అన్ని సినిమాల కన్నా 'ఫ్యామిలీ స్టార్' మూవీతో బాగా కనెక్టయ్యాను. ఇది నా స్టోరీలానే అనిపించింది. పిల్లలకు మంచి భవిష్యత్తు ఇవ్వాలని పెద్దవాళ్లు చూస్తుంటారు. ఉన్నత విద్య అందించాలని చూస్తారు. కంఫోర్ట్ లైఫ్ ఉండాలనుకుంటారు. నా తల్లిదండ్రులు కూడా అలానే కష్టపడ్డారు. ముఖ్యంగా సినిమాలోని క్యారెక్టర్తో నేను బాగా కనెక్టయ్యాను. ఈ సినిమా కోసం నేను చాలా ఆసక్తిగా ఎదురుచూస్తున్నా' అని అన్నారు.

విజయ్ సినిమాకు టైటిల్ ఖరారు కాలేదు



'విజయ్ (దళపతి 68) నటించనున్న తాజా సినిమాకు సంబంధించిన కొన్ని అప్‌డేట్స్ సోషల్ మీడియాలో కన్పిస్తున్నాయి. అవేమీ వాస్తవాలు కాదు' అని నిర్మాత అర్చన కల్పతి ట్వీట్ చేశారు. 'మాపై చూపిస్తోన్న అభిమానానికి ధన్యవాదాలు. దర్శకుడు వెంకట్ ప్రభు ఓ కొత్త కథతో రానున్నారు. బాస్, పజిల్ అనే టైటిల్స్ దీనికి సంబంధించినవి కావు. కొత్త సినిమా టైటిల్‌ను త్వరలోనే ప్రకటిస్తాం. అప్పటివరకూ వేచి ఉండండి' పేర్కొన్నారు. ఇదిలావుండగా విజయ్ సినిమా షూటింగ్ విదేశాల్లో జరుగుతోంది. మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా, ప్రభుదేవా, స్నేహ, లైలా ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు.

నిజమైన సూపర్ స్టార్ మమ్ముట్టి జ్యోతిక



'నేను చాలామంది దక్షిణాదికి చెందిన సూపర్‌స్టార్స్‌తో కలిసి నటించాను. కానీ, నిజమైన సూపర్‌స్టార్ మమ్ముట్టినే' అని హీరోయిన్ జ్యోతిక తెలిపారు. నవంబర్ 23న విడుదలైన కాథల్-ది కోర్ పలువురి ప్రశంసలు అందుకుంటున్న విషయం తెలిసిందే. జీయోబాబీ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో స్వలింగ సంపర్కుల పట్ల సమాజం ప్రవర్తించే తీరుపై చూపించారు. ఈ సినిమాలో హీరోయిన్‌గా నటించిన జ్యోతిక మమ్ముట్టితో కలిసి నటించటం ద్వారా వచ్చిన అనుభూతి గురించి సామాజిక మాధ్యమం ద్వారా తెలిపారు. 'ఇలాంటి వైవిధ్యమైన పాత్రను ఎందుకు ఎంచుకున్నారని నేను సెట్లో అడిగాను. ఆయన ఇలా సమాధానం చెప్పారు. 'అసలు హీరో అంటే విలన్లను కొట్టడం, యాక్షన్, రొమాంటిక్ సన్నివేశాల్లో నటించడం మాత్రమే కాదు. వైవిధ్యమైన పాత్రలను ఎంచుకోవాలి. ఎలాంటి పాత్రల్లోనైనా నటించగలగాలి' అని వివరించారు.

'ప్రతిగాథలో..' సలార్ రెండోపాట విడుదల



ప్రభాస్, శృతిహాసన్ హీరోహీరోయిన్లుగా నటించిన చిత్రం 'సలార్'లోని 'ప్రతిగాథలో..' అంటూ సాగే రెండోపాటను చిత్ర నిర్మాతలు విడుదల చేశారు. శుక్రవారంనాడు ఈ సినిమా విడుదల కానున్న విషయం తెలిసిందే. కృష్ణకాంత్ ఈ పాటను రచించారు. పృథ్వీరాజ్‌సుకుమారన్ కూడా ఇందులో నటించారు. ప్రశాంత్‌నీల్ దర్శకత్వం వహించారు.

యు/ఎతో 'డెవిల్'



నందమూరి కల్యాణ్‌రామ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'డెవిల్'. 'ది బ్రిటిష్ సీక్రెట్ ఏజెంట్' అనేది ఉపశీర్షిక. ఈ చిత్రానికి అభిషేక్ నామా దర్శకత్వం వహిస్తున్నారు. డిసెంబర్ 29న ఈ చిత్రం విడుదల కానుంది. తాజాగా ఈ చిత్రం సెన్సార్ పూర్తి చేసుకుంది. సెన్సార్ బోర్డు ఈ సినిమాకు యూ/ఏ సర్టిఫికేట్ ఇచ్చింది. 2 గంటల 40 నిమిషాల నిడివితో ఈ సినిమా ఉండనుంది.

ఫిబ్రవరి 9న 'ఊరు పేరు భైరవకోన'



సందీప్ కిషన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'ఊరు పేరు భైరవకోన'. వర్ష బొల్లమ్మ హీరోయిన్‌గా చేస్తున్నారు. ఈ చిత్రాన్ని 2024 ఫిబ్రవరి 9న విడుదల చేయనున్నట్లు చిత్రబృందం తాజాగా ప్రకటించింది. విడుదల తేదీ తెలుపుతూ కొత్త పోస్టర్‌ను విడుదల చేసింది. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ అనిల్ సుంకర సమర్పణలో రాజేశ్ దండా ఈ సినిమాని నిర్మిస్తున్నారు. వీఐ ఆనంద్ దర్శకత్వం వహిస్తున్నారు.

కమల్ అభినందన



నిర్మాత, దర్శకుడు కేఆర్ తాజాగా 'ఆయిరం పొర్కాసుగల్' సినిమాను తీశారు. శుక్రవారం ఈ సినిమా విడుదల కానుంది. ఒక టిక్కెట్టు కొన్నవారికి మరొక టిక్కెట్టు ఉచితం ఇచ్చే ఆఫర్‌ను ఆయన ప్రకటించారు. విద్యార్థ్ శరవణన్-అరుంధతినాయర్ ప్రధాన పాత్రల్లో నటించారు. ఈ ఆఫర్ బాగుందని కోలీవుడ్ హీరో కమల్‌హాసన్ అభినందించారు.

సంజు సెంచరీ

మూడో వన్డేలో దక్షిణాఫ్రికాపై 78పరుగుల తేడాతో గెలుపు
వన్డే సిరీస్ 2-1తో భారత్ కైవసం



సంజు శాంసన్
(108 పరుగులు; 114బంతుల్లో 6ఫోర్లు 3సిక్సర్లు)

పార్ల్: వన్డే సిరీస్‌ను టీమిండియా కైవసం చేసుకుంది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి 296పరుగులు చేయగా.. ఆ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో దక్షిణాఫ్రికా జట్టు 45.5ఓవర్లలో 218పరుగులకు ఆలౌటైంది. దీంతో మూడు వన్డేల సిరీస్‌ను భారత్ 2-1తో కైవసం చేసుకుంది.

తొలుత సంజూ శాంసన్(108: 113 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్సర్లు) సెంచరీకి తోడు తెలుగు కుర్రాడు తిలక్ వర్మ(52), రింకూ సింగ్(38) కూడా బ్యాట్ ఝుళిపించడంతో భారతజట్టు నిర్ణీత 50 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి 296పరుగులు చేసింది. టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన టీమిండియాను నయా ఓపెనర్ రజత్ పటీధర్(22), సాయి సుదర్శన్(10) నిరాశపరిచారు. ఆ తర్వాత సంజు శాంసన్.. కెప్టెన్ కెఎల్ రాహుల్(21), తెలుగు కుర్రాడు తిలక్ వర్మ సాయంతో స్కోర్‌బోర్డును పరుగులు పెట్టించాడు. వీరిద్దరూ సఫారీ బౌలర్లను దీటుగా ఎదుర్కొన్నారు. ఈ క్రమంలో సంజు శాంసన్ వన్డేల్లో తొలి శతకం, తిలక్ వర్మ తొలి అర్ధశతకాలను పూర్తి చేసుకున్నారు. నాలుగో వికెట్‌కు రికార్డు స్థాయిలో 116 పరుగులు జోడించారు. మొదట్లో నిదానంగా ఆడిన ఈ ఇద్దరూ కుదురుకున్నాక ధాటిగా ఆడి జట్టు స్కోర్ 200 దాటించారు. టీమిండియా 10 ఓవర్లకు 2 వికెట్ల నష్టానికి 59 పరుగులు చేసింది. కెప్టెన్ కేఎల్ రాహుల్(21)ను ముల్డర్ పెవిలియన్ పంపాడు. దాంతో, భారత్ 101 వద్ద మూడో వికెట్ కోల్పోయింది. కేశవ్ మహరాజ్ ఓవర్లో భారీ షాట్ ఆడి ముల్డర్ చేతికి చిక్కడంతో తిలక్ ఖతర్నాక్ ఇన్నింగ్స్‌కు తెరపడింది. దాంతో, 217 రన్స్ వద్ద భారత్ నాలుగో వికెట్ పడింది. దక్షిణాఫ్రికా బౌలర్లు హెండ్రిక్స్‌కు మూడు, బర్గర్‌కు రెండు, విలియమ్స్, ముల్డర్, మహరాజ్‌కు ఒక్కో వికెట్ దక్కాయి.

297పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో దక్షిణాఫ్రికా ఓపెనర్ జోర్జి(81) అర్ధసెంచరీ మినహా మిగతా బ్యాటర్స్ విఫలమయ్యారు. కెప్టెన్ మార్క్రమ్(36) ఆడినా ప్రయోజనం లేకపోయింది. అర్ష్‌దీప్‌కు నాలుగు, ఆవేశ్‌ఖాన్, సుందర్‌కు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ సంజు శాంసన్‌కు లభించింది. ఇక ఇరుజట్ల మధ్య రెండు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్ మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. ఈ మ్యాచ్‌కు కోహ్లి, రోహిత్, బుమ్రా తదితరులు బరిలోకి దిగనున్నారు.

టి20, దేశవాళీ క్రికెట్‌తోపాటు ఐపిఎల్‌లో సత్తా చాటుతూ టీమిండియా జట్టులో చోటు దక్కించుకోవడం బ్యాటింగ్‌లో నిరాశపరిచి చోటు కోల్పోవడం ఇదీ సంజు పరిస్థితి. ఇప్పటివరకు 15వన్డేలు ఆడిన సంజు శాంసన్ కేవలం 3 అర్ధసెంచరీలు మాత్రమే కొట్టాడు. దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్‌కు ఎంపికైన సంజు తొలి వన్డేలో బ్యాటింగ్ రాకపోయినా.. రెండో వన్డేలో కేవలం 12పరుగులే చేసి మరోసారి నిరాశపరిచాడు. మూడో వన్డేలో అందరి అంచనాలను పటాపంచలు చేస్తూ 29ఏళ్ల కేరళ బ్యాటర్ కెరీర్‌లో తొలి సెంచరీ కొట్టి తనలే సత్తా ఇంకా తగ్గలేదని నిరూపించుకున్నాడు.

పూజ, స్నేహ్ రాణా మెరుపులు

- ఆస్ట్రేలియా 219ఆలౌట్
- భారత్ 98/1



పూజ వస్త్రాకర్
16-2-53-4

ముంబయి: ఆస్ట్రేలియా మహిళలతో జరుగుతున్న ఏకైక టెస్ట్‌లో భారత మహిళలు సత్తా చాటారు. వాంఖడే వేదికగా గురువారం నుంచి ప్రారంభమైన టెస్ట్‌లో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియాను కేవలం 219పరుగులకే టీమిండియా బౌలర్లు ఆలౌట్ చేశారు. బౌలింగ్‌లో పూజ వస్త్రాకర్(4/53), స్నేహ్ రాణా(3/56), దీప్తి శర్మ(2/45) రాణించి ఆస్ట్రేలియాను కట్టడి చేశారు. ఇంగ్లండ్‌ను 347 పరుగులతో చిత్తు చేసిన హర్మన్‌ప్రీత్ కౌర్ సేన ఆస్ట్రేలియాపైనే రాణించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా ఆది నుంచి తడబడింది. తొలి ఓవర్‌లోనే ఓపెనర్ ఫొబె లిచ్‌ఫీల్డ్(0) రనౌటయ్యింది. ఆ తర్వాతి ఓవర్లోనే డేంజరస్ ఎలిసా పెర్రీ(4)ని పూజా వస్త్రాకర్ వెనక్కి పంపింది. బేత్ మూనీని(40), సథర్‌లాండ్(16) ఇన్నింగ్స్ నిర్మించే ప్రయత్నం చేశారు. కానీ వరుస విరామాల్లో భారత బౌలర్లు వికెట్లు తీస్తూ కంగారూలను ఒత్తిడిలోకి నెట్టారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన భారత్ వికెట్ నష్టపోయి 98 పరుగులు చేసింది. షెఫాలీ వర్మ(40) ఔట్ కాగా.. స్మృతి మంధానా(43), స్నేహ్ రాణా(4) క్రీజ్‌లో ఉన్నారు. మంధాన-షెఫాలీ కలిసి తొలి వికెట్‌కు 90పరుగులు జతచేశారు. భారతజట్టు ఇంకా 121పరుగులు వెనుకబడి ఉంది.

స్కోర్‌బోర్డు..

ఆస్ట్రేలియా మహిళల తొలి ఇన్నింగ్స్: మూనీ (సి)స్నేహ్ రాణా (బి)పూజ వస్త్రాకర్ 40, లిచ్‌ఫీల్డ్ (రనౌట్) రోడ్రిగ్స్/యాస్తికా భాటియా 0, ఎలీసా పెర్రీ (బి)పూజ వస్త్రాకర్ 4, మెక్‌గ్రాత్ (సి)గైక్వాడ్ (బి)స్నేహ్ రాణా 50, హీలీ (బి)దీప్తి 38, సథర్లాండ్ (ఎల్‌బి)పూజ వస్త్రాకర్ 16, గార్డినర్ (సి)యాస్తికా భాటియా (సి)యాస్తికా భాటియా (బి)పూజ వస్త్రాకర్ 11, జాన్సన్ (ఎల్‌బి)దీప్తి 19, కింగ్ (సి)యాస్తికా భాటియా (బి)స్నేహ్ రాణా 5, కిమ్ గ్రాత్ (నాటౌట్) 28, లారెన్ ఛెల్టీ (సి)మంధాన (బి)స్నేహ్ రాణా 6, అదనం 2. (77.4ఓవర్లలో ఆలౌట్) **వికెట్ల పతనం:** 1/2, 2/7, 3/87, 4/103, 5/143, 6/159, 7/160, 8/168, 9/198, 10/219 **బౌలింగ్:** రేణుక 7-0-35-0, పూజ 16-2-53-4, స్నేహ్ రాణా 22.4-4-56-3, గైక్వాడ్ 13-4-29-0, దీప్తి 19-3-45-2.

ఇండియా మహిళల ఇన్నింగ్స్: షెఫాలీ వర్మ (ఎల్‌బి)జాన్సన్ 40, స్మృతి మంధాన (బ్యాటింగ్) 43, స్నేహ్ రాణా (బ్యాటింగ్) 4, అదనం 11. (19 ఓవర్లలో వికెట్ నష్టానికి) 98పరుగులు. **వికెట్ల పతనం:** 1/90 **బౌలింగ్:** లారెన్ 4-2-12-0, గ్రాత్ 4-0-34-0, ఎలీసా పెర్రీ 4-0-31-0, గార్డినర్ 5-3-8-0, జాన్సన్ 2-1-4-1

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68